15-02Pg1exHMNWJQEBPRCKLT.qxd:15-02Pg1exHMNWJQEBPRCKLT.qxd 01/01/01 7:37 AM Page 1

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM గుంటూరు : fb.com/vaartha

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-2-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 14 పేజీలు: 12 వెల: 6.50



15-2pg2exHMNWJQE.qxd:15-2pg2exHMNWJQE.qxd 01/01/01 9:49 AM Page 1






శుక్రవారం జమ్ముకాశ్మీర్‌లోని పుల్వామా సెక్టార్‌లో అమరవీరులకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

# పరస్పరం అంగీకారం

>> విషయాల్లో మరింత ముందుకు వెళుతున్నారని ఐరోపా చర్చలు అమెరికాకు సంతృప్తికరంగా లేవన్నారు. ఇక చైనా మరింత భయంకరంగా ఉందని, కొత్తగా మొదటిసారి హయాంలో వదిలితాం కూడా పన్నులుండేవి కావని, తాను పన్నులువేస్తున్న వందల బిలియన్ డాలర్ల పన్నుల రూపంలో వసూలుచేసామని ఆయన గుర్తుచేసారు. మిషన్ 500 పేరిట 2030నాటికి 500 బిలియన్ డాలర్ల ఇరుదేశాలమధ్య వాణిజ్య లక్ష్యం అని ట్రంప్ మోడీలు ప్రకటించారు. ఇరుదేశాధినేతల మధ్యజరిగిన చర్చల్లో కొత్తగా పదేళ్ల అమెరికా భారత్ కీలక రక్షణరంగ భాగస్వామ్య ఒప్పందంపై సంతకంచేసారు. జావెలిన్ యాంటీ ట్యాంక్ క్షిపణులు, స్ట్రైకర్ సాయుధ పోరాట వాహనాలు, మరో ఆరు పి8ఐ మారిటైమ్ సర్వెలెన్స్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల కొనుగోలుకు ఒప్పందంజరిగింది. ఆయుధనిబంధనలపరంగా అంతర్జాతీయ ట్రాఫిక్ నిబంధనలను అనుసరించి సాంకేతికత పరస్పర మార్పిడికి అవగాహనకు వచ్చినట్లు తెలిపారు. అలాగే పరస్పర రక్షణరంగ కొనుగోళ్ల ఒప్పందంతోపాటు ఇరుదేశాలనుంచి రక్షణకొనుగోళ్లకు సంబంధించిన ఒప్పందంపైనా సంతకాలుచేసినట్లు తెలిపారు. క్షిపణి, మారిటైమ్, సముద్రగర్భంలో యుద్ధసామగ్రి వంటి వాటిపైనా చర్చలు జరిగాయి. అలాగే ఐదోతరం యుద్ధవిమానాలు, సముద్రగర్భంలోని ఆయుధ వ్యవస్థను భారత్‌కు సరఫరాచేసేందుకు అంగీకారానికి వచ్చారు. బోయింగ్ సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్‌కు సంబంధించి 60యూనిట్లు సరఫరా, తక్కువ ఫ్రీక్వెన్సీ యాక్టివ్ టోడ్ సోనార్స్ సరఫరా వంటి వాటికి ఒప్పందాలు కుదిరాయి. రెండుదేశాలమధ్య మిషన్500 పేరిట ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు చేరుకోవాలని లక్ష్యం విధించారు. అన్నిరంగాలను కవర్‌చేస్తూ వాణిజ్య ఆంక్షలను పరిష్కరించుకుంటూ పరస్పర సుంకాలపైనా ఒక అవగాహనకు వచ్చినట్లు తెలిపారు. అమెరికాలో 7.355 బిలియన్ డాలర్ల భారత పెట్టుబడులకు ఆమోదం తెలిపిదే 3వేలకుపైగా హైక్వా లిటీ ఉద్యోగాల కల్పనకు అమెరికా ముందుకువచ్చింది. ఇరుదేశాల ప్రభుత్వాలు, విద్యారంగం, ప్రైవేటురంగాల్లో ఆధునిక టెక్నాలజీల అన్వయింపుకోసం కూడా ఒప్పందంజరిగింది. భావితరం డేటాసెంటర్లు, కృత్రిమమేధ ప్రాసెసింగ్ భాగస్వామ్యాలను కూడా ప్రకటించారు. ఇక అంతరిక్షం, ఇంధనం, బయోటెక్నాలజీ రంగాల్లో ఇండస్ ఇన్నొవేషన్‌పేరిట రెండుదేశాలు సంయుక్త కృషిచేస్తాయి. అమెరికాలో భారత ఫార్మారంగం విస్తరణకు అంగీకారం కుదిరింది. సంక్లిష్ట ఔషధాలను అమెరికాలోకూడా తయారుచేసేందుకు ట్రంప్ మోడీలమధ్య అవగాహనేర్పడింది. లిథియం కోబాల్ట్ వంటి ఖనిజవనరులు హైటెక్ పరిశ్రమలకు మరింతగా అందించేందుకు నిర్ణయించారు. ఆదునిక టెక్నాలజీలపై మరింత పరిశోధనలకు రెండుదేశాల మధ్య ఒప్పందం చేసుకున్నారు. ఇంధన సంరక్షణ భాగస్వామ్యంపట్ల ప్రధాని మోడీ అమెరికా ట్రంప్‌లమధ్య కీలక అవగాహనకు వచ్చారు. అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీలో శాశ్వత సభ్యత్వానికి ట్రంప్ మద్దతిచ్చారు. భారత్ అమెరికా 123 పౌర అణు ఒప్పందంతో మరింత ముందుకువెళ్లాలని, అమెరికా డిజైన్‌తో ఉన్న రియాక్టర్లను భారత్‌లోస్థాపించేందుకు నిర్ణయించారు. ఉగ్రవాదంపై ఉమ్మడిపోరుకు ఇరుదేశాలు అంగీకరించాయి. అలాగే ముంబయిదాడులు, పఠాన్‌కోట్ దాడులకు పాకిస్తాన్‌దే బాధ్యత అని మోడీ ప్రకటించారు. ఇక ముంబయిదాడుల సూత్రధారి తహవూర్ రాణాను భారత్‌కు అప్పగించేందుకు ట్రంప్ అంగీకరించారు.

## మోడీకి ట్రంప్ అపురూప కానుక




**వాషింగ్టన్, ఫిబ్రవరి 14:** అమెరికాలో పర్యటించిన ప్రధాని మోడీకి అగ్రరాజ్యం అద్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ అరుదైన బహుమతిని మోడీకి ఇచ్చారు. రెండు రోజుల పర్యటనలో ఉన్న ప్రధానిమోడీని అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ కలుసుకుని వివిధ అంశాలపై ఆయనతో భేటీ అయ్యారు. మిమ్మల్ని నేను చాలా మిస్ అయ్యాను మిత్రమా అని మోడీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇరువురూ కాసేపు ముచ్చటించుకన్నారు. తన ఫ్రెండ్‌మ ఓడీకి ట్రంప్ స్పెషల్ గిఫ్ట్ ఇచ్చారు. తాను స్వయంగా రాసిన అవర్ జర్నీ టుగెదర్ అనే పుస్తకాన్ని ప్రధానికి కానుకగా ఇచ్చారు. అది ఒక ఫోటోబుక్ గతంలో ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలోకీలక సందర్భాలు, స్పెషల్ ఈవెంట్స్‌లో మోడీతో ఉన్న ఫోటోలను అందులో చేర్చారు. 2019లో మోడీ అమెరికాలో పర్యటించారు. హూస్టన్‌లో నిర్వహించిన హౌడీమోడీ కార్యక్రమం నిర్వహించారు. తర్వాత 2020లో ట్రంప్ భారత్‌పర్యటనకు వచ్చినపుడు నమస్తేట్రంప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ రెండు కార్యక్రమాల ఫోటోలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ఈ బుక్‌పై 'మిస్టర్ ప్రైమ్ మినిస్టర్ యూ ఆర్ గ్రేట్' అని రాసి ట్రంప్ సంతకంచేసి మోడీ చేతికి ఇచ్చారు. అంతేకాకుండా ఈపుస్తకంలో ఇద్దరూ ఉన్న ఫోటోలను మోడీకి ట్రంప్ చూపించారు.

## అక్రమ వలసదారులను తీసుకొస్తాం
### అమెరికాలో ప్రధాని మోడీ

**వాషింగ్టన్, ఫిబ్రవరి 14:** చట్టవిరుద్ధంగా అమెరికాలో నివసిస్తున్న భారతీయులను స్వదేశానికి తీసుకువస్తామని ప్రధాని నరేంద్రమోడీ అమెరికా గడ్డమీదనే ప్రకటించారు. ఒకదేశంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించేవారికి అక్కడ నివసించే హక్కు ఉండదని ఈ విదానం ప్రపంచమంతటికీ వర్తిస్తుందని అన్నారు. ఇరుదేశాల అధినేతలమధ్య జరిగిన కీలకభేటీ అనంతరం ట్రంప్, మోడీ ఇద్దరూ కలిసి మీడియా సమావేశంలోపాల్గొన్నారు. ఈసందర్భంగా అక్రమ ఇమ్మిగ్రేషన్‌పైమీడియా ప్రశ్నలకు ట్రంప్ సమాధానం ఇచ్చారు. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న 104 మంది భారతీయులను ఇటీవలే తిప్పిపంపించింది. యువత పేదరికంలో ఉన్నవారు మోసపూరితంగా వలసదారులుగా మారుతున్నాంన్నారు. డబ్బు, ఉద్యోగాల ఆశచూపించి కొంతమంది వీరిని మోసంచేస్తున్నారని వారు అటుపై అక్రమ వలసదారులవుతున్నారని, వారికి తెలియకుండానే మానవ అక్రమరవాణా కూపంలోకి వెళుతున్నారన్నారు. ఈ దారుణాలను సమూలంగా నిర్మూలించాల్సి న అవసరం ఉందని ఈ ప్రయత్నాల్లో భారత్‌కు ట్రంప్ పూర్తి సహకారం అందిస్తారని ఆశిస్తున్నట్లుమోడీ అన్నారు.

## తహవ్వుర్‌రాణాను భారత్‌కు అప్పగించేందుకు ట్రంప్ గ్రీన్‌సిగ్నల్!

**వాషింగ్టన్, ఫిబ్రవరి 14:** ముంబై ఉగ్రదాడి ఘటనలో దోషిగా తేలిన తహవూర్ రాణాను భారత్‌కు అప్పగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 26/11 ముంబై ఉగ్రదాడిలో నిందితుడైన అత్యంత ప్రమాదకరమైన వ్యక్తిని భారత్‌కు అప్పగిస్తున్నామంటూ ట్రంప్ విలేకరులతో అన్నారు. అంతేకాదు మరింత మంది నేరగాళ్ల విషయంలోనూ అదే నిర్ణయం తీసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలో ట్రంప్ నుంచి ఈ ప్రకటన వచ్చింది. ట్రంప్ ప్రకటనపై మోదీ హర్షం వ్యక్తం చేశారు. ముంబై ఉగ్రదాడి నేరస్థుడిని భారత్‌కు అప్పగించే ప్రక్రియను వేగవంతం చేసిన ట్రంప్‌నకు ధన్యవాదాలు తెలిపారు. 64 ఏళ్ల తహవూర్ రాణా పాకిస్థాన్ మూలాలతో ఉన్న కెనడా పౌరుడు. 26/11 ముంబయి ఉగ్రదాడుల్లో కీలక సూత్రధారిగా అతడిని గుర్తించారు. ప్రస్తుతం రాణా లాస్ ఏంజెల్స్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. అతడిని భారత్‌కు అప్పగించాలని భారత్ గత కొంతకాలంగా అమెరికాను కోరుతోంది. భారత ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి అమెరికా గతంలోనే సానుకూలంగా స్పందించింది.

## పసిడి మరింత పైపైకి
### 24 కేరెట్లు: 10 గ్రా రూ. 87,050

**ముంబయి, ఫిబ్రవరి 14:** ఈ ఏడాది ప్రారంభం నుంచి కూడా బంగారంధరలు పైపైకి పోతూనే ఉన్నాయి. తాజాగాసరికొత్త రికార్డుకూడా నమోదు చేసింది. గడచిన కొద్దిరోజులుగా బంగారం నిరాఘాటంగా ధరలు పెరుగుతున్నాయి. ఒక్క రోజు లోనే రూ.1300 పెరిగింది. రాజధాని ఢిల్లీలో పదిగ్రాముల మేలిమి బంగారం అంటే 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారంధరలు రూ.89,400కకు చేరింది. గురువారం రోజు 88,100గా ఉన్న ధరలు ఒక్కసారిగా 89వేలు దాటేసింది. అలాగే వెండిదరలు కూడా కిలో ఒక్కింటికి మళ్లీ లక్షరూపాయల మార్కుదాటింది. గురువారం రూ.98 వేలుగా ఉన్న దీనిధర ఒక్కోరోజులోనే రూ.2వేలు పెరిగి నాలుగునెలల గరిష్టానికి చేరింది. 99.5శాతం స్వచ్ఛత కలిగిన బంగారం సైతం రూ.1300 పెరిగి రూ.89వేలకు చేరింది. ఫ్యూచర్ కమోడిటీ మార్కెట్‌లో ఏప్రిల్ డెలివరీ బంగారం కాంట్రాక్టు పదిగ్రాములకు రూ.184 పెరిగి రూ.85,993కి చేరి పెరుగుదలనమోదుచేసింది. ఇక అంతర్జాతీయంగా బంగారం ఔన్సు ధర శుక్రవారం అత్యధికంగా 2960 డాలర్లకు చేరింది. వెండికూడా ఔన్స్ బంగారందర 34 డాలర్లకు చేరింది.

# 'స్వచ్ఛాంధ్ర'వైపు కదులుదాం..

>> వరకు బాధ్యత తీసుకోవాలని సిఎం పిలుపునిచ్చారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం ఆ కార్యాలయంలో ఉండే ఉద్యోగులు అంతా కలిసి పరిశుభ్రత, ఆహ్లాదకర వాతావరణం ఉండేలా కృషి చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడంలో బాధ్యత లేకుండా వ్యవహరించాలని అన్నారు. రోడ్లపై చెత్త వేసి, చెట్లు నరికి వేసి, అంతా క్లీన్ గా ఉండాలి, పచ్చదనం ఉండాలి అని స్లోగన్స్ ఇస్తే కుదరదని అన్నారు. పౌరులు కూడా బాధ్యత వహిస్తే స్వచ్ఛాంధ్ర కల సాకారం అవుతుందని సిఎం సూచించారు. వనరుల పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా అంతా కృషి చేయాలి అన్నారు. గాలిలో నాణ్యతను పరిశీలించి సమస్య ఉన్న ప్రాంతాల్లో తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పెరుగుతున్న సమయంలోనే గుర్తించి ఇప్పటి నుంచే అక్కడ పరిష్కారం దిశగా పనిచేయాలని సూచించారు. ఈ విషయంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వంటి శాఖల అధికారులు ఫోకస్ పెట్టాలని సూచించారు.

**జిల్లాలకు ర్యాంకులు:** మొదటి స్థానంలో ఎన్టీఆర్ జిల్లా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన కార్యక్రమాలపై అధికారులు ప్రోగ్రెస్ ను సీఎంకు వివరించారు. మొత్తం 14 ఇండికేటర్స్ లో పెట్టుకున్న లక్ష్యాలను ముఖ్యమంత్రి ముందు ఉంచారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్స్, డోర్ టు డోర్ కలక్షన్, సాలిడ్ వేస్ట్ సెగ్రిగేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, కమ్యునిటీ సోక్ పిట్స్, క్లీన్ విలేజ్, ఒడిఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్ వంటి అంశాల్లో ఆయా జిల్లాల్లో ప్రగతిపై సిఎంకు వివరించారు. ఈ 14 ఇండికేటర్స్ ఆధారంగా జిల్లాకు ర్యాంకులు ఇచ్చారు. పట్టణాభివృద్ధి శాఖ పరిథిలో డోర్ టు డోర్ కలెక్షన్ కు 15 పాయింట్లు, సోర్స్ సెగ్రిగేషన్ కు 35 పాయింట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కు 20 పాయింట్లు, లెగసీ వేస్ట్ క్లియరెన్స్ కు 10 పాయింట్లు, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కు 20 పాయింట్లు ఇచ్చారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి 15 పాయింట్లు, పబ్లిక్ టాయిలెట్స్ కు 10 పాయింట్లు, కమ్యునిటీ సోక్ పిట్స్ కు 10 పాయింట్లు, 100 శాతం డోర్ టు డోర్ చెత్త కలెక్షన్ కు 10 పాయింట్లు, ఓడిఎఫ్ ప్లస్ మోడల్ కు 20 పాయింట్లు చొప్పున ఇచ్చారు. ఇలా మొత్తం 200 పాయింట్ల ఆధారంగా జిల్లాల ప్రోగ్రెస్ పై ర్యాంకులు ఇచ్చారు..మొదటి స్థానంలో ఎన్టీఆర్ జిల్లా మొత్తం 200 పాయింట్లకు గాను 129 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. 127పాయింట్లతో విశాఖ రెండో స్థానంలో, 125తో ఈస్ట్ గోదావరి 3వ స్థానం, 122తో అనంతపురం జిల్లా 4వస్థానం, 120 పాయింట్లతో అన్నమయ్య 5వ స్థానం, శ్రీకాకుళం 6వ స్థానంలో ఉన్నాయి. 118 పాయింట్లతో కడప 7వ స్థానం, 117 పాయింట్లతో గుంటూరు 8వ స్థానం, 115 పాయింట్లతో బాపట్ల 9వ స్థానం, 115 పాయింట్లతో నెల్లూరు 10వ స్థానం, 115 పాయింట్లతో వెస్ట్ గోదావరి 11వ స్థానం, 113 పాయింట్లతో అనకాపల్లి 12వ స్థానం, 111 పాయింట్లతో తిరుపతి 13వ స్థానంలో, 109 పాయింట్లతో కాకినాడ 14వ స్థానంలో ఉన్నాయి. 108 పాయింట్లతో ఏలూరు 15వ స్థానం, 108 పాయింట్లతో కృష్ణ 16వ స్థానం, 105 పాయింట్లతో కోనసీమ 17వ స్థానం, 105 పాయింట్లతో మన్యం పాడేరు 18వ స్థానం, 105 పాయింట్లతో సత్యసాయి 19వ స్థానం, 103 పాయింట్లతో పల్నాడు 20వ స్థానం, 99 పాయింట్లతో కర్నూలు 21వ స్థానం, 99 పాయింట్లతో ప్రకాశం 22వ స్థానం, 94 పాయింట్లతో నంద్యాల 23వ స్థానం, 93 పాయింట్లతో విజయనగరం 24వ స్థానం, 88 పాయింట్లతో చిత్తూరు 25వ స్థానం, 81 పాయింట్లతో అల్లూరి సీతారామరాజు 26వ స్థానంలో ఉన్నాయి.

# రవాణా సౌకర్యం కల్పిస్తా

>> ముద్దుల తనయుడు సుబ్రహ్మణ్యుడు భూమికి వచ్చారు. జ్ఞాన సముపార్జన కోసం వచ్చిన స్వామి పళని కొండపై వెలిశారు అని చెబుతారు. గొప్ప ఆధ్యాత్మిక కేంద్రమే పళని సుబ్రహ్మణ్యస్వామి క్షేత్రం. దండాయుధపాణిగా, పళని స్వామిగా, మురుగన్‌గా పిలుచుకునే సుబ్రహ్మణ్యస్వామి సేవలో ఉప ముఖ్యమంత్రి పవన్ శుక్రవారం పాల్గొన్నారు. అర్మొలిగు దండాయుధపాణి స్వామి క్షేత్రంలో, ఉచ్చ కాల పూజలో పాల్గొన్నారు. రోప్‌వే ద్వారా ఆలయానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. పవన్‌కళ్యాణ్‌తోపాటు ఆయన కుమారుడు అకీరా నందన్, టీటీడీ బోర్డు సభ్యులు ఆనంద్ సాయి క్షేత్రాన్ని దర్శించారు. పళనిలోని మురుగన్ విగ్రహాన్ని ఆశీవాహం (ప్రాచీన తమిళ సంస్క ృతి) యొక్క పద్దెనిమిది గొప్ప సిద్ధులలో ఒకరైన భోగర్ మహర్షి తొమ్మిదివిషాల లేదా నవపాషాణం మిశ్రమంతో సృష్టించి, ప్రతిష్టించారు. ఆలయ నైరుతి ముఖంలో భోగర్ మహర్షి వారికీ ప్రత్యేక మందిరం ఉంది. పురాణాల ప్రకారం కొండ మధ్యలోని గుహలో భోగర్ మహర్షి వారు ధ్యానం చేస్తూ తన జాగరణను కొనసాగిస్తున్నారని, అక్కడ ఎనిమిది మురుగన్ విగ్రహాలు ఉన్నట్లు చెబుతారు. పళనిలో అత్యంత ముఖ్యమైన పండుగగా పరిగణించే థాయ్‌పూసం, తమిళ థాయ్ నెల (జనవరి 15- ఫిబ్రవరి 15) పౌర్ణమి రోజున జరుపుకుంటారు. కీలకమైన పండుగ పౌర్ణమి రోజుల్లోనే పవన్ కళ్యాణ్ శ్రీ మురుగన్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు.. పూజల అనంతరం పవన్ కళ్యాణ్ ఆలయ పండితులు దైవిక మిశ్రమంగా పిలిచే తేనె, ఖర్జూరం, అరటిపండు, ఎండుద్రాక్ష, బెల్లం కలిపిన పంచమిర్ధం అందించారు. దానిని మహా ప్రసాదంగా ఉప ముఖ్యమంత్రి స్వీకరించారు. అనంతరం ఆలయ ఆవరణలోనే ఉన్న శివాలయంలో పూజలు చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం ఆలయం వెలుపల పవన్ కళ్యాణ్‌మీడియాతో మాట్లాడుతూ పళని సుబ్రమణ్య స్వామి క్షేత్రం నుంచి తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు సులభంగా వచ్చేలా రవాణా సౌకర్యాలు కల్పించడం పై దృష్టి పెడతాం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలియచేస్తాను. అలాగే క్యాబినెట్ దృష్టికి తీసుకు వెళ్తాను. ఇటీవల మహారాష్ట్రలో పర్యటించినప్పుడు కూడా అక్కడి నుంచి తిరుపతి రావడానికి ప్రత్యేక రైలు వేయాలని అక్కడి ప్రజలు, ప్రజా ప్రతినిధులు కోరారు. దీనిపై ఇప్పటికే కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లాను. అలాగే పళని నుంచి కూడా తిరుమలకు కూడా తగిన రవాణా సౌకర్యం కల్పించడం పైన దృష్టి పెడతాం. తమిళనాడులో ఉన్న ఆరు ప్రసిద్ధి సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలను దర్శించాలని తలంపుతో ఇక్కడికి వచ్చాను. ఇతర రాజకీయాల అంశాల మీద స్పందించేందుకు ఇది సమయం కాదు అన్నారు.

# యువతిపై యాసిడ్ దాడి

>> తెలుసుకొన్న గణేష్ శుక్రవారం [illegible] ఆమె స్వగృహానికి వెళ్ళి ఇంటిలో ఒంటరిగా ఉన్న యువతిపై యాసిడ్ పోసి, కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. యువతి గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకొన్నారు. అక్కడ నుంచి గణేష్ పారిపోయారు. వెంటనే ఆమె కుటుంబసభ్యులు యాసిడ్‌దాడిలో గాయపడ్డ యువతిని మదనపల్లెజిల్లా ఆసుపత్రికి తరలించారు. మొఖం ఎక్కువుగా కాలిపోవడంతో మెరుగైనవైద్యం కోసం బెంగుళూరుకు తరలించారు. విషయం తెలుసుకొన్న జిల్లా ఎస్‌పి, అడిషనల్ ఎస్‌పి వెంకటాద్రి, మదనపల్లె డిఎస్‌పి కొండయ్య, సిఐలు, ఎస్ఐలు ఆసుపత్రి వద్దకు చేరుకొన్నారు.

**వాంగ్మూలాన్ని రికార్డు చేసిన న్యాయమూర్తి :** యాసిడ్ దాడిలో గాయపడి మదనపల్లె ఆసుపత్రిలో చికిత్స లు పొందుతున్న యువతి వాంగ్మూల్లాన్ని మదనపల్లె కోర్టు న్యాయమూర్తి రికార్డు చేశారు.

**యాసిడ్ ఘటనపై ముఖ్యమంత్రి ఆరా :** యాసిడ్ దాడి జరిగిన విషయం తెలుసుకొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరా తీసి యువతికి మెరుగైన వైద్యం అందించాలని అందుకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. రాష్ట్ర హోంమంత్రి అనిత ఆమె కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వం అండగా ఉంటుందని, నిందితున్ని కఠినంగా శిక్షిస్తామని సూచించారు. మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు ఆసుపత్రి వద్ద కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యాసిడ్‌దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని, దాడికి గురైన మహిళకు ప్రభుత్వం అరపున అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. యాసిడ్ దాడులను సహించేది లేదని కేవలం 15నిమిషాల్లో నిందితుడిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు.

## వల్లభనేని వంశీకి 27దాకా రిమాండ్

>> అనంతరం రాత్రి 10.15 గంటల సమయంలో ఆయనను 4వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయాధికారి రామ్మోహన్ ముందు హాజరు పరిచారు. ఇదే కేసులో అరెస్టు చేసిన ఏ7, ఏ8 ఎలినేని శివరామకృష్ణ ప్రసాద్, నిమ్మ లక్ష్మిపతిలను కూడా కోర్టుకు తీసుకొచ్చారు. మరో నిందితుడు, వంశీ వ్యక్తిగత సహాయకుడు వీర్రాజు కోర్టుకు వచ్చి స్వయంగా లొంగిపోయారు. నిందితుల తరఫున మాజీ అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, తానికొండ చిరంజీవి పోలీసుల తరఫున సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేంద్రప్రసాద్, పీపీ సమీర వాదనలు వినిపించారు. రిమాండ్‌పై శుక్రవారం తెల్లవారు జాము వరకు ఆర్గుమెంట్స్ జరిగాయి. వల్లభనేని వంశీ నొటోరియస్ క్రిమినల్. ఆయనకు చాలా నేర చరిత్ర ఉంది. చట్టం, న్యాయం అంటే లెక్కే లేదు. ఆయనపై 16 క్రిమినల్ కేసులు ఉన్నాయి అని పోలీసులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనపై సత్యవర్ధన్ ఫిర్యాదు మేరకు వంశీ తదిరులపై కేసు నమోదైంది. ఫిర్యాదు వాపస్ తీసుకోవాల్సిందిగా అప్పటి నుంచే ఆయనపై ఒత్తిళ్లు వస్తున్నాయని సత్యవర్ధన్ సోదరుడు కిరణ్ స్పష్టం చేశారు. కేసు వాపసు తీసుకుంటే డబ్బులు ఇస్తామని... ఒప్పుకోకుంటే చంపేస్తామని బెదిరించారని తెలిపారు. "పెద్దవాళ్లతో ఎందుకు పెట్టుకుంటార్రు అని వజ్ర కుమార్ అనే వ్యక్తి చాలాసార్లు పరోక్షంగా హెచ్చరించారని... కొమ్మా కోటి, రామకృష్ణ, వీర్రాజు తదితరులు తన సోదరుడిని, తల్లిదండ్రులనూ బెదిరించారని కిరణ్ తెలిపారు. ఈనెల 10వ తేదీన తన సోద రుడిని బలవంతంగా కారులో తీసుకెళ్లారని ఫిర్యాదు చేశారు. కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సత్యవర్ధన్‌ను రక్షించాం. ఆయనను విశాఖ పట్నం నుంచి విజయవాడకు తీసుకు వచ్చాం. అని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. వంశీతోపాటు మిగిలిన ఇద్దరు నిందితులను 15 రోజులు రిమాండ్‌కు పంపించాలని కోరారు. ఆయన తరఫున దాఖలైన బెయిల్ పిటిషన్లు తిరస్కరించారు.

### బెస్ట్ సిఎంలలో చంద్రబాబు..4

>> త్రి పార్దసారధి మీడియాకు తెలిపారు. ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ప్రతిష్టాత్మక ఓ జాతీయ పత్రిక నిర్వహించిన సర్వేలో చంద్రబాబు నాయుడు నాలుగో స్థానంలో నిలవడం మాకు గర్వకారణం. కేవలం అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే ఐదో స్థానం నుంచి ఆయన నాలుగో స్థానానికి చేరుకోవడం సంక్షేమం కోసం ఆయన పడుతున్న శ్రమ, ప్రగతి సాధించడానికి పట్టుదలతో పనిచేస్తున్న తీరుకు నిదర్శనంగా నిలుస్తుంది.



శుక్రవారం బెంగళూరులో అంతర్జాతీయ మహిళాసదస్సును ప్రారంభిస్తున్న రాష్ట్రపతి ముర్ము. చిత్రంలో రవిశంకర్

### వల్లభనేని వంశీపై కేసు
## పకడ్బందీగా డీల్ చేస్తున్నాం: విజయవాడ సిపి

**విజయవాడ ఫిబ్రవరి 14ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పోలీసు కస్టడీకి తీసుకుంటామని విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబు తెలిపారు. వల్లభనేనిపై కేసులు చట్టప్రకారం నమోదయ్యాయన్నారు. ఫిర్యాదుదారులు పూర్తి సాక్ష్యాధారాలు అందించారన్నారు. ఆయనను అన్ని అంశాలపై పోలీసు కస్టడీకి తీసుకుని విచారిస్తామన్నారు. దీని కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామన్నారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీపీ మాట్లాడారు. ఈ కేసులో మిగిలిన నిందితులను కూడా అరెస్ట్ చేస్తాం. కేసుకు సంబంధించిన పూర్తి ఆధారలు మా వద్ద ఉన్నాయి. నేరం ఎలా జరిగిందనే దాని విషయంలో సాంకేతిక అంశాలపైనా దృష్టి పెట్టాం. టెక్నాలజీ నుంచి ఎవరూ తప్పించుకోలేరు. కేసును పకడ్బందీగా డీల్ చేస్తున్నాం అని సీపీ రాజశేఖర్‌బాబు తెలిపారు. వల్లభనేని వంశీని విజయవాడ పోలీసులు గురువారం తెల్లవారు జామున హైదరాబాద్‌లో నాటకీయ పరిణామాల మధ్య అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కిడ్నాప్, దాడి, ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ వ్యవహారంలో వంశీతోపాటు మరికొందరిపై విజయవాడలోని పటమట పోలీస్‌స్టేషన్ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో వంశీని అరెస్ట్ చేసి విజయవాడ తీసుకొచ్చారు. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో నగరంలోని జిల్లా జైలుకు తరలించారు.

# ఇ-స్పోర్ట్స్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు

>> ర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు.. ఈ మౌలిక సదుపాయాలు కేవలం క్రీడా ప్రతిభను ప్రోత్సహించడమే కాకుండా, యువత అభివృద్ధి సమాజంతో అనుసంధానం చేస్తూ అవకాశాలను అందిస్తాయని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చాలా పట్టణాలు/నగరాలలో ప్రాథమిక క్రీడా మౌలిక సదుపాయాలు లేవని, ఈ నేపథ్యంలో మంత్రి వర్యులు కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు కొన్ని ప్రతిపాదనలు సమర్పించారు. రాష్ట్రంలో ప్రాథమిక క్రీడా మౌలిక సదుపాయాల స్థాపన కోసం ప్రతిపాదన బడ్జెట్ ను మంజూరు చేయాలని మంత్రి రాంప్రసాద్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో అన్ని నగరాలలో క్రీడ మౌలిక సదుపాయాల నిర్మాణానికి 280.9 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించాలని, రాయచోటిలో క్రీడా సముదాయ నిర్మాణం కోసం కేంద్రం నుండి 42.62 కోట్ల రూపాయల ప్రాజెక్టు కు సహకారం అందించాలని, రాయచోటిలో జిల్లా స్థాయి ఖేలో ఇండియా హాకీ కేంద్రాన్ని ఏర్పాటుకు చేసి రాయచోటి లో క్రీడా సముదాయ నిర్మాణానికి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలో నూతనంగా నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా సెంటర్, జిల్లా స్థాయిలో ఖేలో ఇండియా కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిల్లీలోనీ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కార్యాలయంలో కేంద్ర మంత్రికి మంత్రి రాంప్రసాద్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి ఆంధ్రప్రదేశ్ కు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని, ఏప్రిల్ నెలలో ఏపీలో పర్యటించనున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. రాయచోటిలో క్రీడా సముదాయ నిర్మాణం కోసం కేంద్రం నుండి 42.62 కోట్ల రూపాయల ప్రాజెక్టు సహకారం అందించాలని, రాయచోటిలో రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా హాకీ కేంద్రాన్ని ఏర్పాటుకు చేసి రాయచోటిలో క్రీడా సముదాయ నిర్మాణానికి ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర మంత్రిని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు ప్రత్యేకంగా కోరారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఇస్పోర్ట్స్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం నుండి సహాయాన్ని మంత్రి రాంప్రసాద్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో స్థిరమైన ఇ స్పోర్ట్స్ వ్యవస్థను నెలకొల్పడానికి రాబోయే నాలుగు సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం నుండి 255 కోట్లు ఆర్థిక సహాయం అందించాలని మంత్రి కోరారు. తద్వారా దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను ఇస్పోర్ట్స్‌కు కేంద్రంగా చేయాలనే లక్ష్యంగా పని చేయడానికి వెసులుబాటు ఉంటుందని తెలిపారు. క్రీడల జాబితాలో ఇస్పోర్ట్స్ చేర్చబడిందని, ఇ స్పోర్ట్స్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహకాలు అందుతున్నాయని తెలిపారు.

### పీలేరులో యువతిపై దాడిని ఖండించిన సిఎం చంద్రబాబు
#### నిందితునిపై కఠిన చర్యలకు ఆదేశం

**విజయవాడ, ఫిబ్రవరి 14ప్రభాతవార్త ప్రతినిధి:** అన్నమయ్య జిల్లా, గుర్రంకొండ మండలం పేరంపల్లి గ్రామంలో యువతిపై కామోన్మాది యాసిడ్ దాడిని సీఎం చంద్రబాబు ఖండించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధిత యువతికి, ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

**దోషులను కఠినంగా శిక్షిస్తాం: హోంమంత్రి అనిత** పేరంపల్లి గ్రామ యువతిపై కామోన్మాది యాసిడ్ దాడి ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నిందితులను వదిలేదన్నారు. ఘటనకు పాల్పడిన యువకుడిపై కఠిన చర్యలుంటాయన్నారు. తాను బాధిత రాలిని కుటుంబానికి కలుసు కుంటానని వివ రించారు. బాధితురాలు కుటుంబానికి ఆండగా ఉంటామన్నారు.

## ప్రత్యేక రక్షణ చట్టం

>> వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశం మేనిఫెస్టోలో కూడా పొందుపరిచామని, అవసరమైతే ప్రత్యేక కమిషన్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. బీసీ రక్షణ చట్టాన్ని సబ్ కమిటీ నివేదిక రాగానే అమల్లోకి తెస్తామన్నారు. రాష్ట్రంలో 201419 మధ్య నాటి టీడీపీ ప్రభుత్వం జిల్లా కేంద్రాల్లో 13కాపు భవనాలను మంజూరు చేసింది. అందులో 5భవనాల నిర్మాణాలను ప్రారం భించగా, గత ప్రభుత్వం నిలిపేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్మాణాలను పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేసింది. అవి త్వరలోనే వినియోగంలోకి రానున్నాయని అధికారులు వివరిం చారు. నిర్మాణంలో ఉన్న 42 కాపు కమ్యూనిటీ హాళ్ల కూడా వేగంగా పూర్తి చేయాలని చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ సమీక్షలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, అధికారులు పాల్గొన్నారు.

### వారం - వర్జ్యం

తేది : 15-02-2025, శనివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
తదియ రా.11.53
ఉత్తర రా.1.38
వర్జ్యం : ఉ.7.05-8.51
దు.ఉ.6.43-8.17
శుభసమయం : ఉ.8.30-9.00
సా.5.40-6.40
రాహుకాలం - ఉ.9.00-10.30

### వార్తాఫలం

**మేషం :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. పనులు సకాలంలో పూర్తి.

**వృషభం :** గృహం, వాహనాలు, విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ప్రయాణాలు.

**మిథునం:** బంధువుల నుండి శుభవార్తలు అందుకొంటారు. ఉద్యోగాలలో ప్రమోషనులు.

**కర్కాటకం :** మిత్రులతో ఏర్పడిన తగాదాలు పరిష్కరించుకొంటారు. స్వల్పధనలాభం.

**సింహం:** ఉద్యోగాలలో బాధ్యతలు పెరిగిన సమర్థవంతంగా నిర్వహిస్తారు. వాహన సౌఖ్యం.

**కన్య :** కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందిస్తారు. ఆరోగ్యం జాగ్రత్త.

**తుల :** ముఖ్యమైన వ్యవహారాలలో నిదానం అవసరం. వివాదాలకు దూరంగా వుండండి.

**వృశ్చికం:** ఉద్యోగాలలో స్వల్పమార్పులు చోటు చేసుకొంటాయి. ప్రముఖుల కలయిక.

**ధనుస్సు:** మీ ఆశలు నెరవేరే సూచనలు కనబడుట లేదు. జాగ్రత్తలు అవసరం.

**మకరం:** శ్రమపడ్డా ఫలితం ఉండదు. వృత్తి, వ్యాపారాలలో నిరుత్సాహం.

**కుంభం:** నూతన ప్రయత్నాలు కలిసివస్తాయి. సంఘంలో గౌరవం పొందుతారు.

**మీనం :** చిన్ననాటి మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

సాహితీ గత వారంరోజుల్లో విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు  fb.com/vaartha

వల్లభనేని వంశీపై కేసు పకడ్బందీగా డీల్ చేస్తున్నాం: విజయవాడ సిపి 2లో

మహాకుంభమేళాకు ప్రత్యేక రైళ్లు 9లో

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-2-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 14 పేజీలు: 12 వెల: 6.50

## వాషింగ్టన్‌లోని వైట్‌హౌస్‌లో అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అయిన ప్రధాని మోడీ

పలు ద్వైపాక్షిక అంశాలపై ఉభయుల మధ్య సుదీర్ఘ చర్చ

భారత్‌ను మిత్రదేశం అంటూనే వడ్డింపులకు వెనుకాడని ట్రంప్

రక్షణరంగ కొనుగోళ్ల ఒప్పందంపై సంతకాలు

భారత్‌కు 5వ తరం యుద్ధవిమానాల సరఫరాకు అమెరికా అంగీకారం



శుక్రవారం వాషింగ్టన్‌లోని వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అయిన ప్రధాని మోడీ

# బంధం పటిష్టం

## అమెరికాలో భారత్ ఫార్మారంగ విస్తరణకు పరస్పరం అంగీకారం

**వాషింగ్టన్, ఫిబ్రవరి 14:** భారత్ అమెరికాలమధ్య ద్వైపాక్షిక బందాన్ని మరింతముందుకు తీసుకుపోవడంతోపాటు వాణిజ్యం, రక్షణరంగం, పెట్టుబడులు, ఇంధనం, సృజనాత్మకత, అంతర్జాతీయ భాగస్వామ్యాలపై రెండుదేశాల అధినేతలు కీలక అవగాహనకు వచ్చినట్లు ఇరుదేశాల అదినేతలు ప్రకటించారు. శ్వేతసౌధంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌తో భేటీ అయిన తర్వాత ప్రధాని మోడీ, ట్రంప్ ఇరువురూ కలిసి మీడియాతో మాట్లాడారు. ఈసందర్భంగా కాంపాక్ట్ కార్యాచరణ అమలుకు ఇరుదేశాలు అంగీకరించాయి. అయితే సుంకాలపరంగా మాత్రం ట్రంప్ వెనక్కి తగ్గలేదు. తమపై ఎక్కువ సుంకాలు విధించేదేశాలకు ప్రతిగా సుంకాలు విధిస్తామని, తక్కువ సుంకాలు విధించే దేశాలకు తక్కువగానే పరస్పర సుంకాలు విధించడం జరుగుతుందని చెప్పారు. దీనితో ఇపుడు ఇరుదేశాల్లో దిగుమతయ్యే ఉత్పత్తులపై అదనపు సుంకాలు పడేపరిస్థితి ఏర్పడింది. ఎంత మిత్రదేశం అయినప్పటికీ కూడా పరస్పర పన్నులపరంగా తగ్గేది లేదని ట్రంప్ సున్నితంగా తేల్చిచెప్పేసారు. మా మిత్రదేశం ఎలా స్పందిస్తే అదేరీతిలో స్పందిస్తామని, భారత్ అయినా మరే దేశం అయినా సరే మాపై తక్కువ సుంకాలు విధిస్తే మేంకూడా అలాగే కొనసాగుతామని, ఎంతశాతం పన్నులు వేస్తే మేం కూడా అంతే స్థాయి సుంకాలు విదిస్తామని ట్రంప్ స్పష్టంచేసారు. ఇపుడుమాముందు ఐరోపా కూటమి సమస్యాత్మకంగా ఉందని, కనీవినీఎరుగని స్థాయిలో సుంకాలు వేస్తున్నారని చాలా >>2

మోడీకి ట్రంప్ అపురూప కానుక 2లో



శుక్రవారం పళనిలో మురగన్ స్వామి ఆలయంలో వేదపండితుల ఆశీస్సులు స్వీకరిస్తున్న పవన్

## పళని నుంచి తిరుమలకు రవాణా సౌకర్యం కల్పిస్తా

పళని మురుగన్ సన్నిధిలో డి.సిఎం పవన్

కొనసాగుతున్న ఆధ్యాత్మిక యాత్ర

**విజయవాడ,ఫిబ్రవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** దక్షిణ భారతదేశ ఆలయాల సందర్శనలో భాగంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కొణిదెల షష్ట షణ్ముఖ క్షేత్రాల పర్యటనలో శుక్రవారం పళనిలోని సుబ్రహ్మణ్యస్వామి దర్శనానికి విచ్చేశారు. జ్ఞానం సర్వసిరుల మూలం. విశ్వాన్ని చుట్టి వచ్చే విషయంలో తన సోదరుడు విఘ్నేశ్వరుడి చేతిలో ఓడి జ్ఞాన సంపన్నత కోసం ఆది దంపతుల >>2

## బిసి వర్గాల సంక్షేమానికి ప్రత్యేక రక్షణ చట్టం

విద్యార్థుల హాస్టళ్లలో సమస్యలు తలెత్తకూడదు..

బిసిలపై దాడులు చేస్తే శిక్షపడేలా చర్యలు

అవసరమైతే మరిన్ని దోభీఘాట్లు

సమీక్షలో సిఎం చంద్రబాబు



శుక్రవారం బిసి సంక్షేమంపై సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి సవిత, అధికారులు

**విజయవాడ,ఫిబ్రవరి 14ప్రభాతవార్తప్రతినిధి:** బీసీ వర్గాల సంక్షేమానికి ప్రత్యేక సంరక్షణ చట్టం తీసుకుని వస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. బీసీ విద్యార్థుల కోసం ప్రభుత్వం తీసుకునే చర్యలతో స్పష్టమైన మార్పులు రావాలని, ప్రభుత్వం చేసే ఖర్చుకు జవాబుదారీతనం కనిపించాలని సచివాలయంలో శుక్రవారం బీసీ సంక్షేమ శాఖపై సీఎం సమీక్షించారు. రాష్ట్రంలోని 660 గవర్నమెంట్ హాస్టల్స్‌లో రూ.13.10 కోట్లతో చేపట్టిన మరమ్మతులు మరో ఆరు వారాల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు గత ప్రభుత్వం ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, కిచెన్ ఐటెమ్స్ అందించలేదని, రూ.18కోట్లతో వాటి పంపిణీకి చర్యలు తీసుకున్నామని అధికారులు వివరించగా, ఈ ప్రక్రియ కూడా మార్చి మూడవవారం నాటికి పూర్తవ్వాలన్నారు. ఈ సమావేశంలో ట్యూటర్స్ హానరోరియంకు సంబంధించి 485 హాస్టళ్లలో 2024మార్చి వరకు గత ప్రభుత్వం పెట్టిన రూ.2.02 కోట్ల బకాయిలు, ఈ ఏడాది ఫిబ్రవరి వరకు చెల్లించాల్సి ఉన్న రూ.2.33 కోట్ల బకాయిలు మొత్తం కలిపి రూ.4.35 కోట్లు చెల్లించాల్సి ఉందని అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా, వెంటనే చెల్లించేందుకు అనుమతి ఇచ్చారు. డైట్ ఛార్జెస్‌కు సంబంధించి రూ.185.27కోట్లు పెండింగులో ఉన్నాయని అధికారులు వివరించగా ప్రస్తుతం రూ.110.52 కోట్ల చెల్లింపునకు సీఎం అంగీకారం తెలిపారు. అదేవిధంగా కాస్మోటిక్ బిల్లులు రూ. 29కోట్లు చెల్లించాలని ఆదేశించారు. హాస్టళ్ల విద్యుత్ సరఫరాకు సంబంధించిన పెండింగ్‌బిల్లులు కూడా వెంటనే చెల్లించాలని సూచించారు. సత్యసాయి జిల్లాలోని నసనకోట, ఆత్మ కూరు బీసీ సంక్షేమ బాలికల పాఠశాలలను రెసిడెన్షియల్ బీసీ గర్ల్స్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. కుప్పంలోనూ బీసీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

**దామాషా ప్రకారం కార్పొరేషన్లకు నిధులు**

బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కేబినెట్లో కూడా ఆమోదం తెలిపామని, ఈ మేరకు అవసరమైతే న్యాయపోరాటం చేయాల్సి ఉందని తెలిపారు. అలాగే ప్రతి కార్పొరేషన్‌కు దామాషా ప్రకారం నిధులు కేటాయించాలన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని, దీనిపై ఇప్పటికే విధివిధానాలు రూపొందించామని తెలిపారు. రజకులకు మేలు చేకూరేలా రాష్ట్రంలో 201419 మధ్య నిర్మించిన దోబీ ఘాట్ల మరమ్మతులు, అవసరమైన చోట కొత్తవి నిర్మించడంపై దృష్టి పెట్టాలని సీఎం అన్నారు. రానున్న బడ్జెట్‌లో కేటాయించే నిధులతో రాష్ట్రంలో బీసీ భవనాలు పూర్తిచేయాలని ఆదేశించారు. 2014 నుంచి బీసీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిపొందిన వారి సమాచారాన్ని సేకరించాలని, వృత్తి ప్రామాణికంగా రుణాలు తీసుకున్న వారు ప్రస్తుతం ఎంతమంది కొనసాగిస్తున్నారో ఆడిట్ చేయాలని ఆదేశించారు. వైసీపీ హయాంలో బీసీలను ఊచకోత కోశారని, వారి హత్యలపైనా విచారణ >>2

## యువతిపై యాసిడ్ దాడి



యాసిడ్ దాడికి పాల్పడిన గణేష్ (ఫైల్)

అన్నమయ్య జిల్లాలో దారుణఘటన

పోలీసుల అదుపులో నిందితుడు

ఘటనపై ముఖ్యమంత్రి ఆరా

**మదనపల్లె/గుర్రంకొండ, ఫిబ్రవరి 14 ప్రభాత వార్త :** ప్రేమికుల దినోత్సవం రోజు అన్నమయ్యజిల్లా గుర్రంకొండలో అమానుషం ఘటన చోటు చేసుకొంది. మదనపల్లెకు చెందిన యువకుడు గణేష్ గుర్రంకొండకు చెందిన యువతిపై యాసిడ్ దాడికి పాల్పడి కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి నారాలోకేష్‌లు స్పందించి నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. యాసిడ్ దాడిలో గాయపడ్డ యువతి (23) మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్సలు పొందుతుంటే శుక్రవారం రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, జిల్లా ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు, ఎమ్మెల్యే షాజహాన్ బాషాలు పరామర్శించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం మేరకు గుర్రంకొండ మండలం నడింఖండ్రిగ పంచాయితీ ప్యారంపల్లెకు చెందిన జనార్ధన్, రెడ్డమ్మ దంపతుల కుమార్తె (23) డిగ్రీ పూర్తి చేసి మదనపల్లెలో ఓ ప్రైవేటు బ్యూటీపార్లర్‌లో పని చేస్తోంది. ఆమెకు పీలేరుకు చెందిన యువకుడితో ఈనెల 7న వివాహ నిశ్చితార్థం చేశారు. ఏప్రిల్ 29న వివాహం చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. అయితే మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్టకు చెందిన టిడిపి నాయకులు ఎస్.మురళీ కుమారుడు గణేష్ తనను ప్రేమించాలంటూ ఆమె వెంట ఏడాదన్నరగా తిరుగుతున్నట్లు వెల్లడించారు. దీనికి ఆమె అంగీకరించలేదు. ఈ క్రమంలో ఆమెకు వివాహం నిశ్చయం అయ్యిందని >>2

## 'స్వచ్ఛాంధ్ర'వైపు కదులుదాం..

స్కూళ్లు, ఆఫీసులు, పరిశ్రమలు, పని ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

ప్రతినెల 3వ శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహణ

14 ఇండికేటర్స్ ఆధారంగా జిల్లాలకు ర్యాంక్‌లు: సిఎం చంద్రబాబు

**విజయవాడ. ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధి:** స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సిఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.ఏ కార్యక్రమానికైనా లక్ష్యంపెట్టుకోవడమే కాదన్నారు.వాటిని ఖచ్చితంగా చేరుకునేలా ప్రణాళికలు అమలు చేయాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో పరిశుభ్రత పెంచేందుకు అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పేందుకు అమలు చేస్తున్న కార్యచరణపై సీఎం సమీక్ష చేశారు. ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తోంది. ప్రతి నెల ఒక థీమ్ తీసుకుని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జనవరి నెలలో న్యూ ఇయర్ క్లీన్ స్టార్ట్ అనే అంశాన్ని థీమ్ గా తీసుకోగా ఈ నెలలో సోర్స్ రీసోర్స్ అనే అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు. మన మూలాలు మన బలాలు తెలుసుకునేలా, రాష్ట్రంలోని వనరులను ఎలా సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలి అనే దానిపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. జీవన ప్రమాణాలు పెంచడం, పర్యాటకరంగానికి ప్రోత్సాహం, పెట్టుబడులు ఆకట్టుకోవడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం, నెట్ జీరోకు రాష్ట్రంలో పర్యావరణాన్ని తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని సిఎం సూచించారు. సంపూర్ణ స్వచ్ఛత వైపు అడుగులు వేయడం, పారిశుధ్యానికి ప్రాధాన్యత, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రజారోగ్యం, ఇంకా కేంద్రం నిర్దేశించే లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర అంటే స్వచ్ఛమైన మనుషులు, స్వచ్ఛమైన మనసులు, స్వచ్ఛమైన పరిసరాలు, స్వచ్ఛమైన ఇళ్లు, కాలనీలు, ఊళ్లు అని అంతా గుర్తించాలని సిఎం అన్నారు. ఇళ్లతో పాటు, బహిరంగ ప్రదేశాలను, స్కూళ్లు, కాలేజ్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రార్థనా మందిరాలు, పరిశ్రమలు కూడా పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. దీని కోసం ప్రతి వ్యక్తి, ప్రతి ఉద్యోగి, ప్రతి సంస్థ, ప్రతి వ్యవస్థ పనిచేయాలన్నారు. ఇది ఏ ఒక్క శాఖకో, ఒక్క అధికారికో సంబంధించిన కార్యక్రమంగా చూడవద్దని, పరిశుభ్రత, పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో పాఠశాల విద్యార్థినుంచి నాయకుల >>2



## ఇ-స్పోర్ట్స్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు

రాష్ట్రంలో కొత్తగా 'ఖేలో ఇండియా సెంటర్'

కేంద్రమంత్రి మాండవీయతో రాష్ట్ర క్రీడా మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**విజయవాడ,ఫిబ్రవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** క్రీడాంధ్రప్రదేశ్ సాకారం దిశగా సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో అడుగులు వేస్తున్నామని మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.ఇప్పటికే అత్యుత్తమ నూతన క్రీడా పాలసీ, క్రీడా యాప్ ఆవిష్కరణ వంటి అంశాలు కూటమి ప్రభుత్వం హయంలో జరిగాయన్నారు. రాష్ట్రంలో నూతనంగా నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా సెంటర్, జిల్లా స్థాయిలో ఖేలో ఇండియా కేంద్రాలు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి మంత్రి రాంప్రసాద్ రెడ్డి వినతి పత్రం సమర్పించారు. శుక్రవారం ఢిల్లీ పర్యటనలో భాగంగా ఢిల్లీకి వెళ్లిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా,యవజన,క్రీడా శాఖ మంత్రిమండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కేంద్రమంత్రి మాండవీయను కలిసి పూల బొకేతో సత్కరించారు. యువతకు కావాల్సిన మౌలిక సదుపాయాలు అందించడానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారాలు అందించాలని కోరారు.

రాష్ట్రంలో క్రీడా సముదాయం ఏర్పాటు ద్వారా, 'మల్టీపర్పస్ హాల్, అథ్లెటిక్స్ ట్రాక్, ఫుట్ బాల్ ఫీల్డ్, స్విమ్మింగ్ పూల్' వంటి సౌక >>2



## వల్లభనేని వంశీకి 27దాకా రిమాండ్

**విజయవాడ.ఫిబ్రవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ నేత గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు విజయవాడ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు కిడ్నాప్ కేసుపై 14 రోజులు రిమాండ్ విధించింది. దీంతో వంశీని పోలీసులు విజయవాడ హనుమాన్ పేటలోని జిల్లా కారాగారానికి తరలించారు. జిల్లా కారాగారంలో 14 రోజుల పాటు ఈనె ల 27 వరకురిమాండ్ ఖైదీగా ఉండనున్నారు. రిమాండ్‌ఖైదీగా నెంబర్ కేటాయించి అధికారులు జైలు గదిలోకి పంపారు. జైలుకు వచ్చే ముందు సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో పోలీసులు వంశీ వేలి ముద్రలు, ఐరిష్ తీసుకున్నారు. బెదిరింపులు, కిడ్నాప్ కేసులో వంశీ అరెస్టు కోసం అదనపు డీసీపీ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం విజయవాడ నుంచి బుధవారం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లింది. వీరు గురువారం ఉదయం 6.30 గంటలకు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. గచ్చిబౌలి మైహోం భుజాలో నివసిస్తున్న వల్లభనేని వంశీని అరెస్టు చేయాల్సి ఉందని, తమకు ఎస్కార్ట్ ఇవ్వాలని కోరారు. కేసు వివరాలను వారికి తెలిపారు. దీంతో రాయదుర్గం ఠాణా నుంచి ఒక ఎస్ఐతోపాటు మరో ఐదుగురు పోలీసులు విజయవాడ పోలీసులకు తోడుగా వచ్చారు. నేరుగా... మైహోమ్ భూజా డి బ్లాక్‌లో 11వ అంతస్తులో ఉంటున్న వంశీ ఫ్లాట్ వద్దకు చేరుకున్నారు. సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి బెదిరించారనే ఆరోపణలతో మీపై పటమట పోలీసు స్టేషన్‌లో భారత న్యాయ సంహితలోని సెక్షన్లు 140 (1), 308, 351(3), రెడ్‌విత్3(5)తోపాటు సెక్షన్ 3(2) ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదైంది. క్రైమ్ నంబర్ 86/2025 కేసులో మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాం అంటూ వంశీకి నోటీసు ఇచ్చారు. దాన్ని చదివిన తర్వాత పోలీసులతో వంశీ కొద్దిసేపు వాదనకు దిగారు. ఆ తర్వాత ఎక్కువ హడావుడి చేయకుండానే పోలీసుల వెంట వచ్చేందుకు అంగీకరించారు. గురువారం ఉదయం 7 గంటలకల్లా వంశీ అరెస్టు ప్రక్రియ ముగిసింది. మధ్యాహ్నం 12.40 గంటలకు భవానీపురం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ వంశీని మరో వాహనంలోకి మార్చారు. ఆయనను పటమట పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తారని కొంతసేపు, కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు తీసుకెళ్తారని మరికొంతసేపు ప్రచారం జరిగింది. అయితే..అనుహ్యాంగా వంశీని మధ్యాహ్నం 1.10 గంటలకు కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు.

కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో వంశీని నలుగురు అధికారులు ఎనిమిది గంటలపాటు సుదీర్ఘంగా విచారించారు. సత్యవర్ధన్ జోలికి ఎందుకు వెళ్లారు? అతడిని ఎలా ట్రాప్‌చేశారు? అంటూ పలు కోణాల్లో ప్రశ్నలు సంధించారు. వాటన్నింటికీ తెలియదు..తెలియదు అని ఆయన సమాధానం ఇచ్చినట్టుగా తెలుస్తోంది. అనంతరం రాత్రి 9.15 గంటలకు వైద్య పరీక్షల నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు ముగిసిన >>2



## బెస్ట్ సిఎంలలో 4 చంద్రబాబు..

మంత్రి కె.పార్థసారథి

**విజయవాడ.ఫిబ్రవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోని ఉత్తమ ముఖ్యమంత్రుల జాబితాలో ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు నాలుగవ స్థానంలో నిలిచారని ఏపీ సమాచార పౌరసంబంధాల మం >>2


కల్లోలంగా ఉన్న కొలనులో నిశ్చలమైన ప్రతిబింబం కనపడదు. అలాగే నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.

-కె.స్టాన్‌స్లావిస్కి

# 'మత్తు'ను ఉపేక్షిస్తే ఉపద్రవమే

మాదక ద్రవ్యాల వ్యసనం వినాశానికి దారితీస్తుందని దానిని సమష్టిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ఎంతోకాలంగా పాలకులు చెప్తున్నారు. కానీ అంతకు రెట్టింపు స్థాయిలో యేడాది యేడాదికి విస్తరిస్తుండడం ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా ఈ వ్యసనం ఇరవైయేళ్లలోపు పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. మరోవైపు నేరాలసంఖ్య అదుపు లేకుండా పెరిగిపోతున్నది. మాదకద్రవ్యాల మత్తులోవారు ఏం చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితుల్లో చేయరాని, చేయకూడని పనులకు పాల్పడుతున్నారు. అవి కప్పిపుచ్చుకోవడానికి హత్యలు చేయడానికి కూడా వెనుకాడడంలేదు. ఇక్కడా అక్కడా అని కాదు. దేశమంతా విస్తరిస్తున్నది. ఆ మాటకొస్తే ప్రపంచవ్యాప్తంగా కూడా మాదకద్రవ్యాల వినియోగం, వ్యాపారం ఒక సవాలుగా మారిపోయింది. మాదకద్రవ్యాల ముఠా ప్రమాదకరంగా తమ సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నాయి. మెక్సికోలోని మాదకద్రవ్యాల అక్రమరవాణా వ్యాపారం లక్షల కోట్లల్లోకి చేరిందని అనధికార వర్గాలు చెబుతున్నాయి. ఇది యేడాది యేడాదికి పెరిగిపోతున్నది. అఫ్ఘానిస్థాన్ ఇతర గల్ఫ్‌దేశాల్లో పరిస్థితి ఆందోళనకరంగా తయారవుతున్నది. భారత్‌లో కూడా పరిస్థితి ఇందుకు విరుద్ధంగా లేదు. నార్కోటిక్ నియంత్రణ బ్యూరో పోలీసులు కలిపి గత యేడాది దాదాపు పదిహేడువేల కోట్ల రూపాయల విలువైన మాదకద్రవ్యాలను పట్టుకున్నాయి. భారతదేశ చరిత్రలో ఇదోక రికార్డు అనికేంద్ర హోంమంత్రి ఇటీవల బహిరంగంగానే ప్రకటించారు. 2004-14 మధ్య కాలంలో దేశీయంగా మూడు లక్షల అరవైమూడువేల కిలోల మత్తుమందు పట్టుకోగా 2014-24 మధ్య పదేళ్ల కాలంలో అది ఇరవైనాలుగు లక్షల కిలోలకు పెరిగిందని హోంమంత్రి వెల్లడించారు. కానీ పోలీసులకు, నార్కోటిక్ విభాగానికి పట్టుబడుతున్నది, వినియోగం అవుతున్న దాంట్లో పదోవంతు కూడా ఉండకపోవచ్చునని అధికార వర్గాలే అంగీకరిస్తున్నాయి. భారతదేశాన్ని 2047 నాటి కల్లా మత్తుపదార్థాలరహితంగా మార్చడానికి అందరూ కృషి చేయాల్సిఉందని కేంద్ర పెద్దల లక్ష్యం కనుచూపు మేరలో నెరవేరే అవకాశాలు కన్పించడం లేదు. ఆన్‌లైన్ నిపుణులు, క్రిప్టోకరెన్సీ, చివరకు డ్రోన్ల ద్వారా, డార్క్ నెట్ ఉపయోగించి వీటి రవాణా పెంచుకుపోతున్నారు. భారత్‌తోసహా బల్గేరియా, అమెరికా, మయన్మార్, అఫ్ఘాన్, టర్కీ దేశాల్లో మాదకద్రవ్యాల వినియోగం అంతకంతకు పెరిగిపోతున్నది. దేశంలో ప్రతి ఇరవై మందిలో ఒకరు ఆల్కాహాల్, ప్రతి నలభైమందిలో ఒకరు ఈ మత్తుపదార్థాలకు అలవాటుపడుతున్నారని అనేక అనర్థాలకు దారితీస్తున్నట్లు అధ్యయనాలు వివరిస్తున్నాయి. ఇవి మెదడు, గుండె, జీర్ణాశయం, కాలేయం వంటి శరీరభాగాలపై ప్రభావం చూపడంతో వ్యాధిగ్రస్తులవుతున్నారు. అన్నింటి కంటే మించి నల్లమందుతో ఆరోగ్యాన్ని సర్వనాశనంచేసుకుంటున్న యువత భారీగానే ఉన్నట్లు చెప్తున్నారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్, కజికిస్థాన్ లాంటి దేశాల్లో నిషేధిత మందులను దాదాపు ముప్పైకోట్ల మంది వాడుతున్నట్లు అంచనా. ఇక థాయిలాండ్, కాంబోడియా, మయన్మార్, మాఫియా రాజ్యాత్రయంగా రూపాంతరం చెందాయి. ఆ దేశాల నుంచి అనేక రహస్యమార్గాల ద్వారా బంగ్లాదేశ్ చేరుకొని అక్కడ నుండి సరిహద్దులు దాటి భారత్‌లోకి చేరవేస్తున్నారు. నగరాల శివారులలోని పారిశ్రామిక వాడల దాకా వ్యాపించిన ఈ దుస్సంస్కృతి జాతి భవితను ప్రశ్నార్థకం చేస్తున్నది. పట్టణాలు, నగరాల్లోని పిల్లలను మాదక ద్రవ్యాల మాఫియా ముఠాలు లక్ష్యంగా చేసుకొని వాళ్లను ఒకవ్యూహం ప్రకారం ఉచ్చులోకి దించడంద్వారా వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నది. సూట్‌కేసులు, బ్యాగులు, కొరియర్ ప్యాకేజీలు, చివరకు ప్రయాణీకుల కడుపుల్లో దాచుకున్న ప్లాస్టిక్ సంచుల ద్వారా రవాణా చేయడానికి కూడా తెగబడుతున్నారు. ఇటీవల కాలంలో నిఘాను తప్పించుకోవడానికి బొగ్గుపొడి, ఐరన్ ఆక్సైడ్ తదితరాలు కలిపి నల్లకుకేన్ రవాణా చేయడం కూడా ఎక్కువైంది. గత డిసెంబరులో అండమాన్ దీవులకు సమీపంలో ఒక చేపల పడవ నుంచి భారత్ కోస్ట్‌గార్డు సిబ్బంది ఇరవైవేల కోట్ల రూపాయలకుపైగా విలువైన ఐదున్నర టన్నుల మెథామ్ ఫైటమైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గుజరాత్ పోర్‌బందర్ సమీపంలో ఒక నౌక నుంచి ఏడువందల కిలోల మెథామ్ ఫైటమైన్ స్వాధీనం చేసుకున్నారు. ఇంత ప్రమాద కరంగా విస్తరిస్తున్న ఈ మాదకద్రవ్యాలను, రవాణాను, వినియోగానికి అడ్డుకట్టవేసేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు ఆశించిన ఫలి తాలు ఇవ్వలేకపోతున్నాయి. దాడులు చేసి పట్టుకోవడమో, ఆకస్మిక తనిఖీల్లో బయటపడినప్పుడు కేసులుపెట్టి చేతులు దులుపు కుంటున్నారు. కేసుల్లో శిక్షలుపడినవారు జైలుకు వెళ్లి శిక్ష అనుభవించి తిరిగివచ్చి అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. ముఖ్యంగా నైజీరియన్లు పెద్దఎత్తున పట్టుబడుతున్నారు. కోట్లాది రూపాయల విలువైన మాదకద్రవ్యాలు పట్టుబడుతున్నా పెద్ద ఎత్తున అరెస్టులు చేస్తున్నా ఈవ్యాపారం మాత్రం ఆగడం లేదు. ఇందులో కొందరు సినీప్రముఖుల ప్రమేయం ఉన్నట్లు కూడా వార్తలువచ్చాయి. ఏదిఏమైనా యువత భవిష్యత్‌ను తీవ్రంగా దెబ్బతీస్తున్న ఈమాదకద్రవ్యాల సవాల్‌ను సమర్థంగా ఎదుర్కోవాల్సిన తరుణమిది. మాటలతో కాకుండా ఆచరణలో చూపినిర్మూలించాల్సిన సమయమిది. ఇది ప్రభుత్వంపైనే పూర్తి బాధ్యత వదిలిపెట్టకుండా స్వచ్ఛంద సంస్థలు, పౌరులు, అందరూ కలిసికట్టుగా త్రికరణశుద్ధిగా మాదకద్రవ్యాల నిర్మూలన యజ్ఞంలో పాల్గొంటే తప్ప ఈ ముప్పు తప్పే అవకాశాలు లేవు.

ఓ మర్రిగింజ మహావృక్షమైనట్టే, చిత్తశుద్ధితో చేసే చిన్న సత్కార్యం మహా ఫలితాలు ఇస్తుంది.



డ్రైడెన్

ఉత్తముల్ని గౌరవించడం, సేవకుల్ని దయతల్చడం, శత్రువుల్ని క్షమించడం అభివృద్ధికి ఆధారాలు.



జీన్ ఫ్రాగనార్డ్

# నేర చరితులను తిరస్కరించలేమా?

**తాము చేసిన తప్పులు ఎక్కడ తమను భూస్థాపితం చేస్తాయనే అనుమానంతో, పదవీవ్యామోహంతో భయపడిపోయి ఆత్మవిశ్వాసం కోల్పోయి, నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చి ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని మంటకలిపిన కొన్ని పార్టీలకు చెందిన కొందరు నేతల అరాచకాలు ఈ నీచ సంకుచిత పరిణామాలకు తోడ్పడుతున్నాయి. అందులో భాగంగా నేరచరితులు నేరుగా రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నారు. రాజకీయ పార్టీల నేతలేకాదు రాజ్యాంగ నిపుణులు, మేధావులు, న్యాయకోవిదులు, మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన తరుణమిది. ప్రజలు కూడా ఆలోచించాలి. ఇదే పరిస్థితి కొనసాగితే నేరచరితులను రాజకీయాల్లోకి రాకుండా నిరోధించలేకపోతే ప్రజాస్వామ్య ఉనికే ప్రశ్నార్థకంగా మారక తప్పదు. బడిత కలవాడిదే బర్రె అన్నట్లుగా నేర చరితులదే రాజ్యమవుతుంది. అరాచకం ప్రబలిపోతుంది.**

దామెర్ల సాయిబాబ

ఎన్నో ప్రజాసమస్యలు, ప్రభుత్వ విధానాలు, కూలంకషంగా చర్చించి, నిర్ణయాలు తీసుకొని దేశప్రజలకు దిశ, దశ నిర్దేశించాల్సిన ప్రజాప్రతినిధుల సభల్లో నేరచరితులు ప్రవేశిస్తుండడం పట్ల ఏనాటి నుంచో ఆందోళనలు, ఆవేదనలు వ్యక్తమవుతున్నాయి. దేశ అత్యున్నత న్యాయస్థానం మొన్న సోమవారం నాడు మరొకసారి ఈ విషయంలో ఆవేదన వ్యక్తంచేసింది. దేశ రాజకీయాలు నేరమయమైపోతున్నాయని, ఇది దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య అని వ్యాఖ్యానించింది. ప్రధానంగా క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన వ్యక్తులు తిరిగి పార్లమెంటు, శాసనసభల్లోకి ప్రవేశిస్తుండడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. నేరచరిత ఉన్న నేతలు పార్టీలు నడపకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపైఉందని స్పష్టం చేసింది. గత ప్రజాప్రతినిధులపై ఉన్న క్రిమినలను త్వరగా విచారించడంతోపాటు న్యాయస్థానాల్లో దోషులుగా తేలిన నేతలు తిరిగి ఎన్నికల్లో పోటీ చేయడానికి జీవిత కాలం నిషేధం విధించాలని న్యాయవ్యాధి అశ్వనీ ఉపాధ్యాయ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వాజ్యంపై జస్టిస్ దీపాంకర్ దత్త, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం విచారించింది. ప్రజాప్రాతినిధ్యం చట్టంలోని ఎనిమిది, తొమ్మిది సెక్షన్ల చెల్లుబాటుపై పిటిషనర్ వ్యక్తం చేసిన అభ్యంతరాలపై మూడువారాల్లో సమాధానం ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు కొన్ని కీలక ప్రశ్నలు సంధించారు. ఒకసారి దోషిగా తేలిన తర్వాతదాన్ని హైకోర్టు కూడా నిర్ధారించిన పిదప తిరిగి పార్లమెంటుకు, శాసనసభకు, రాజకీయ నేతలు ఎలా వస్తారనేది ప్రశ్నించింది. ఒక ప్రభుత్వ ఉద్యోగి అవినీతి కేసుల్లో కానీ, విశ్వాస ఘాతకుడి కేసులో దోషిగా తేలితే సర్వీసులో కొనసాగడానికి పనికిరాడు, కానీ అతను మంత్రిగా కొనసాగవచ్చు అంటూ వ్యాఖ్యానించింది. ఇప్పుడే కాదు ఐదేళ్ల క్రితం కూడా సుప్రీంకోర్టు నేరమయ రాజకీయాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ కొన్ని మార్గదర్శక సూత్రాలు కూడా జారీ చేసింది. భారత దేశంలో నేరమయ రాజకీయాల సమస్య ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారకముందే పార్లమెంటు చట్టంతెస్తుందనే విశ్వాసం తమకు ఉందని సుప్రీంకోర్టు ఆనాడే వెల్లడించింది. క్రిమినల్ కేసుల్లో అభియోగాలు నమోదైన దశలోనే అనర్హత వేటు వేయాలని పబ్లిక్ ఇంట్రెస్టెడ్ ఫౌండేషన్ సంస్థ, మరొక బిజెపి నాయకుడు తదితరులు సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను విచారిస్తూ సుప్రీంకోర్టు ఆనాడే ఈవ్యాఖ్యలుచేసింది. ఈ కేసు సందర్భంగా తీర్పు చెబుతూ నేరస్తులు రాజకీయాల్లోకి ప్రవేశించకుండా కొత్త చట్టం కోసం భారత ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారని ప్రజాస్వామ్యదేశంలో రాజ్యాంగ బద్ధమైన పాలనలో జీవించాలన్న ఆకాంక్షను సమాజం వ్యక్తం చేస్తున్నదని ఐదుగురు సభ్యులతోకూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. రాజకీయాలు నేరమయం కావడం ప్రజాస్వామ్య వెన్నులో వణుకు పుట్టిస్తుందని, రాజ్యాంగపరమైన ఆదేశాలను దెబ్బతీస్తున్నదని, చివరకు ప్రభుత్వమూలాలపై కూడా దాడి చేస్తున్నదని, నేరచరితులను రాజకీయాల్లో నిషేధించడం ద్వారానే దీనికి అడ్డుకట్టవేయవచ్చునని అభిప్రాయపడింది. అర్థబలం, అంగబలం, అన్నింటికంటే గొప్ప శక్తులుగా మారినప్పుడు దేశం నష్టపోతుందంటూ ఈ విషయంలో చట్టంచేయాల్సిన బాధ్యత పార్లమెంటుకే వదిలిపెట్టింది. ఈ సందర్భంగా కొన్ని మార్గదర్శకాలు కూడా

## ఒక్క మాట

సుప్రీం జారీచేసింది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు సమర్పించే దరఖాస్తుల్లో తమపై ఉన్న క్రిమినల్ కేసు వివరాలను పేర్కొనడమే కాక ఎలక్ట్రానిక్ మీడియా, దినపత్రికల ద్వారా ప్రజలకు తెలియచేయాలని సూచించింది. అయినా పరిస్థితుల్లో పెద్దగా మార్పు కన్పించడం లేదు. క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నవారు కేసుల విచారణలో జరుగుతున్న జాప్యం కారణంగా ప్రజాప్రతినిధులుగానే కొనసాగుతున్నారు. ప్రజాస్వామ్యవాదులు దీన్ని అడ్డుకొనేందుకుఎన్ని ప్రయత్నాలు చేసినా, న్యాయస్థానాలు మరెన్నిసార్లు మందలించినా రాజకీయాల్లో నేరచరితులు రానురాను పెరిగిపోతున్నారు. వాస్తవంగా ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయాల నుండి నేరచరితులను దూరంచేయాలనే నినాదం చాలాకాలంగా వినిపిస్తున్నది. 1960 దశకంలో నేరచరితులను పక్కన కూర్చోబెట్టుకోవడానికి ప్రజలు ఏమనుకుంటారో ననే జంకు, భయం ఆనాటి నేతల్లోఉండేది. కాలంతోపాటు పరిస్థితులు కూడా మారిపోయాయి. నేరచరితులను నేరుగా రాజకీయాల్లోకి దింపే దురదృష్టపు రోజులు దాపురించాయి. ఇది ఎంతోకాలంగా గౌరవప్రదంగారాజకీయమే జీవనంగా సాగించే కొందరునేతలకు మనోవేదనగా మారింది. అప్పుడప్పుడు ఆ వేదన కట్టలు తెంచుకుంటూ బయటపడుతున్నది. నేరచరితులను దూరం పెట్టాలనే విషయంలో గతంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపు అన్ని రాజకీయ పార్టీలు ఒక దశలో ఏకాభిప్రాయానికి వచ్చాయి. కొన్ని స్వచ్ఛంద సంస్థలు వివిధరాజకీయ పార్టీలకు చెందిన పలువురు నేరచరితుల పేర్లను బయటపెట్టాయి. కానీఆయా పార్టీలు వారికి టిక్కెట్లు ఇవ్వకుండా ఉండలేకపోయాయి. అప్పట్లోనేఒకసారి ఈ విషయం ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు విచిత్రమైన అనుభవం ఎదురైంది. కరీంనగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ నేరచరితులకు, సారారాజులకు టిక్కెట్లు ఇవ్వరాదని తమపార్టీ నిర్ణయించినట్లు బహిరంగంగానే ప్రకటించారు. ఆతర్వాత ఆదిలాబాద్ జిల్లాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో అలా ప్రకటించారుకదా, అలాంటి వారికి మీరెందుకు టిక్కెట్లు ఇచ్చారని ఒక విలేకరి ప్రశ్నకు ఎన్టీఆర్ స్పందిస్తూ 'ఏమి చేయమంటావు బ్రదర్ వజ్రాన్నివజ్రంతోనే కోయాలి, దుష్టుడిని దుష్టుడితో కొట్టాల'ని జవాబు ఇచ్చారు. ప్రత్యర్థులు దుష్టులు అవునోకాదో కానీ తమ పార్టీ తరపున పోటీ చేసేవారిలో కొందరు దుష్టులున్నారని ఎన్టీఆర్ తేల్చేశారు. ఇది ఆయన చుట్టూ వేదికమీద ఉన్న ఆనాటి కొందరు తెలుగుదేశం నేతలకు కొంతఇబ్బంది కలిగించింది. కానీ వాస్తవంగా చూస్తే ఎన్టీఆర్ అన్నది నూటికి నూరుపాళ్లు నిజం. ఇలా ఒకరినిచూసి మరొకరు నేరచరితులను రంగంలోకి దింపుతున్నారు. నేరచరితుల నినాదం కేవలం తమ ప్రత్యర్థులను దెబ్బతీయడానికి ఉపయోగపడుతున్నదే తప్ప రాజకీయాల్లోకి వారిని రానీయకుండా నిరోధించలేకపోతున్నారు. కులం, డబ్బుతోపాటు నేరచరిత కలిగిన అభ్యర్థిత్వాలు పార్టీలు పరిశీలనలోకి తీసుకుంటున్నాయి. అలాంటి వారిని రెడ్‌కార్పెట్‌తో పార్టీలోకి స్వాగతం పలుకుతున్న సందర్భాలు కూడా లేకపోలేదు. కోట్లాది రూపాయలు వెచ్చించి ఎన్నికల్లో నెగ్గిన వ్యక్తి ఆ డబ్బును తిరిగిరాబట్టుకోకుండా ఉంటాడా? ప్రజాస్వామాన్ని దోచుకోకుండా ఎలా ఉండగలుగుతారు? అందుకే రాజకీయాలు సామాన్య కార్యకర్తలనే కాకుండా ఆదర్శవిధానాలు, నీతినిజాయితీలకు కూడా దూరంగా నెట్టబడుతున్నాయి. గెలుపుగుర్రాల కోసం పార్టీలు కూడా అన్వేషిస్తున్నాయి. ఏమిచేసైనా మరెన్ని తప్పులకు పాల్పడైనా విజయం దక్కించుకోగలడనే నమ్మకంతో టిక్కెట్లు కేటాయించే దుష్టసంప్రదాయానికి రాజకీయం దిగజారింది. తాము చేసిన తప్పులు ఎక్కడ తమను భూస్థాపితం చేస్తాయనే అనుమానంతో పదవీవ్యామోహంతో భయపడిపోయి ఆత్మవిశ్వాసం కోల్పోయి, నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చి ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని మంటకలిపిన కొన్ని పార్టీలకు చెందిన కొందరు నేతల అరాచకాలు ఈ నీచ సంకుచిత పరిణామాలకు తోడ్పడుతున్నాయి. అందులో భాగంగా నేరచరితులు నేరుగా రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నారు. రాజకీయ పార్టీల నేతలే కాదు రాజ్యాంగ నిపుణులు, మేధావులు, న్యాయకోవిదులు, మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన తరుణమిది. ప్రజలు కూడా ఆలోచించాలి. ఇదే పరిస్థితి కొనసాగితే నేరచరితులను రాజకీయాల్లోకి రాకుండా నిరోధించలేకపోతే ప్రజాస్వామ్యఉనికే ప్రశ్నార్థకంగా మారక తప్పదు. బడిత కలవాడిదే బర్రె అన్నట్లుగా నేర చరితులదే రాజ్యమవుతుంది. అరాచకం ప్రబలిపోతుంది. ●

# అణుశక్తిని పెంచుకునే దిశగా ఉత్తర కొరియా

కనుమ ఎల్లారెడ్డి

డొనాల్డ్ ట్రంప్ అధికారం స్వీకరించిన తరువాత ప్రపంచ రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. మెక్సికొ, కెనడా దేశాలపై సుంకాలు విధించడం, పనామా కాలువను స్వాధీనం చేసుకోవడం ఒక ఎత్తు అయితే మరోవైపు తమకు దక్షిణ కొరియా, జపాన్, అమెరికాలతో ముప్పు ఉందని, తమ దేశ భద్రతకు, సార్వభౌమాత్వాన్ని రక్షించుకొనుటకు మా అణుశక్తిని బలోపేతం చేసుకుంటామని కిమ్ తేల్చి చెప్పారు. ఆసియా దేశాలైనా జపాన్, దక్షిణ కొరియాలతో అమెరికా త్రైపాక్షిక సంబంధాలు కలిగి ఉండటం కిమ్ తీవ్రంగా దుయ్యబట్టారు. ఇది చాలా ప్రమాదకరమని, దక్షిణ కొరియాతో మాకు సంబంధాలు అంతంత మాత్రమేనని, దాడికి ప్రతి దాడి ఉంటుందని అందు నిమిత్తమే దశల వారీగా మా అణుశక్తిని బలోపేతం చేస్తామని కొరియన్ పీపుల్స్ ఆర్మీలో ప్రకటించారు. తమ సైనికులు రష్యాకు బాసటగా నిలుస్తున్నారని, రష్యా తన భద్రతను కాపాడుకోవటానికి శక్తి యుతంగా పోరాడుతుందని దాదాపు మూడు సంవత్సరాల నుంచి ఈ యుద్ధం ఎడతెరిపిలేకుండా కొనసాగుతోందని, ఉక్రెన్‌కు అమెరికా, దాని మిత్రదేశాలు ఆయుధాలు చేరవేయటమే ప్రధాన కారణం. అందుకు మేము కూడా ఇతోధికంగా రష్యాకు సహాయ పడవలసి వచ్చిందని కిమ్ చెప్పడం గమనార్హం. ఒక్క రోజులో యుద్ధాన్ని ముగిస్తాను అన్న వ్యక్తి ఆ దిశలో ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ట్రంప్ దృష్టి అంతా దేశాలపై సుంకాలు విధించటం, అమెరికాలో అక్రమ వలసలు వచ్చిన వారి



పైనే ఉంది. ముందు రష్యా, ఉక్రెన్ యుద్ధం ఆగాలి అందుకు ట్రంప్ చర్యలు తీసుకోవాలి. ఉత్తర కొరియాతో సంబంధాలు మెరుగుపరచుకోవాలి. అమెరికా వల్లనే మా ఆయుధ సామాగ్రిని పెంచుకోవాలనే, మేము అణుశక్తిని ధృడతరం చేస్తాం. ఇందుకు ఎవరికీ భయపడం. అణు నిరోధక సంధి (కంప్రెహెన్సివ్ టెస్ట్ బ్యాన్ ట్రీటి )అమలులో ఉన్నా మా దేశ రక్షణ కొసం మేము అణుధార్మిక శక్తిని వీడం అన్న దిశలో ఉత్తరకొరియా ఉంది. ఇటీవలే పలు డ్రోన్లు కూడా ఉత్తరకొరియా ప్రదర్శించింది. దానికి జడిసే దక్షిణ కొరియా అమెరికాతో స్నేహ హస్తం చాపింది అని భోగట్టా. దానితో పాటు జపాన్ కూడా చేయి కలపడంతో ఉత్తర కొరియా అప్రమత్తమైంది. ఆసియా దేశాలతోఅమెరికా చేయి కలపడం ఉత్తర కొరియాకు సహించడంలేదు. దేశాలు అణుశక్తిని కలిగి ఉండటం మామూలే. అయితే మితి మీరి అణు ప్రయోగాలు కలిగి ఉండటం ప్రమాదకరమే. సఖ్యత, అభివృద్ధి, సుస్థిరత మా అభిమతం అని అమెరికా, జపాన్, దక్షిణ కొరియా ప్రకటించాయి. అందు నిమిత్తమే మూడు దేశాల కలయుక. మరి ఉత్తర కొరియా ఎందుకు జడుసుకుంటుందో, ఎందుకు అణుశక్తిని బలోపేతం చేయాలి అనుకుంటుందో అంతు పట్టని విషయం. ప్రపంచంలో అన్ని దేశాలు స్నేహ వాతావరణం కలిగి ఉండాలి. దేశాలపై ఆంక్షలు ఉండరాదు, బెదరింపు ధోరణి పనికి రాదు. సహాయ, సహకారాలతో, ఉద్రిక్తతలు వదిలి అభివృద్ధి, ప్రగతి పథంలో దేశాలు పయనించాలని, ఆ దిశ లోనే నేతలు తమ పాలన సాగిస్తారని ఆశిద్దాం. ●

# సిఎం రాజీనామాతో మంటలు తగ్గేనా?




ఎన్.సీతారామయ్య

మణిపూర్‌లో మైతేయిలు, కుకీల మధ్య సోదరభావం రావాలి అప్పుడే శాంతి సామరస్యాలు వెల్లివిరుస్తాయి. దాదాపు రెండేళ్లనాడు హత్యలూ, అత్యాచారాలూ, గృహదహనాలతో అట్టుడికి ప్రపంచవ్యాప్తంగా మన దేశ పరువు ప్రతిష్ఠలను మంటగలిపిన ఆ రాష్ట్రం 650 రోజులైనా ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. రెండేళ్లుగా భయభ్రాంతులతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న ఆ రాష్ట్ర ప్రజల జీవితంలో ఈ పరిణామం ఇప్పటికిప్పుడు ఎలాంటి మార్పునూ తీసుకురాకపోవచ్చు. శాంతిభద్రతలు ఇప్పటికిప్పుడు గాడిన పడకపోవచ్చుకానీ, హింసాయుత వాతావరణం నెలకొన్నచోట ఓ శాంతి సుమం విచ్చుకునేందుకు దోహదపడవచ్చు. 2023 మే 3న రాష్ట్రంలో ప్రధాన తెగలైన మెయితీలకూ, కుకీలకూ మధ్య రాజుకున్న ఘర్షణలు చూస్తుండగానే కార్చిచ్చులా వ్యాపించగా అధికారిక లెక్కల ప్రకారమే 260 మంది ప్రాణాలు కోల్పోయారు. 60,000 మంది ఇప్పటికీ తమ స్వస్థలాలకు వెళ్లలేక సహాయ శిబిరాల్లో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. భద్రతా బలగాల పహారా కొనసాగుతున్నా మెయితీలు, కుకీలు ఒకరి ప్రాబల్య ప్రాంతాల్లోకి మరొకరు ప్రవేశించే సాహసం చేయటం లేదు. అందువల్ల నిరుపేదల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింది. మణిపూర్ హింసాకాండ సాధారణమైనది కాదు. అనేకచోట్ల మహిళలను వివస్త్రలను చేసి, వారిపై అత్యాచారాలకు పాల్పడిన ఉదంతాలు దిగ్భ్రాంతికి గురిచేశాయి. దేశానికి బలమైన రాజ్యాంగం ఉన్నా మణిపూర్లో కొనసాగుతున్న దారుణ హింసను అన్ని వ్యవస్థలూ చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయాయి. అది మన దేశంలో అంతర్భాగమని, అక్కడి ప్రజలు కూడా ఈ దేశ పౌరులేనని గుర్తించనట్టే ప్రవర్తించాయి. గవర్నర్ మొదలుకొని న్యాయవ్యవస్థ వరకూ అందరికందరూ మౌనంగా మిగిలారు. ఇలాంటి సమయాల్లో జోక్యం చేసుకోవాల్సిన కేంద్రం తన కర్తవ్యాన్ని మరిచింది. పోలీసు స్టేషన్లపై, సాయుధ రిజర్వ్ బెటాలియన్ స్థావరాలపై దాడులకు దిగి తుపాకులు, మందుగుండు ఎత్తుకుపోయిన ఉదంతాలు కోకొల్లలు. రాష్ట్రంలోని రెండు జాతుల వారు కలహించుకుంటున్నప్పుడు ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నవారు ఒక వర్గాన్ని వెనకేసుకొస్తే ఎంతటి విపత్కర పరిస్థితి ఎదురవుతుందో మణిపూర్లో స్పష్టంగా రుజువైంది. ఆ రాష్ట్రంలో సాయుధదళాల ప్రత్యేక అధికారాల చట్టం అమలును ఉపసంహరించిన తరవాత మెయితీలు మరీ రెచ్చిపోయారు. మెయితీ దళాలు వాహనాలను కూడా వినియోగించడం ప్రభుత్వ పెద్దల ఆశీస్సులకు నిదర్శనం. ఇది అరాచకాన్ని ప్రోత్సహించడమే. రాష్ట్రంలోని కుకీల మీద కక్షకట్టినట్టు ప్రవర్తించడమే. సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్న టేపుల్లో బీరేన్ గొంతు93శాతం సరిపోలిందని ట్రూత్ ల్యాబ్స్ నిర్ధారించిన ఐదురోజుల్లోనే ఆయన




తప్పుకున్నారు. అది ప్రైవేటు సంస్థ కనుక, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ (సిఎఫ్ఎస్ఎల్)లో పరీక్షచేయించాలని సొలిసిటర్ జనరల్ సుప్రీంకోర్టుకు చెప్పుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మరి కాస్తంత సమయం సంపాదించి పెట్టారు. కానీ, జస్టిస్ ఖన్నా ఇచ్చింది మూడువారాలగడువే కనుక, సదరు ప్రభుత్వ సంస్థనుంచి ఇందుకు పూర్తివిరుద్ధమైన నివేదిక వస్తే తప్ప సుప్రీంకోర్టు నుంచి బీరేన్‌ను కాపాడటం అసాధ్యం. ఆయన ఆదివాసీవ్యతిరేక, మైతీ అనుకూల వైఖరులు, విధానాలు పూర్తిగా ఆయన సొంతంకాదని, ఢిల్లీపెద్దల రక్షణల మధ్య ఆయన చెలరేగిపోయారని అందరికీ తెలుసు. పోలీసుల సహకారంతో, వారు అందించిన, వారినుంచి దోచుకున్న ఆయుధాలతో వారి వాహనాల్లోనే ప్రయాణిస్తూ మైతీ మిలిటెంట్ గ్రూపులు కుకీలపై అఘాయిత్యాలకు పాల్పడ్డాయన్న ఆరోపణలను ఈ ఆడియో టేపులు నిజమని నిర్ధారిస్తున్న నేపథ్యంలో, రేపు సర్వోన్నత న్యాయస్థానంలో బీరేన్ ఇరుక్కోవడం ఖాయం. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులకు, కమిటీలకు ఈ టేపులు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో, కుకీ హ్యూమన్‌రైట్స్ ఆర్గనైజేషన్ (కోహుర్) సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సివచ్చింది. మణిపూర్‌లో 21 నెలలుగా జరుగుతున్నదేమిటో ఈ టేపులు తేల్చేశాయి. బీరేన్ తప్పుకోవాలని ఆదివాసీ తెగలు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నందున, ఇప్పుడు వాళ్లు కాస్తంత శాంత పడవచ్చు. కనీసం ఇప్పుడైనా అందరూ కదిలి క్షతగాత్రంగా మిగిలిన మణిపూర్లో ఉపశమన చర్యలు తీసుకుంటారా? మాయమైన మనుషులు, ధ్వంసమైన ఇళ్లు, ఛిద్రమైన బతుకులు, మానప్రాణాలు తీసే మృగాళ్లు, జీవికకోల్పోయి ఎలా బతకాలో తెలియక కుమిలిపోతున్న కుటుంబాలు మణిపూర్ వర్తమాన ముఖచిత్రం ఇది. అందుకే ఆయుధాలు సమకూర్చుకుని అధికారంలో ఉన్నవారి అండదండలతో ఇన్నాళ్లనుంచీ రెచ్చిపోతున్న ముఠాల ఆటకట్టించటం తక్షణావసరం. వారూ వీరూ తేడా లేకుండా ప్రతీ మిలిటెంట్ గ్రూపునుంచీ ఆయుధాల స్వాధీనం జరగాలి. గాలివార్తలకు గ్రామాలు తగలబడుతూ, అనుమానాలు, భయాల మధ్య పరస్పర అవిశ్వాసంతో ఎవరికివారుగా ఉంటున్న అన్ని తెగలూ, జాతులూ సొంతిళ్లకు చేరి, సయోధ్యతో జీవించగలగాలి. ఇప్పుడు ముఖ్యమంత్రి పగ్గాలు ఎవరికి అప్పగిస్తారనేది కీలకమైన ప్రశ్న. ముఖ్యమంత్రి పదవిని చేపట్టేవారెవరైనా ప్రస్తుత సంక్షోభానికి చరమగీతం పాడగలిగే సత్తా ఉన్న నాయకుడై ఉండాలి. అల్లర్లకు కారణమైన ప్రధానవర్గాల నేతలను చర్చలకు రప్పించడమే కాదు, రాజకీయ నేతలు, ప్రభుత్వాధికారులతోపాటు పౌరహక్కుల నేతలకూ చర్చలలో ప్రాతినిధ్యం కల్పించడం ముఖ్యం. అంతకంటే ముందు, ఇరు వర్గాలు పోలీస్ స్టేషన్ల నుంచి అపహరించిన, అక్రమంగా కూడగట్టుకున్న ఆయుధాలన్నింటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. మైతీలు, కుకీలమధ్య సోదరభావం పాదుగొని, ఇకపై కలసిమెలిసి జీవించేందుకు అవసరమైన చర్యలు చేపడితే, నిరాశ్రయులైన ప్రజలు ధైర్యంగా స్వస్థలాలకు చేరుకోగలుగుతారు. మణిపూర్‌లో శాంతిసుమాలు విరబూసేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. అప్పుడే శాంతి సామరస్యాలు వెల్లివిరుస్తాయి. సంక్షుభిత మణిపూర్ మళ్లీచిగురిస్తుంది. బీరేన్ కారణంగా నిలువుగా చీలిపోయిన సమాజం ఒక్కటికావాలి. ●

# ప్రజావాక్కు



### నేటి ఉచితాలు రేపు డిమాండ్లు

ఎన్నికలవాగ్దానాలలో ఉచితాలనుప్రవేశపెట్టి ఓట్లు దండుకోవడం అన్ని పార్టీలకు ఆనవాయితీగా మారిపోయింది. తరువాతి ఎన్నికలలో మరిన్ని ఎక్కువ ఉచితాలను ఇస్తే తప్ప ఓట్లుపడవు. అప్పట్లో ఎవరో కోర్టుకెక్కితే ఉచితాలు మా పరిధిలోకి రావనిచెప్పింది. ఇంట్లో కూర్చుంటే డబ్బు వట్టి పుణ్యాన వచ్చి పడుతుంటే పనులకెవరు వెడతారు. వెళ్ళినా గతంలోయిచ్చే దానిమీద మూడింతలు అడుగుతున్నారు. సోమరులను తయారు చేయడానికే ఉచితాలు అని కోర్టులే అంటున్నాయి. రాష్ట్ర ఖజానాను ఉచితాలు ఖాళీ చేస్తున్నాయి. ప్రభుత్వాలు ఉపాధి కల్పన చేయలేకపోతున్నాయి. దేశం మొత్తం మీద రాష్ట్రపతి పాలన ఒక ఏడాదిపాటు విధించి ఉచితాలను పూర్తిగా ఉపసంహరించాలి. పనిచేసే ఒపిక ఉన్న వారందరికి వయసుతో నిమిత్తం లేకుండా ఏదోఒక ఉద్యోగం చూపించాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### రాజీనామానే సరైన పరిష్కారం

ముఖ్యమంత్రి బెరెన్ రాజీనామాతో మణిపూర్ మంటలు ఇకనైనా చల్లారుతాయ్ అనిపిస్తుంది. అయితే ఒక వ్యక్తి రాజీనామాతో అంత మారిపోతుంది. ముఖ్యమంత్రి స్థానంలోని వ్యక్తేసమాజం నిలువునా చిలడానికి కారణమైనప్పుడు వెనుక కేంద్రంఅండదండలు ఉన్నప్పుడు స్పీకర్ స్థానంలోని వ్యక్తి సహా సొంతపార్టీ నేతలే వెనుకఅడుగు వేసిన నేపథ్యం రాజకీయం బయట పడుతుందని లేదా బజారున పడుతుందని భావించిన అధిష్టానం ఇకనైనా బీరేన్ను తప్పించాలి.

-భారత అవినాష్, జనగామ

### పూర్తి రోజు కాంప్లెక్స్‌లను నిర్వహించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం ప్రతినెలా మూడవశనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఏర్పాట్లు చేస్తున్నట్లు పాఠశాల విద్యా శాఖ ప్రకటించింది. అయితే ఆ రోజు మెడికల్ లీవ్ తప్ప ఎటువంటి సెలవులు ఉపాధ్యాయులు వినియోగించుకోరాదని నిబంధన విధించడం సరికాదు. సెలవులు అవసరమైన ఉపాధ్యాయులు వినియోగించుకోవడానికి అవకాశం కల్పించాలి. అదే విధంగా ఉదయం పాఠశాల పూర్తి చేసి మధ్యాహ్నం పిల్లలకు భోజనాలు పెట్టించిన తర్వాత ఒంటి గంట లోపల క్లస్టర్ కు హాజరు కావాలని చెబుతున్నారు. కానీ ఇది సాధ్యం కాని పని.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### కృత్రిమ మేధోవిప్లవం

రానున్న కాలం కృత్రిమమేధదే. ప్రపంచాన్ని పాలించబోతోంది. అందుకు తగ్గట్టుగా సన్నద్ధత చూపని దేశం వెనకబడక తప్పదు. అదే సమయంలో దాన్ని విశ్వమానవ శ్రేయస్సుకి పూర్తిగా ఉపయోగపడేలా జాగ్రత్తవహించాలి. అందులో భాగంగా ఏభైకి పైగా దేశాలు కలిసి ఒక సదస్సు ఫ్రాన్స్‌లో నిర్వహించాయి. అందులో ముఖ్య భూమిక భారత్ తీసుకుంది. రెండో సమావేశం భారత్‌లో జరపబోతున్నట్లు ప్రకటించింది. ఎందుకీ సన్నద్ధత అంటే కృత్రిమమేధ సంబంధిత విజ్ఞానం ఏ ఒక్కరి దగ్గరో పోగుపడి వారి స్వార్థానికే ఉపయోగపడేలా కాకుండా అందరికీ అందడానికి. మేలైన పరిశోధనలు జరిగి, ఆ ఫలాలు ఉమ్మడిగా పొందడానికి. ఇంతవరకూ అమెరికా కృత్రిమ మేధ పరిశోధనల్లో ముందుంది. చాట్ జీపీటీ ద్వారా ప్రపంచానికి ఆ విజ్ఞాన ఫలాన్ని పరిచయం చేసినా, పరిశోధన కొనసాగేందుకు వీలైన సమాచారాన్ని, సాంకేతికతను మిగతా దేశాలకు దూరంగా ఉంచింది. లేదా బాగా ఖరీదైన వ్యవహారంగా ఉంచింది.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెలుతున్నాయి!

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దక్షిణ భారత తీర్థయాత్రలు పూర్తిగా వారి వ్యక్తిగతం! అయితే నలభై అయిదు రోజుల క్రితం ఇకపై నెలలో పద్నాలుగు రోజులు ప్రజల్లోనే ఉంటానని చెప్పారు. కానీ ఆ దిశగా అడుగు ముందుకు పడలేదు. ఉప ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్నవారు కొంత నిబద్ధత కలిగి ఉండాలని ప్రజలు ఆశిస్తున్నారు! వారు ముఖ్యమంత్రికి కూడా అందుబాటులో లేదన్నది మరో వార్త. వారు తీవ్రమైన నడుం నొప్పితో ఉన్నారని, తనకు అందుబాటులో ఉన్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు! అయితే సోషల్ మీడియాలో కొంత మంది వారు సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారంటూ ప్రచారం చేశారు! సమాచార లోపం, సరైన వివరణలు లేకుంటే ప్రజలు తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉంది?

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### బిసిలకు న్యాయం చేయాలి

బిసి జనాభా లెక్కలను పునః పరిశీలిస్తామని, సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనని వారికి మరో అవకాశం కల్పిస్తామని, బిసిలకు చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానికసంస్థల ఎన్నికల నిర్వహిస్తామని మంత్రి ప్రకటించారు. గతంలో మాదిరిగా కాకుండా మాట నిలబెట్టుకోవాలి.

-బూర్గుపల్లి కృష్ణ యాదవ్, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# డీజీపీను కలిసిన పెందుర్తి వెంకటేష్



**అమరావతి క్రైమ్ ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి నియమితులైన హరీష్ కుమార్ గుప్తను రాజానగరం టిడిపి నాయకుడు పెందుర్తి వెంకటేష్ ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తన మీద సోషల్ మీడియాలోఅసత్య ప్రచారం చేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకో వాల్సిందిగా కోరినట్లు తెలిపారు. అదేవిధంగా గత వైసిపి ప్రభుత్వం లో టిడిపి కార్యకర్తలపై నమోదైన తప్పుడు కేసుల గురించి కూడా ఈ భేటీలో డీజీపీ దృష్టికి తీసుకెళ్లినట్లుగా పెందుర్తి వెంకటేష్ తెలిపారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సానుకూలంగా స్పందించి సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని అలాగే సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లుగా వెంకటేష్ తెలిపారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

### -నగర కమిషనరు పులి శ్రీనివాసులు

**గుంటూరు తూర్పు, కార్పోరేషన్, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** మార్చి 8వ తేదీన జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా



నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మెప్మా సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించు కొని మెప్మా సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ఈ కామర్స్ ప్లాట్ ఫారం ద్వారా ఒకే రోజు లక్ష ఉత్పత్తులను అమ్మకం చేయడం ద్వారా గిన్నిస్ రికార్డు సాధించడానికి ఆర్పీలు నగరంలోని సభ్యులను చైతన్య పరచాలన్నారు. ఒకే రోజు లక్ష ఉత్పత్తులను అమ్మకం చేయడం ద్వారా రూ.కోటి ఆదాయం సభ్యులకు అందేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 16 నుంచి ఉత్పత్తుల కొనుగోలుకు ఆర్డర్లను ప్రీబుకింగ్ ఆప్షన్ ఇవ్వడం జరుగుతుం దన్నారు. గుంటూరు నగర అభివృద్ధి లో రాబోయే కాలంలో స్వయం సహాయక సంఘాల సభ్యులను భాగ స్వాములను చేస్తామన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా జరిగే ఈ అమ్మకాల్లో గుంటూరు నగరంలోనే లక్ష మందితో ఉత్పత్తులు అమ్మకం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాస రావు, మెప్మా పిడి విజయలక్ష్మి, ఉపాసెల్ పిడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోండి

### -విజయవాడ మునిసిపల్ కమిషనరు ధ్యానచంద్ర

**విజయవాడ క్రైం,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** పార్క్‌లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పెంచేందుకు మరమ్మత్తులన్నీ పూర్తి చేసి ప్రజలకు సత్వరంగా అందుబాటులోకి తీసుకురావాలని



కమీషనర్ ధ్యానచంద్ర సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన పార్క్‌కు వచ్చే సందర్శకులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. శుక్రవారం ఆయన టెక్కిల్ రోడ్డు,మథర్ థెరిస్సా జంక్షన్,వెటర్నరీ కాలనీ ప్రాంతాలని పర్యటించి,క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వెటర్నరీ కాలనీ లోని పార్క్‌ను సందర్శించి అక్కడకు వచ్చిన ప్రజలతో స్వయంగా తానే మాట్లాడి వారి సమస్యలనడిగి తెలుసుకున్నారు. వారు చెప్పిన ప్రతి సమస్యకి పరిష్కారం చేపాలని అధికారులను ఆదేశించారు. పార్క్‌లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పెంచేందుకు మరమ్మత్తులన్నీ పూర్తి చేసి ప్రజలకు సత్వరంగా అందుబాటులోకి తీసుకురావా లన్నారు. అనంతరం ఎన్టీఆర్ కమ్యూనిటీ హాల్లో ఉన్న ప్లే గ్రౌండ్ పరిశీలించి,ప్రజలు ఆడుకునేందుకు వీలుగాప్లే గ్రౌండ్ మరమ్మత్తులు చేయాలని అధికారులను ఆదేశించారు. టెక్కిల్ రోడ్,మథర్ థెరిస్సా జంక్షన్ ప్రాంతాలన్నీ పర్యటించి,పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. డ్రైన్‌లలో పూడికలను ఎప్పటికప్పుడు తీస్తూ తీసిన పూడికలన్నీ కూడ వెంటనే తీసేస్తూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ వ్యర్థాలను చూసి ఎప్పటి కప్పుడు వాటిని తరలించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు మీద ఉన్న పాత వాహనాలను పోలీసు వారి సమన్వయంతో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ జివిజిఎస్‌వి ప్రసాద్,ఇన్చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, సూపరింటెండెంట్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యశాలలో సదరన్ రీ క్యాంపు

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** జగ్గయ్యపేట పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం వికలాంగులకు సర్టిఫికెట్ల పునఃపరిశీలన నిమిత్తం ఏర్పాటుచేసిన సదరన్ రీ క్యాంప్‌కు వచ్చిన దివ్యాంగులకు కనీస వసతులు కల్పించకుండా, నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరో పణలు రావటంతో స్థానిక ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని అధికారులతో చర్చించారు. వికలాంగులను పరామర్శించి వారికి



అవసరమైన ఏర్పాట్లు చేయిస్తా మని హామీ ఇచ్చారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈక్యాంపును శనివారం కూడా కొనసాగిం చనున్నారు. ఆలస్యంగా వచ్చిన వైద్యాధికారి కోసం నిరీక్షిస్తున్న వికలాంగులకు కేవలం ఒక షామియానా టెంట్ వేశారని, మంచినీరు అందుబాటులో లేదని, విరిగిపోయిన కుర్చీలను వేశారని వికాలాంగులు ఆవేదన వ్యక్తంచేశారు. స్వల్పాహారం కూడా ఏర్పాటు చేయకపోవటంతో పొరుగూర్ల నుండి వచ్చిన వికలాంగులు పడుతున్న ఇబ్బందులను గమనించిన పాత్రికేయ సంఘాల నేతలు టిఎల్ఎన్ మూర్తి, మెటికల శ్రీనివాసులు వారికి మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటుచేశారు.

**ఇండియన్ మాష్టర్స్ అథ్లెటిక్స్ విజేతలు నరసింహారావు, జ్యోతిరెడ్డిలకు అభినందన :** రాజస్థాన్ అల్వార్‌లో ఈనెల 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు జరిగిన 44ల నేషనల్ ఇండియన్ మాష్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని వత్సవాయి గ్రామానికి చెందిన రామిశెట్టి నరసింహారావు (55) ట్రిపుల్ జంప్‌లో మూడవ స్థానాన్ని, అలాగే అదే గ్రామానికి చెందిన కురుగుంట్ల జ్యోతిరెడ్డి (40) వయసుల విభాగంలో 5 కిలోమీటర్ల నడక పోటీల్లో రెండో స్థానాన్ని, 200 మీటర్ల పరుగు పందెంలో మూడవ స్థానాన్ని సాధించారు. ఈసందర్భంగా శుక్రవారం తనను కలుసుకున్న విజేతలను ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ అభినందించారు.


# కోటప్పకొండ తిరునాళ్ళ పనులను పరిశీలించిన రాష్ట్ర రెవిన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ వినయ్‌చంద్

**నరసరావుపేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే తిరునాళ్ళ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర రెవిన్యూ దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ ఓడరేవు వినయ్ నాగ్‌చంద్ అన్నారు. శుక్రవారం త్రికోటేశ్వర



స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆర్డీవో మధులత, తహశీల్దార్ వేణుగోపాల్, ఆలయ ఈవో చంద్రశేఖరరావులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను వారు స్వీకరించారు. అనంతరం స్వామివారి లడ్డూ ప్రసాదాలను తయారు చేసే పోటును సందర్శించారు. అరిసెలు, లడ్డుల తయారీ, నాణ్యతా ప్రమాణాలలో లోపం లేకుండా చూడాలన్నారు. భక్తుల క్యూలైన్లను పరిశీలించి సూచనలు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. విద్యుత్ సరఫరా నిరంతరం ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. తాత్కాలిక వైద్య శిబిరాలను ఖచ్చితంగా అందుబాటులో ఉంచాలన్నారు. రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ వినయ్‌నాగ్‌చంద్ వెంట డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రవి, డిపిఓ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరావతి వార్త



# దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి

**తాడేపల్లి,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన



నివాళి అర్పిస్తున్నాను. బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రిగా ఆయన ఖ్యాతికెక్కారు. తన పదవీకాలంలో అనేక విప్లవాత్మక పథకాలతో ప్రజలు అభ్యున్నతికి విశేషంగా కృషిచేశారు. నమ్మిన విలువలకు జీవితాంతం కట్టుబడిన వ్యక్తి దామోదరం సంజీవయ్య,ఆయన జయంతి వేడుకలను కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది. దామోదరం సంజీవయ్య ఆశయసాధనకు కృషిచేద్దామని రాష్ట్ర విద్య,ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

# ఎన్నికల నియమావళి అమలు

**గుంటూరు కలెక్టరేట్,ఫిబ్రవరి 14,ప్రబగాతవార్త :** కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నిబంధనల నియమావళి అమల్లో ఉన్న కారణంగా ఏ వ్యక్తి,వ్యక్తులు కాని సరైన ఆధారులు లేకుండా రూ.50వేల కు మించి నగదు కలగి ఉండరాదు.పరిమితికి మించి నగదు తీసుకొని వెళ్ళిన యెడల ఎన్నికల నియమావళి ఉల్లంఘనగా భావించి సదరు నగదును జప్తు చేయబడుతుందని,అదేవిధంగా అనుమతి/ఆధారంలేకుండా మాదకద్రవ్యాలు,బంగారు వెండి ఆభరణాలు,ఎన్నికల ప్రచార సామాగ్రి ఓటర్లనుప్రలోభపెట్టు ఏఇతర సామాగ్రి రవాణా చేయటానికి ప్రయతి ్నంచినా ఎన్నికల నియమావళి ప్రకారం సదరు వాహనాల అనుమతులు రద్దుచేసిన వారిపై కేసు నమోదు చేయబడుతుందని కనుక ప్రజలు ఎన్నికల నియమావళిని పాటించాల్సిందిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం తెలియజేస్తుంది.

# తిరునాళ్ళ పండుగ ప్రశాంతంగా జరిగే విధంగా చూడాలి : గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

**పొన్నూరు, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** తిరునాళ్ళ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి క్వారీలో వేంచేసియున్న శ్రీ బాలకోటేశ్వర స్వామివారి తిరునాళ్ళ



మహోత్సవం సందర్భంగా అక్కడ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 26వ తేదీన జరిగే తిరునాళ్ళ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా భారీ, అతిభారీ వాహనాలను గుంటూరు-తెనాలి, తెనాలి-గుంటూరు వెళ్ళే వాహనాలను నందివెలుగు గ్రామం మీదుగా వెళ్ళే విధంగా దారి మళ్ళించడం జరుగు తుందన్నారు. అదేవిదంగా పొన్నూరు-గుంటూరు, గుంటూరు-పొన్నూరు వెళ్ళే వాహనాలను చేబ్రోలు, ముట్లూరు, వట్టిచెరుకూరు మీదుగా గుంటూరుకు మళ్ళిస్తున్నట్లు చెప్పారు. గతంలో ఉన్న వివిపి గ్యాలరీని ఈసారి ఆలయ ప్రాంగణం ఎదురుగా ఉన్న క్యూలైన్ ద్వారా వెళ్ళేవిధంగా మార్పు చేయడం జరిగిందన్నారు. ఆలయ అధికారులు అర్హులైనవారిని మాత్రమే వాలంటీర్లుగా నియమించుకోవాలని కార్యనిర్వ హణాధికారి పోతుల రామకోటేశ్వరరావుకు సూచించారు. ద్విచక్రవాహనాలను నిలిపే ప్రాంతంలో గతంలో దొంగనాలకు పాల్పడినవారి ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. భారీ విద్యుత్ ప్రభల నిర్వాహకులను, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసేవారిని, ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారిని ముందుగాను బైండోవర్ చేయాలని పోలీసులను ఆదేశించారు. తిరునాళ్ళ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో తిరునాళ్ళ జరిగేవిధంగా అన్ని శాఖల అధికారులు ఎవరి వంతు వారు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎస్పీ వెంట శిక్షణ ఐపిఎస్ అధికారి దీక్ష, తెనాలి డిఎస్పీ జనార్ధనరావు, సిఐ యాదల కోటేశ్వరరావు, ఎస్సై వెంకటకృష్ణ తదితరులున్నారు.

# అఖిల భారత అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో ఎస్ఆర్ఎం సత్తా

**మంగళగిరి,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** విఐటి యూనివర్సిటీలో ఈనెల 11,12తేదీల్లో జరిగిన అఖిల భారత అంతర్ కళాశాలల క్రీడాపోటీల్లో ఏపి ఎస్ఆర్ఎం విద్యార్థులు మెరుపులు మెరిపించి పలు క్రీడల్లో విన్నర్స్‌గా నిలిచారు.పురుషుల ఫుట్‌బాల్ పోటీల్లో ఏపి ఎస్ఆర్ఎం జట్లు విన్నర్స్‌గా నిలిచి రూ.30వేల ప్రైజ్ మనీని గెల్చుకున్నాయి.మహిళల బ్యాడ్మింటన్ పోటీల్లో ఎస్ఆర్ఎం జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రూ.10వేల నగదు పారితోషికాన్ని,ట్రోఫీని కైవశం చేసుకుంది.బ్యాడ్మింటన్ సింగిల్స్,డబుల్స్ పోటీల్లో ఇదే వర్సిటీకి చెందిన క్రీడాకారులు రన్నర్స్‌గా నిలిచారు.వాలీబాల్ ఫైనల్ పోటీలో ఎస్ఆర్ఎం వర్సిటీకి చెందిన మేల్,ఫిమేల్ జట్లు రన్నర్స్‌గా నిలిచి రూ.15000ల నగదు బహుమతితో పాటు షీల్డ్‌ను దక్కించుకుంది. ఈనెల 6నుంచి 8వ తేది వరకు వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగిన జాతీయ స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో కూడా ఏపి ఎస్ఆర్ఎం విద్యార్థులు తమక్రీడా ప్రతిభతో ట్రోఫిలను కైవశం చేసుకున్నారు. యోగా,



వాలీబాల్,బాస్కెట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు రన్నర్‌గా నిలిచి మొత్తం రూ.60వేల నగదు పారితోషికాన్ని గెల్చుకున్నారు .చెస్,100మీటర్ల పరుగు పందెంలోనూ ఇక్కడి విద్యార్థులు రజిత పతకాలను కైవశం చేసుకున్నారని యూనివర్సిటీ స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీపతి పేర్కొన్నారు.యూనివర్సిటీ కోచ్‌లు




వంశీ,శ్రీనాథ్,షేక్ పిరోళ్ళు క్రీడా జట్లకు మేనేజర్‌గా వ్యవహరించారు.విజేతలను యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్,వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరాలు ప్రశంసించారు.

# భూగర్భ జలాల పెరుగుదలకు అంగన్‌వాడి కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలి

**బాపట్ల,ఫిబ్రవరి14,ప్రభాతవార్త:** భూగర్భ జలాల పెరుగుదలకు అంగన్వాడి కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. భూగర్భ జలాల పెరుగుదలపై సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా



కలెక్టర్ వెంకటమురళీ మాట్లాడుతూ జలవనరులను సంరక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.వర్షపునీటిని ఒడిసిపట్టేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింద న్నారు. ప్రభుత్వ భవనాలపై కురిసే వర్షపు నీరు నేరుగా భూమిలోకి వెళ్లేలా ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. ప్రజా ప్రయోజనం కొరకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు చేరుకోవాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే ప్రతి అంగన్వాడి కేంద్రం వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. అంగన్వాడి కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించడానికి ప్రభుత్వం నిధులను విడుదల చేసిందన్నారు. ఒక్కొక్క ఇంకుడు గుంత నిర్మించడానికి రూ.16,000లు చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 261 అంగన్వాడి కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిబంధనలు అనుసరించి పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. 256 గ్రామాలలో ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పిడి ఉమా, పంచాయతీరాజ్ ఇంచార్జి ఎస్ఈ జి రత్నబాబు, ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిబి సిండ్రోమ్ సాధారణమైన వ్యాధి

### -స్పెషల్‌చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు


**గుంటూరు తూర్పు, కార్పోరేషన్, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** జిబి సిండ్రోమ్ వ్యాధి అతి సాధారణమైనదేనని దీని గురించి ఎవరూ ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం



లేదని స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు సూచించారు. శుక్రవారం ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి అక్కడ వ్యాధి గ్రస్తులను పరామర్శించారు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న కోలా మెర్సీ, జి.శ్రేష్ట, ఇమినో గ్లోబన్ ఇంజక్షన్ తీసుకొని రికవరీ అయ్యారన్నారు. బి.కమలమ్మ వెంటిలేటర్‌పై చికిత్స తీసుకొంటున్నట్లు చెప్పారు. వి.ఆశీర్వాదం చికిత్స పొందుతున్నారన్నారు. షేక్ గౌర్జాన్ చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. వి.నాగవేణి కోనసీమ జిల్లాకు చెందిన ఈమె కూడా చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. ఎస్‌కె రమీజూన్ పల్నాడు జిల్లా చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. రోగులందరికీ మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. న్యూరాలజీ విభాగాన్ని సందర్శించి అక్కడ పరిస్థితులను తెలుసుకొన్నారు. న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణ, ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి, సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వి రమణ, ఎసిపిఎం డిపార్టుమెంట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ ఈ వ్యాధి గురించి వివరించారు. చర్చించి పలు సూచనలు చేశారు. చీఫ్ సెక్రటరీ వెంట డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం తదితరులున్నారు.

# ముగిసిన వార్షిక శ్రీపంచముఖి ఆంజనేయ స్వామివారి బ్రహోత్సవాలు

**తెనాలి, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త :** దక్షిణా పథంలో అరుదైన ఆంజనేయస్వామి ఆలయంగా విరాజిల్లుతున్న శ్రీ సువర్చల సమేత శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో స్వామి వారి వార్షిక బ్రహోత్సవాలు ఘనంగా



ముగిసాయి. స్థానిక షరాఫ్ బజార్లో వేంచేసియున్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో వార్షిక బ్రహోత్సవాలు ముగింపుగా శుక్రవారం శ్రీ సువర్చలా సమేతుడైన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వార్ల పుష్పోత్సవ సేవ కన్నుల పండుగగా వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమ పండితుల వేద మంత్రములతో మంగళ వాయిద్యములతో, అశేషంగా పాల్గొన్న మహిళా భక్తుల సంకీర్తనలతో పుష్పోత్సవ సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం వేలాదిగా వచ్చిన భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమ విశిష్టతను ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి, అర్చకులు ఆర్.వి.కిరణ్‌కుమార్‌లు వివరించారు. ఇదే సందర్భంలో శ్రీ విఖనస శ్రీనివాస్ ట్రస్ట్ చేపట్టనున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి తోడ్పడే సప్తగిరీసునికి భక్తిమీర భూదానం అనే కరపత్రాలను మార్చి నెల 9వ తేది నుండి నిర్వహించనున్న శ్రీరామనామ పారాయణాయజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమాల ప్రచార బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ వంశపారంపర్య అర్చక స్వామి రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ఆర్.సురేష్, ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు నిఖిల్ శాండిల్య, శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, మడుపల్లి చంద్రశేఖర్, జంధ్యం రామారావు, పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, నాగ మారుతి, తదితర భక్తులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం,అభివృద్ధే భారతీయ కిసాన్ సంఘ్ లక్ష్యం


### -రాష్ట్ర అధ్యక్షులు సహదేవరెడ్డి

**కొల్లిపర,పిబ్రవరి 14 ప్రభాతవార్త:** భారతదేశంలో రైతు సంక్షేమ..అభివృద్ధి కోసం పాటుపడుతున్న సంస్థ భారతీయ కిసాన్ సంఘ్ అని రాష్ట్ర అధ్యక్షులు సహదేవరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తూములూరు గ్రామంలోని



గంగానమ్మగుడి ఆవరణలో భారతీయ కిసాన్ సంఘ్ గుంటూరు జిల్లా కార్యవర్గ ఎన్నికకు ముఖ్య అతిధిగా హాజరైన వాసుదేవరెడి మాట్లాడుతూ రైతులు సంఘటితంగా ఉండి తమ సమస్యలపై పోరాడితే వాటికి పరిష్కారం లభిస్తుందన్నారు.సాగునీటి కాలువలు,పంట కాలువలు సరిగా లేనందున పంటలకు సరైన సమయంలో నీరు అందక..మురుగు నీరు బయటకు వెళ్ళక పంటలకు నష్టం జరుగుతుంద న్నారు.పర్యావరణ పరిరక్షణ,భూమి పరిరక్షణ కొరకు సేంద్రియ,ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలన్నారు. అనంతరం భారతీయ కిసాన్‌సంఘ్ గుంటూరు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షులుగా కొండా కిషోర్‌రెడ్డి,గౌరవ అధ్యక్షులుగా భీమిరెడ్డి రామిరెడ్డి,ప్రధాన కార్యదర్శిగా కుర్రే బ్రహ్మారెడ్డి, కార్యదర్శిగా బొమ్ము వెంకటేశ్వరరెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులుగా కుర్రే సుధాకర్‌రెడ్డి,కోశాధికారిగా భీమవరపు బ్రహ్మా నందరెడ్డిలు నియమి తులయ్యారు.సమావేశానికి మాజీ అధ్యక్షులు రాంబాబు,రాష్ట్ర కార్యదర్శి కొండబాబు, ఆశాకిరణ్,వంగా సాంబిరెడ్డి,వింతా వేణుగోపాల రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో పాటు కొల్లిపర, తాడేపల్లి,మంగళగిరి,దుగ్గిరాల,తెనాలి మండలాల నుండి 100 మంది సభ్యులు పాల్గొన్నారు.

# ఉత్తమ డ్రైవర్లకు సత్కారం



**నరసరావుపేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** స్థానిక ఏపిఎస్ ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తమ డ్రైవర్లను ఈ సందర్భంగా సత్కరించారు. జిల్లా ఆర్టీసీ అధికారి ఎన్.వి.శ్రీనివాసరావు, రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అధికారి శివనాగేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్.ఐ. వేణు, డాక్టర్ నవ్య, సింధూ విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ కార్యక్రమంలో పాల్గొన్నారు. డ్రైవర్లకు రోడ్డు భద్రతకు సంబంధించి సూచనలు చేశారు. జోనల్ స్థాయి, రీజనల్ స్థాయి, డిపో స్థాయిలలో ఈ సందర్భంగా ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు.

# ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలను సందర్శించిన చీరాల ఎన్‌సిసి నూతన కమాండింగ్ ఆఫీసర్



**నరసరావుపేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** స్థానిక ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలను శుక్రవారం చీరాల నూతన కమాండింగ్ ఆఫీసర్ కల్నాల్ ఎన్ఎస్ పారమార్ సందర్శించారు. ప్రిన్సిపాల్ డా.సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ డా.పి శ్రీనివాస సాయి, ఎన్‌సిసి ఆఫీసర్ మేజర్ బిఎస్ఆర్‌కె రాజులుఘనంగా కమాండింగ్ ఆఫీసర్‌కు స్వాగతం పలికారు. తొలుత ఎన్‌సిసి క్యాడెట్స్ నుండి ఆయన గార్డు ఆఫ్ హానర్ స్వీకరించారు. కార్యక్రమంలోపారమార్ మాట్లాడుతూ ఎన్‌సిసి క్యాడెట్స్ క్రమ శిక్షణకు మారు పేరుగా ఉండి చక్కని భవిభారత పౌరులుగా, విద్యావంతులుగా, మేధావులుగాఎదగాలని అకాంక్షించారు. ఈ సందర్భంగా పారమార్‌ను కళాశాల ఆధ్యాపకులు ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో సుబేధర్ ముకేష్ కుమార్ పాల్గొన్నారు.

# భవిష్యత్తు అభివృద్ధికి డేటా ఆధారిత పరిపాలన కీలకం

## -ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** పరిపాలన,వ్యాపార వ్యూహాల్లో డేటా కీలకమైన స్థానం కలిగి ఉంది.విశ్లేషణలు,కృత్రిమ మేధస్సును సద్వినియోగం చేసుకునే సామర్థ్యం గల సంస్థలే భవిష్యత్తులో విజయాన్ని సాధిస్తాయి అని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ విపత్తుల నిర్వహణ,స్టాంపులు రిజిస్ట్రేషన్లు,సర్వే సెటిల్‌మెంట్,భూపరిపాలన) ఆర్.పి.సిసోడియా



అన్నారు.'బిజినెస్ అనలిటిక్స్ ఇంటెలిజన్స్ లో పురోగమనాలు" అనే అంశంపై విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో నిర్వహించిన జాతీయ సదస్సుకు సిసోడియా ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో ఆధునిక సాంకేతిక పరిపాలన సాగుతోందని ప్రతి ఒక్కరూ దాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు.సిసోడియా ప్రసంగిస్తూ డేటా ఆధారిత నిర్ణయాల ప్రాముఖ్యతను వివరించారు.ఆదాయ నిర్వహణ నుంచి ప్రజా సేవల దాకా అనేక రంగాల్లో కృత్రిమ మేధస్సు,పెద్ద డేటా విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నాయని,వాటి ద్వారా ప్రభుత్వాలు,వ్యాపార సంస్థలు మంచి వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవచ్చన్నారు.ఎవరు డేటాను సమర్థంగా విశ్లేషించి,అర్థం చేసుకొని నిపుణంగా నిర్ణయాలు తీసుకుంటారో వారిదే భవిష్యత్తు అన్న సిసోడియా వారే విజయం సాధిస్తారని స్పష్టంచేశారు.సదస్సుకు అధ్యక్షత వహించిన ఇన్‌చార్జ్ వీసి ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం బిజినెస్ అనలిటిక్స్ పరిశోధన కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ముందుండాలని పిలుపునిచ్చారు.సదస్సు డైరెక్టర్,వాణిజ్య,వ్యాపార పరిపాలన విభాగాధిపతి ఆచార్య రామినేని శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ వ్యాపార వ్యూహాల్లో డేటా విశ్లేషణ ప్రాధాన్యతను వివరించారు. సదస్సులో ప్రముఖ విశ్వవిద్యాలయాల నిపుణులు ఈ అంశంపై దృక్పదాలను పంచుకున్నారు.ఐఐఎం విశాఖపట్నంకు చెందిన ఆచార్య విజయభాస్కర్ కీలకోపన్యాం చేస్తూ బిజినెస్ ఇంటెలిజన్స్‌లో ఏఐ,మెషిన్ లెర్నింగ్ పెరుగుతున్న ప్రభావాన్ని వివరిస్తూ,నైతిక డేటా నిర్వహణ కీలకమన్నారు.ఐఐఎం రాయపూర్‌కు చెందిన వర్షమామిడి మేదో సంపత్తి హక్కులు,డేటా విశ్లేషణ అనుసందానంపై మాట్లాడారు.ఐపిఈ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తి,భవిష్యత్తు అంచనాల ప్రాముఖ్యతను వివరిస్తూ,వివిధ పరిశ్రమల్లో దీని వాస్తవ ఉపయోగాలను తెలియజేశారు.వ్యాపార విశ్లేషణలో ఆధునిక సాంకేతికతల పాత్ర పెద్దడేటా నిర్వహణలో సవాళ్ళు,ఏఐ ఆధారిత విశ్లేషణలు ఎలా పరిశ్రమలను మారుస్తున్నాయనే అంశాలపై సదస్సు చర్చించింది.కార్యక్రమంలో డాక్టర్ కనకదుర్గ,డాక్టర్ రత్న కిషోర్,డాక్టర్ సుధీర్‌కుమార్, డాక్టర్‌నాగరాజు,డాక్టర్ విష్ణు,డాక్టర్ చంద్రభాను తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి వార్షికోత్సవ వేడుకలు

**యడ్లపాడు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బోయపాలెం గ్రామ సమీపంలోని జాతీయ రహదారి ప్రక్కనే వేంచేసి యున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి ప్రధమ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అలయ



నిర్వాహకులు వడ్డేపల్లి నరసింహారావు అధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుండి స్వామివారి పూజా కార్యక్రమాలలో దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు స్వామి ప్రసాద వితరణ గావించారు. గ్రామస్థులే కాకుండా పరిసర గ్రామాల నుండి భక్తులు భారీగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

# పలువురిని పరామర్శించిన అంబటి మురళీకృష్ణ

**పొన్నూరు, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** మండల పరిధిలోని కట్టెంపూడి గ్రామానికి చెందిన యక్కటి కృష్ణ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకొన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ కట్టెంపూడి వెళ్ళి యక్కటి కృష్ణ కుటుంబ సభ్యులను



పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు. అదేవిధంగా మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన బీమా గారి నాయనమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మురళీకృష్ణ మామిళ్ళపల్లి వెళ్ళి ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు. అంబటి వెంట వైకాపా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఆకుల వెంకటేశ్వరరావు, అంజుమన్ కమిటి ఛైర్మన్ షేక్ మహమ్మద్(మాము), శివనాగులు, మాజీ సర్పంచి లంకపోతు పిచ్చిరెడ్డి, అక్కిరెడ్డి, సూరిశెట్టి ప్రసాద్, సముద్రయ్య, అంబటి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

# అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

## -అగ్రిగోల్డ్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి అగస్టీన్

**పొన్నూరు, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి కేతినేని అగస్టీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రిగోల్డ్ కంపెనీ ఎనిమిది



రాష్ట్రాల్లో 32లక్షల మందిని ఏడువేల కోట్ల రూపాయలు, మన రాష్ట్రంలో 19.52లక్షల మందిని రూ.3865కోట్ల భారీ ఆర్ధిక కుంభకోణానికి పాల్పడి కంపెనీని మూతేయడం జరిగిందన్నారు. కంపెనీ మూతతో బాధితులందరూ రోడ్డున పడాల్సిన దుస్థితి తెలెత్తిందన్నారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయపార్టీల నాయకులు అండగా ఉండి, న్యాయం చేయమని వేడుకున్నా పట్టించుకోలేదన్నారు.ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రజానాట్యమండలి జిల్లా నాయకుడు ఆరేటి రామారావు,సిపిఐ పార్టీ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు తదితరులున్నారు.

# 17న అన్నిశాఖల అధికారులతో సమావేశం : తహశీల్దార్ శ్రీనివాసశర్మ

**పొన్నూరు, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 17వ తేదీన తెనాలి సబ్ కలెక్టర్ అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ శ్రీనివాసశర్మ తెలిపారు. ఈ నెల 26వ తేదీన శివరాత్రి సందర్భంగా జరిగే తిరునాళ్ళకు సంబంధించిన



ఏర్పాట్లు, తదితర అంశాలపై సమీక్షించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు తప్పని సరిగా హాజరుకావాలని ఆయన కోరారు. ప్రస్తుతం దేవాలయం వద్ద జరుగుతున్న తిరునాళ్ళఏర్పాట్లను ఆయన పరిశీలించారు. సామాన్య భక్తులకు, విఐపి భక్తులకు తీసుకొంటున్న చర్యల గురించి వారిరువురు కొద్దిసేపు చర్చించారు. కార్యనిర్వహణాధికారి పోతుల రామకోటేశ్వరరావుతో మాట్లాడి విషయాలను తెలుసుకొన్నారు.

# బడ్జెట్ కేటాయింపుల్లో బిసీలకు తగు ప్రాధాన్యత ఇవ్వాలి : కేశన శంకరరావు

**మంగళగిరి,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** రానున్న ఏపి శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో జనాభాలో 52శాతంగా ఉన్న వెనుకబడిన తరగతులైన బిసీల సంక్షేమం అభివృద్ధికి తగు ప్రాధాన్యత నిచ్చేలా చర్చించి,బడ్జెట్ రూపకల్పన జరపాలని ఆ ంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.రాష్ట్రస్థాయిలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉన్నప్పటికీ,గత ప్రభుత్వం బీసీల సంక్షేమం కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను తమ విధానపర మానస పుత్రికైన నవరత్నాలకు మళ్ళించడంతో బిసీల అభివృద్ధికి గండి పడిందన్నారు.ఆ గండి పూడ్చడానికి బిసీల పక్షపాతి తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంమాత్రం అలాంటి తప్పులు పునరావృతం కానీయకుండా బిసీల సంక్షేమ అభివృద్ధికోసం సంబంధిత మంత్రిత్వ శాఖ ద్వారా,బిసి సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించి ఈ మేరకు కేటాయించిన నిధులన్నింటిని సక్రమంగా ఏడాదిలోపే ఖర్చయ్యేలా సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకోవాలని కేశన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాభివృద్ధిలో సేవలు వస్తుఉత్పత్తి రంగంలో బీసీలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అత్యధిక జనాభాగా



ఉన్న బీసీల తలసరి ఆదాయం పెంచేలా,బడ్జెట్లో ఆర్థిక విధనాలు రూపొందించాలన్నారు.సీఎం చంద్రబాబు గతంలో విజన్ 2020వలెనే,నేటి స్వర్ణాంధ్ర విజన్ 2047లు విజయవంతం కావాలంటే ఇప్పటినుండే పేదరిక నిర్మూలనకు బలహీన వర్గాల అభ్యున్నతికి వారి వారి జనాభా దామాషాలో బడ్జెట్లో తగినన్న నిధులు కేటాయించాలన్నారు.బిసిల అభివృద్ధికోసం సంబంధిత మంత్రిత్వ శాఖ ద్వారా విడుదలయ్యే నిధులు గత ప్రభుత్వంలో వలె దారి మళ్ళకుండా సక్రమంగా 100శాతం నిధులు సద్వినియోగమయ్యేలా చూడాలని రాష్ట్రప్రభుత్వం నిర్వహించబోతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా శంకరరావు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ఓటర్ల జాబితాను పరిశీలించిన తెదేపా నాయకులు

**పొన్నూరు, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో టిడిపి నాయకులు వార్డుల్లో, గ్రామాల్లో పర్యటిస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకొంటున్నారు. అందులో భాగంగా మీ ఓటును ఉమ్మడి అభ్యర్థి ఆలపాటి రాజే ంద్రప్రసాద్‌కు వేయాలని కోరుతున్నారు. మొదటి ప్రాధాన్యతా ఓటు ఆలపాటికి వేసి గెలిపించాలని కోరుతున్నారు. విద్యానగర్‌లో న్యాయవాది, టిడిపి నాయకుడు షేక్ బాజిసాహెబ్ ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేస్తూ ఓటర్లను కలుస్తున్నారు.



# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన మోడి వైఫల్యమే

## -కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందే దిలీప్

**పొన్నూరు, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించడమంటే ప్రధానమంత్రి నరేంద్రమోడి వైఫల్యమేనని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందే దిలీప్ శుక్రవారం ఒక ప్రటనలో తెలిపారు. మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ రాజీనామా, తదనంత పరిస్థితులు రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనకు దారితీయడం ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేయడమేనన్నారు. గత కొన్ని నెలలుగా మణిపూర్ రాష్ట్రంలో బిజెపి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందన్నారు. బిజెపి పక్షపాత ధోరణితోనే మణిపూర్‌లో అల్లర్లు చెలరేగాయన్నారు. కొన్ని శతాబ్దాలుగా భారతావని ఎరుగని



హింసాత్మక ఘటనలతో మణిపూర్ అతలాకుతలం అయిందన్నారు. మణిపూర్ ఘటనపై ప్రధానమంత్రి మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. దేశ మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న బిజెపిని ప్రజలు దూరంగా పెట్టిననాడే భావితరాలకు భవిష్యత్తు ఉంటుందన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి పథంలో నడిపించాలి

## -సిడిపిఓ విజయలక్ష్మి

**కొల్లూరు, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త) :** అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు పోషణతో పాటు ఆటపాటలతో విద్యను బోధిస్తూ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు రప్పించాలని అమృతలూరు ప్రాజెక్టు ఐసిడిఎస్ అధికారిని



గన్నవరపు విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం కొల్లూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పోషణభి పడాయి భి అనే అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో సిడిపిఓ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడుతూ 0నుండి ఆరు సంవత్సరాల పిల్లలలో మెదుడు 85శాతం అభివృద్ధి జరుగుతుందని ఆ వయస్సులోని వారికి మంచి నడవడికను నేర్పించే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. గర్భిణీలు, బాలింతలు, శిశువులకు అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించాల్సిన విధి విధానాలు సంపూర్ణ పోషకాహారం అందించే అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ తరగతులు 15వ తేది వరకు జరుగుతాయని అంగన్‌వాడీలు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏసిడిపిఓ విజయరాణి మాట్లాడుతూ ఆరు సంవత్సరాల లోపు పిల్లలతో ప్రేమ, స్నేహపూర్వక వాతావరణంలో పూర్తి సామర్థ్యాలను ఎలా అందించాలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారని అన్నారు. ఈ శిక్షణ కేంద్రాల్లో నేర్చుకున్న అంశాలతో సామర్థ్యాలను పెంచుకొని అంగన్‌వాడీ కేంద్రాలను కార్యకర్తలు అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, ఫజరున్నీసా, మాణిక్యం, డీఈవో సునీత, బీడీసీ లక్ష్మి, కొల్లూరు, అనంతవరం, దోనేపూడి, వెల్లటూరు, సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి అభ్యర్థి ఆలపాటికి ప్రాధాన్యతా ఓటివ్వండి

**పొన్నూరు, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజే ంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటివ్వాలని టిడిపి నాయకులు కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో నాయకులు మాట్లాడారు. కూటమి కార్యకర్తలు, నాయకులు ప్రతి ఓటరును కలిసి కూటమి అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో లక్ష్మీనారాయణచౌదరి, అలపర్తి చంద్రమోహన్, షేక్ బాజిసాహెబ్, పఠాన్ పిరోజ్‌ఖాన్, అహమ్మద్‌ఖాన్, చెన్నుపాటి భాస్కర్, కత్తుల రవికిరణ్, ఎద్దు సోంబాబు, పిన్నమనేని కోటేశ్వరరావు, దుర్గయ్య తదితరులున్నారు.

# అపార పరిపాలన అనుభవశాలి దామోదరం సంజీవయ్య

## -స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ

**గుంటూరు విద్య,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రిగా సంజీవయ్య పనిచేసిన రోజుల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే కాకండా ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చిన అపార పరిపాలన అనుభవ శాలి దమోదరం సంజీవయ్య అని స్వర్ణంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ అన్నారు.శుక్రవారం దామోదరం సంజీవయ్య 104వ జన్మదిన వేడుకలు స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ కార్యాలయంలో జరిగాయి.ఈ సందర్భంగా దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఏసుబాబు మాదిగ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ముఖ్యమంత్రి అయిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.1921 ఫిబ్రవరి 14వ తేదిన కర్నూలు జిల్లా కల్లూరు మండలంలోని పెద్దపాడు గ్రామంలో జన్మించారని,పేద కుటుంబంలో పుట్టి కృషి పట్టుదలతో బాగా చదువుకొని వివిధ ఉద్యోగాలు చేసి,ప్రజా సేవకు రాజకీయాల్లోకి వచ్చి,నిజాయితీగా ప్రజా సేవకే పునరంకితమైన దామోదరం సంజీవయ్య లాంటి నాయకులు నేటి రాజకీయ నేతలకు ఆదర్శమని ఏసుబాబు మాదిగ పేర్కొన్నారు.వివిధ శాఖల్లో కేంద్రమంత్రిగా పనిచేసిన గొప్ప రాజకీయవేత్త స్నేహశీలి,సౌమ్యుడు,సాహితీవేత్త, ఆదర్శప్రాయుడు, చిరస్మరణీయుడు దామోదరం సంజీవయ్య అని కొనియాడారు.పారిశ్రామికాభివృద్ధికి ఆయన ఎంతగానో కృషిచేశారన్నారు.ఎన్నో నిర్మాణాత్మక కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేసిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు.కార్యక్రమంలో స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ కార్యకర్తలు మండల,జిల్లాస్థాయి నాయకులు తదితరులు పాల్గొని సంజీవయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

# మందకృష్ణ మాదిగకు అభినందనలు

**వినుకొండ,ఫిబ్రవరి14,ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన మందకృష్ణ మాదిగకు కేంద్రప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం అందజేయడం అభినందనీయమని తెదేపా రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దాసరి కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక



జగ్జీవన్‌రావ్‌కాలనీ నందు అభినందన సభ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో దాసరి కోటేశ్వరరావుతోపాటు అనేక మంది మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని అభినందనలు తెలియజేశారు.

# అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణభీ పడాయిభీ శిక్షణ

**యడ్లపాడు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** ఐసిడిఎస్ ప్రాజెక్టు నాదెండ్ల పరిధిలోని యడ్లపాడు మండలం జగ్గాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల నందు అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ భీ పడాయి భీ శిక్షణా కార్యక్రమం శుక్రవారం ప్రారంభించటం జరిగింది. యడ్లపాడు, లింగారావుపాలెం సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమైనాయి. ఇందులో భాగంగా పిల్లల కోసం సంపూర్ణ, నాణ్యమైన



ప్రాధమిక విద్య అందించడం ప్రధానమని, పిల్లల్లో సమగ్ర అభివృద్ధి కొరకు ప్రీస్కూల్లో సరైన విద్యను అందిచండం పోషకాహార లోపం లేకుండా చేయడం అంగన్వాడీ కేంద్రాలలో నాణ్యతతో కూడిన మౌళిక వసతులు, అట పరిసరాలతో చిన్నారులకు బోధన అందించడం వంటి వాటిపై శిక్షణ నిర్వహించటం జరుగుతుందన్నారు. అయా సెక్టార్ల పరిధిలోని సూపర్‌వైజర్లు జోజమ్మ, వెంకటరమణమ్మ, ఎన్ హనుమాయమ్మ పాల్గొన్నారు.

# అప్కాస్ రద్దుచేసే ఆలోచన ఉప సంహరించుకోవాలి

## -ఐక్యవేదిక జిల్లా చైర్మన్ చాంద్‌భాష

**గుంటూరు విద్య,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయంలో జిల్లా ఐక్యవేదిక చైరమన్ చాంద్‌భాషా ఆధ్వర్యంలో కారవర్గ సమావేశం జరిగింది.చాంద్‌భాషా మాట్లాడుతూ ఇటీవల మీడియాలో వస్తున్నటువంటి కథనాల ప్రకారం ఆప్కాస్ విధానాన్ని ప్రభుత్వం రద్దుచేస్తున్న వార్తలు ఖండించారు.ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఉన్న సుమారు 1,80,000మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అప్కాస్ ద్వారా స్వచ్ఛమైనటువంటి సేవలు అందిస్తున్నారని వాటిని అభినందించారు.అటువంటి అప్కాస్ ను రద్దుచేస్తే దాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం వ్యతిరేకిస్తుందని తెలిపారు.ఈ ఆప్కాస్ వలన సుమారు 1,80,000మంది పొరుగుసేవ ఉద్యోగులకు మేలు జరుగుతుందని తెలిపారు.పొరుగు సేవల ఉద్యోగులకు జీతభత్యాలు ఒకటో తేదిన జమచేసే విధంగా ప్రభుత్వం కృషిచేయాలని ప్రభుత్వాన్ని కోరారు.రాబోయే రోజుల్లో ఆప్కాస్ కంటే మెరుగైన విధానాన్ని అమలుపరచాలని ఉన్నదాన్ని తీసివేయడం సబబు కాదని తెలియజేశారు.ఈ ఆప్కాస్ వన మధ్యవర్తులు లేకుండా,దళారులు లేని వ్యవస్థను రూపొందించినందుకు ప్రభుత్వాన్ని కొనియాడారు.కార్య క్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ నగర శాఖ ఉపాధ్యక్షులు నాగూర్‌వలి,నగర శాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.పెదరత్తయ్య నగరశాఖ కోశాధికారి శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ సిఎం దామోదరం సంజీవయ్య జయంతి

**వినుకొండ,ఫిబ్రవరి14,ప్రభాతవార్త:** మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు నియోజకవర్గ మాలమహానాడు సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్టిసి బస్టాండ్ సెంటర్ వద్ద జరిగిన ఈ వేడుకల్లో మాలమహానాడు అధ్యక్షులు కీర్తిపాటి వెంకటేశ్వర్లు తదితర నాయకులు పాల్గొని సంజీవయ్య



చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ, పట్టణ మాలమహానాడు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వాహన దారులు తప్పకుండా జాగ్రత్తలు పాటించాలి : ఎస్ఐ


**యడ్లపాడు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** జాతీయ రహదారిపై ప్రయాణించే వాహన దారులు తప్పకుండా ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని ఎస్సై వి బాలకృష్ణ పేర్కొన్నారు. మండల పరిధిలోని తిమ్మాపురం సెంటరు మరియు బైపాస్ వద్ద శుక్రవారం రాత్రి ప్రత్యేక వాహన తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వాహనాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలు, వాహనదారుడు హెల్మెట్ తదితర అంశాలపై పరిశీలన



నిర్వహించారు. ఈ సందర్భంగా అయన వాహనదారులకు పలు సూచనలు అందజేసారు. తప్పనిసరిగా వాహన దారుడు వాహనానికి సంబంధించి పూర్తిస్థాయి పత్రాలు దగ్గర ఉండాలని, వాహనం నడిపే సమయంలో హెల్మెట్ తప్పక ధరించాలని అతివేగంగా వెళ్లకుండా ప్రయాణాన్ని సజావుగా సాగించాలని, వాహనం నడిపే సమయంలో మద్యం వంటివి సేవించరాదని తెలిపారు. సరిఅయిన పత్రాలు లేని వారికి అపరాధరుసుం విధించటం జరిగిందన్నారు.

# కాళీమాత ఆలయ కమిటీ అన్నదాన సేవ

**తెనాలి, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త) :** ఆకలి గొన్న వారికి చేసే అన్నదానం ప్రాణదానంతో సమానమని ప్రతి నెల రెండవ శుక్రవారం విధిగా అన్నదాన సేవలను కొనసాగిస్తున్నామని కాళీమాత ఆలయ కమిటీ ఛైర్మన్ గుమ్మడి రమేష్ పేర్కొన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శివాజీచౌక్‌లో వేంచేసి ఉన్న శ్రీ



కాళీమాత ఆలయం సెంటర్లో శుక్రవారం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన సేవలను ఆలయ కమిటీ ఛైర్మన్ గుమ్మడి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాన సేవల ప్రాధాన్యతను వివరించారు. దాతలు భక్తులు సహకారంతో అన్నదాన సేవలను కొనసాగిస్తున్న తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో దాతలు, ఆలయ కమిటీ కార్యవర్గం పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు

**నూజెండ్ల,ఫిబ్రవరి14,ప్రభాతవార్త:** మండలకేంద్రమైన నూజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉప్పలపాడు గురుకుల పాఠశాల నందు అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం జరిగిందని వినుకొండ ప్రాజెక్టు సీడిపివో అనురాధ తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా



నవచేతన ఆధార్ శీల ప్రాధాన్యం, ఐదు రకాల అభివృద్ధి పిపి 1, పిపి2, గురించి వీడియో,ఆడియో ద్వారా కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరాజుకుమారి, విన్యాసమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌ఆర్‌ఎం విభాగంలో జాతీయ సదస్సు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** వర్సిటీలోని మానవ వనరుల నిర్వహణ విభాగంలో మార్చినెల 21,22వ తేదీల్లో భారత దేశాభివృద్ధికి మానవ మూలధనం 2047అనే అంశంపై జాతీయ సదస్సు జరగనుందని జాతీయ సదస్సు డైరెక్టర్ విభాగాధిపతి ఆచార్య భట్టు నాగరాజు తెలిపారు.ఈ జాతీయ సదస్సుకు సంబంధించిన ప్రతులను విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ ఆచార్య కె.గంగాధర



రావు శుక్రవారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి,రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం,ఛైర్మన్ బోర్డు ఆఫ్ స్టడిస్‌ఆచార్య వి.తులసీదాస్, ఆధ్యాపకులు డాక్టర్ కె.మధుబాబు,డాక్టర ఎం.రమా సత్యనారాయణ,డాక్టర్ వి.నాగనిర్మల,డాక్టర్ పి.వేణుగోపాలరావు,విద్యార్థులు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

# నేడు గణపవరం వీరాంజనేయస్వామి దేవస్థానం తృతీయ వార్షికోత్సవం

**చిలకలూరిపేటటౌన్,ఫిబ్రవరి14,ప్రభాతవార్త:** గణపవరం గ్రామం కావూరు డొంకలో వేంచేసియున్న వీరాంజనేయస్వామి వార్షికోత్సవం శనివారం జరుగుతున్నందున ఆలయ నిర్వాహకులు మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావును శుక్రవారం ఆయన నివాసంలో కలసి వార్షికోత్సవానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దేవాలయ వార్షికోత్సవ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణపవరం గ్రామం



నందు ప్రత్తిపాటి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బస్ షెల్టర్‌కు సహాయ సహకారాలు అందిస్తున్న డాక్టర్ చాపలమడుగు రామకృష్ణను ప్రత్తిపాటి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాట్రు శ్రీనివాసరావు, కెల్లంపల్లి అచ్చయ్య మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

# కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి

**నూజెండ్ల,ఫిబ్రవరి14,ప్రభాతవార్త:** జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి కూటమి నాయకులందరూ కలసి సమిష్టిగా పని చేయాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు లగడపాటి వెంకట్రావు పిలుపునిచ్చారు. శుక్రవారం కూటమి నాయకులతో కలసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమం మండలకేంద్రంలో లగడపాటి నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించి ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో డిసి ఛైర్మన్ గంగినేని రాఘవ, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# 16న జిల్లా పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ 2025 పోటీలు

**గుంటూరు స్పోర్ట్స్,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** ఈనెల 16వ తేది ఆదివారం గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కీర్తిశేషులు గుమ్మడి పుల్లేశ్వరరావు మెమోరియల్ గుంటూరు జిల్లా సబ్ జూనియర్,జూనియర్,సీనియర్,మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్,బెంచ్‌ప్రెస్ చాంపియన్ షిప్ 2025పోటీలు మంగళగిరిలోని వైష్ణవి కళ్యాణమండపం లో జరుగుతాయని జిల్లా పవర్ లిఫ్టింగ్ అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కర్‌రావు,ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని సంయుక్తంగా తెలియజేశారు.

# దామోదర సంజీవయ్య సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచు కోవాలని

## -బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళీ

**బాపట్ల,ఫిబ్రవరి14,ప్రభాతవార్త:** దామోదర సంజీవయ్య సేవలను ప్రతి ఒక్కరు గుర్తుంచు కోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. స్థానిక కలెక్టర్‌కార్యాలయంలో శుక్ర వారం మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీ వయ్య 105వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి జిల్లా కలెక్టర్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంజీవయ్య 1960 జనవరి 11న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యార



న్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక గొప్ప సంఘటన అని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రిగా సంజీవయ్య రాష్ట్ర అభివృద్ధి కోసం అవిశ్రాంతంగా కృషి చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని ఆయన అన్నారు. ఈకార్యక్రమం లో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లావెనుకబడిన తర గతుల సంక్షేమ శాఖ అధికారి శివలీల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖఅధికారి డాక్టర్ విజయమ్మ , బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడి వర్కర్ల సామార్థ్యాన్ని పెంచడానికే పోషణ్ భీమా



**బాపట్ల,ఫిబ్రవరి13,ప్రభాతవార్త:** అంగన్వాడి వర్కర్ల సామర్థ్యాన్ని పెంపొందించడానికి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ శివపార్వతి తెలిపారు. శుక్రవారం ఎస్ఎమ్‌జి బాలికల పాఠశాలలో అంగన్వాడి కార్తకర్తలకు పోషణ్ భీమా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పుడే జన్మనిచ్చన బిడ్డ దగ్గర నుండి 6సంవత్సరాల బిడ్డ వరకు వచ్చే వ్యాధుల నివారన చర్యల గురించి వెదుల్లపల్లి పిహెచ్‌పి లో వైద్యులు గా పని చేయుచున్న మానసదేవి వివరించారు.ఎస్ఎమ్,ఎమ్ఎమ్ పిల్లలను గుర్తించడం లోప పోషణాలు, రక్త హీనత పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత వాటి అవసరాలు గురించి చెప్పి ఉత్తేజం కలిగించారు.

# పోలీసు కవాతును విధి నిర్వహణలో భాగంగా మలుచుకోవాలి

## - గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్

**తెనాలి, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త :** మార్చింగ్ వెపన్ డ్రిల్ ద్వారా పోలీసులలో శారీరక దృఢత్వం క్రమశిక్షణ, మనోల్లాసం మెరుగుపడతాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక వివిఎస్ఆర్ అండ్ ఎన్‌వివిఆర్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం పోలీస్ పెరేడ్ నిర్వహించారు. ప్రత్యేకించి ఎఆర్ పోలీసులు నిర్వహించిన పెరేడ్‌లో ఎస్పీ సతీష్‌కుమార్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సతీష్‌కుమార్ మాట్లాడుతూ పోలీసులు విధుల్లో భాగంగా ప్రతి శుక్రవారం పోలీస్ ఫెరేడ్ నిర్వహిస్తామన్నారు. మార్చింగ్, వెపన్ డ్రిల్ల్ ద్వారా పోలీసుల్లో వారీరక దృఢత్వం, క్రమశిక్షణ మానసిక ఉల్లాసం మెరుగుపడతాయన్నారు. పోలీస్ విధి నిర్వహణలో ఫెరేడ్ అతి ముఖ్యమన్నారు. కేసుల పరిష్కారం విషయంలో పోలీసులు వ్యవహరించాల్సిన తీరు, ఫ్రెండ్లీ పోలిసింగ్ విధానాలపై సూచనలు చేశామన్నారు. ఇటీవల గుంటూరు మూడు సబ్ డివిజన్లు పరిధిలో ఫెరేడ్ నిర్వహించామన్నారు. తెనాలి డివిజన్ పరిధిలో షుమారు 185 మంది



ఎఆర్, సివిల్ పోలీసులు మార్చింగ్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. స్నేహపూర్వకంగా సమస్యలు పరిష్కారానికి పోలీసు శాఖ సేవలను వినియో గించు కోవచ్చాన్నారు. అనంతరం పట్టణంలోని ఆటో డ్రైవర్లతో సమావేశమై వారికి పలు సూచనలు చేశారు. ప్రయాణికుల పట్ల వినయ విధేతలు చూపాలన్నారు. దురుసుగా ప్రవర్తించే ఆటో డ్రైవర్లపై శాఖా పరంగా చర్యలుంటాయని, విధిగా ఆటో డ్రైవర్లు తమ వాహనాలకు పోలీస్ రిజిష్టర్ సీరియల్ నెంబర్, ప్రయాణీకులకు కనిపించేలా ఆటోలో ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా ఆటో ప్రయాణం పట్ల ప్రయాణీకులకు భద్రత ఉందన్న ఓ నమ్మకం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ ఎ.హనుమంతు, ట్రైనీ ఎస్పీ దీక్ష, తెనాలి డిఎస్పీ బి.జనార్ధన రావు, సిఐలు వి.మల్లిఖార్జునరావు, కె.రాముల నాయక్, ఎస్.రమేష్‌బాబు, ఎఆర్‌సిఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

# పిడుగురాళ్ళ వైస్ ఛైర్మన్ ఎన్నికలలో తెదేపా, పోలీసుల కిడ్నాప్‌లు ,దౌర్జన్యాలు

## -మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

**నరసరావుపేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** పిడుగురాళ్ల మున్సిపల్ ఎన్నికలలో వైస్ ఛైర్మన్ ఎంపికకు సంబంధించి టిడిపి, పోలీస్‌లు తమ



కౌన్సిలర్స్‌ను కిడ్నాప్ చేస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారంస్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మొత్తం 33మంది కౌన్సిలర్స్‌లో 32మంది కౌన్సిలర్‌లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారన్నారు. ఒకరు వైకాపా తరుపున గెలిచి టిడిపిలో చేరటం జరగిందన్నారు. సంఖ్యబలం చాలా స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఏకపక్షంగా ఉప ఎన్నికను టిడిపి కుట్రతో అడ్డుకుంటుందని తెలిపారు. గతంలో అధికారులను బెదిరించి వైస్‌ఛైర్మన్ ఎన్నికను వాయిదా వేసారని గుర్తు చేసారు. వైస్ ఛైర్మన్ ఎన్నిక కోసం వెళ్లే వారిని పోలీస్‌ల సహకారంతోనే టిడిపి నాయకులు కిడ్నాప్ చేసేందుకు తెగబడ్డారని తెలిపారు. ఉప ఎన్నిక కోసం ఇంతగా టిడిపి దిగజార్చటం దారుణమన్నారు. టిడిపి దౌర్జన్యాలకు భయపడి మాచవరం గ్రామంలో తలదాచుకున్న కౌన్సిలర్‌ను టిడిపి నాయకులు కిడ్నాప్ చేసారని, వారి సోదరులను స్టేషన్‌లో కూర్చోబెట్టివేధిస్తున్నారని వివరించారు. పార్టీ మారకపోతే పిడుగురాళ్ళ ఛైర్మన్ సుబ్బారావుకు చెందిన ఫ్యాక్టరీకి టిడిపి నాయకులు తాళాలు వేసారనిపేర్కొన్నారు. ఇటువంటి దుర్మార్గలను ఎదుర్కొని ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడకుండా ఉన్న కౌన్సిలర్‌కు సెల్యూట్ చేస్తున్నామని, ఎల్లకాలం అధికారం ఉండబోదని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు.

# ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట,ఫిబ్రవరి14,ప్రభాతవార్త: నిరుద్యోగులు,ఉపాధ్యాయుల మేధావుల గొంతుకగా మారి ఎమ్మెల్సీ అభ్యర్ధి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చట్టసభలలో తన గళం వినిపిస్తారనిమాజీమంత్రి, నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని శారద జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, డిఆర్ఎన్ఎస్‌సివిఎస్ డిగ్రి కళాశాలలలోపట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్ధిగా పోటిచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పట్ల అవగాహన ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఎమ్మెల్సీ గా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. త్వరలోనే రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు రానున్నాయని, భారీ పెట్టుబడులు, లక్షలాది ఉద్యోగాల కల్పన కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటిశాఖ మంత్రి లోకేష్ సరికొత్త ఆలోచనా విధానంతో ముందుకు వెళుతున్నట్లు ప్రత్తిపాటి తెలిపారు. ప్రభుత్వ శాఖలలో ఉన్న ఖాళీలను దశలవారీగా భర్తీ చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. నిరుద్యోగ యువత జీవితాలను చక్కబెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తుందన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ యువత, ఉపాధ్యాయులతోపాటు ప్రజల పక్షాన నిలబడి అన్ని వేళలా వారికి అందుబాటులో ఉంటారని కావున ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రత్తిపాటి కోరారు.

# పండరీపురం రోటరిక్లబ్‌ను అధికార పర్యటనలో భాగంగా కార్యక్రమాలు పరిశీలించిన రోటరి గవర్నర్ శరత్‌చౌదరి

**చిలకలూరిపేట, ఫిబ్రవరి14, ప్రభాతవార్త:** పండరీపురం రోటరిక్లబ్‌ను శుక్రవారం 3150 జిల్లా గవర్నర్ అధికార పర్యటనలో బాగంగా క్లబ్ చేపట్టిన పలు కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. తొలుతగా గ్రాండ్ వెంకటేష్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండరీపురం రోటరిక్లబ్ కాలుష్య నివారణకు క్లాత్‌తో బ్యాగులు తయారు చేయడం చేపట్టిందని వివరించారు. తొలుతగా 25వేలు బ్యాగ్‌లను తయారుచేసి పేద ప్రజలకు, మహిళలకు ఉచితంగా అందచేయటాన్ని ఆయన క్లబ్ సభ్యులను అభినందించారు. లక్షబ్యాగ్‌లు పంపిణీ చేయాలని వారు నిర్ణయించినట్లు దానికి తన సహకారం అందిస్తానని తెలిపారు. ఈ బ్యాగ్‌ల తయారీవలన మహిళలకు ఉపాధికూడా ఏర్పడిందని అన్నారు. రోటరి 3150 జిల్లా పరిధిలో ఇటీవల వచ్చిన వరదల సందర్భంగా 7రోజులలో 5వేల కుటుంబాలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. వరదదలవల్ల దెబ్బతిన్న పాఠశాలలను కూడా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం జిల్లా పరిధిలో బాలికలకు 7వేల సైకిళ్ల ఉచితంగా అందచేశామని అన్నారు. 5 వేలమంది మహిళలకు కుట్టుమిషన్లు అందచేసి వారి జీవనోపాదికి సహకారం అందించినట్లు ఆయన వివరించారు. 11వేల మంది క్యాన్సర్ బాధితులకు సహాయసహకారలు అందించామన్నారు. ప్రతిరోజు క్యాన్సర్ బాదితులకు, డయాలసిస్ చేసేదానికోసం హైదరాబాద్, గుంటూరులో డయాలసిస్ సెంటర్లను రోటరి3150 జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. పండరీపురం రోటరిక్లబ్ అధ్యక్షుడు వారణాసి శరత్‌కుమార్ మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం రెండు పెద్ద ప్రాజెక్టులు చేపట్టినట్లు వివరించారు. తుర్లపాడు గ్రామాన్ని దత్తత తీసుకొని అక్కడ రైతులకోసం రెండు చెక్‌డ్యాంలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రాజాపేట గురుకుల పాఠశాలలో 2.5 లక్షలతో ఆర్‌ఓ ప్లాంటును విద్యార్ధుల కోసం ఏర్పాటు చేశామన్నారు. ఈ ఆర్‌ఓ ప్లాంట్‌ను ఈనెల 18వ తేదిన రోటరి గవర్నర్ శరత్‌చౌదరి చేతులమీదుగా ప్రారంభంచేయనున్నట్లు తెలిపారు. అనంతరం కనపర్రు నైస్ పాఠశాలకు క్లబ్ ఆధ్వర్యంలో 2క్వింటాల్స్ బియ్యాన్ని రోటరి గవర్నర్ శరత్‌చౌదరి చేతులమీదుగా అందచేశారు. అదేవిధంగా మార్టూరులో గుప్పెడు బియ్యం పథకాన్ని ఒక పాఠశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో రోటరి కార్యదర్శి కొల్లా వెంకటసుబ్బారావు, కోశాధికారి జంపని శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ శ్రీనివాసరావు, రోటరి డైరక్టర్లు కెస్ఆర్‌ఎపి రాజు, కొల్లా సింగారావు, బి చెంచుపున్నయ్య, సి ప్రభాకరరెడ్డి, ఆలా దాసునాయన, యం లింగయ్యచౌదరి, తులసి వసంతరావు, దోరడ్ల మనోజ్‌కుమార్, బాస్కర్‌రెడ్డి, లంకా ఆదిరెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# రైతు భరోసా కేంద్రాల్లో రైతులు వివరాలను నమోదు చేసుకోవాలి : ఏఓ లక్ష్మారెడ్డి



**మాచర్ల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** రైతులందరూ రైతు భరోసా కేంద్రాల్లో తమ పొలం వివరాలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు నమోదు చేసుకోవడానికి ఆధార్ కార్డు జిరాక్స్, పొలం పాస్‌బుక్, 1బి, ఆధార్ కార్డుకు లింకయిన మొబైల్ నంబరును తీసుకుని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. రైతులు నమోదు చేసుకున్న వెంటనే ఐడీ నంబర్ వస్తుంది. ఆ నంబరుతో రైతుకు పథకాలు అందుతున్నాయా లేదా తెలుస్తాయన్నారు. రైతులు నమోదు చేసుకోవడం వల్ల గవర్నమెంటు ఇచ్చే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సున్న వడ్డీ పథకాలు, పంట రుణాలు ఇతర పథకాలకు ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. మండలంలోని రైతులందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు.

# ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు

**చిలకలూరిపేట,ఫిబ్రవరి14,ప్రభాతవార్త:** దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు రిజిష్టార్ కార్యాలయం వద్దనున్న గార్డ్స్ సంస్థ కార్యాలయంలో జరిగాయి. దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.



ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా పాల్గొన్న రిటైర్డ్ ఎక్సైజ్ సిఐ గోరంట్ల నారాయణ మాట్లాడుతూ ఎన్నో ప్రతిబంధకాలు, వివక్షలను ఎదుర్కొని సంజీవయ్య ప్రజా సంక్షేమంగా పరిపాలన సాగించారన్నారు. సంస్థ డైరక్టర్, న్యాయవాది దాసరి చిట్టిబాబు మాట్లాడుతూ నిరాడంబరంగా తొలి దళిత ముఖ్యమంత్రిగా పదవికే వన్నె తెచ్చిన వ్యక్తి దామోదరం సంజీవయ్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి యం రాధాకృష్ణ, గుంజి వీరాంజనేయులు, టి ప్రతాప్ ఒడ్డి, జర్రిపోతు బుల్లిబాబు, వడ్డాని చంద్రం, యాకోబు, దార్ల బుజ్జిబాబు ు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..**

పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి యం రాధాకృష్ణ మాట్లాడుతూ భూసంస్కరణలు అమలు చేయడం ద్వారా సమాజంలో అంతరావు పోగొట్టి సమసమాజాన్ని స్థాపించిన వ్యక్తి దామోదరం సంజీవయ్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల నారాయణ, బి చినమస్తాన్, షేక్ బాజీ, సాతులూరి రవి, సాగి నరసింహరావు, ఇంటూరి భవాని, వెంకటేష్, తనుబొద్దు సాంబశివారెడ్డి, కారుచోల స్వప్నకుమార్, కె రాజ, పి రాజు, టి పరదేశి, యం ప్రసాద్, జి బాబూరావు, సిహెచ్ శ్రీనివాసరావు, షేక్ బుడే, షేక్ నన్నే తదితర నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

**మున్సిపల్ కార్యాలయంలో..**

మున్సిపల్ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి ఇన్‌చార్జ్ మున్సిపల్ కమీషనర్‌షేక్ అబ్దుల్ రహీం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫిసర్ పి సుబ్బారావు, చల్లా శ్రీనివాసరావు, షేక అబ్దుల్ ఖాదర్, రమణరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రులకే ఆదర్శం దామోదరం సంజీవయ్య

**గుంటూరు విద్య,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** ముఖ్యమంత్రులకే ఆదర్శవంతమైన ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య అని తెలుగుదేశం పార్టీ అర్బన్ జిల్లా సెక్రటరీ సొపాటి రత్నం అన్నారు.స్థానిక వెంగళరావు నగర్ బాలికోన్నత పాఠశాల్లో దామోదరం సంజీవయ్య 104వ జన్మదిన వేడుకల్లో ముఖ్యఅతిధిగా పాల్గొని సంజీవయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సొపాటి రత్నం మాట్లాడుతూ సంజీవయ్య ఫిబ్రవరి 14,1921 జన్మించారని,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి,తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు.సంయుక్త మద్రాసు రాష్ట్రంలో,ఆంధ్ర రాష్ట్రంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో,కేంద్ర ప్రభుత్వంలో వివిధ మంత్రి పదవులు నిర్వహించా డన్నారు .రెండుసార్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షుడు కావడం కూడా ఈయన ప్రత్యేకతల్లో ఒకటని



కీర్తించారు.కాంగ్రెస్ పార్టీ తొలి దళిత అధ్యక్షుడిగా పనిచేసి పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషిచేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు సంజీవయ యనగర్‌లో ఉన్నటువంటి ప్రజలు తమ పిల్లలు కూడా ఉన్నతమైన భావాలు కలిగిన ముఖ్యమంత్రులుగా గొప్ప అధికారులుగాను తీర్చిదిద్దిన నాడు దామోదరం సంజీవయ్య కి అదే నిజమైన నివాళులు అర్పించినట్లు అవుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల్లో ఉన్న విద్యార్థులు,ఉపాధ్యాయులు సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు

# నేడు పట్టణంలో మంచినీటి సరఫరా నిలుపుదల : కమీషనరు

**తెనాలి, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త) :** కృష్ణానది నుండి రక్షిత మంచినీటిని పట్టణ ప్రజలకు అందిస్తున్న నేపథ్యంలో అయితానగర్‌లో పైప్‌లైన్ లీకుల మరమ్మత్తుల నిమిత్తం శనివారం పట్టణంలోని కొన్ని చోట్ల మంచినీటి సరఫరా నిలిపివేయనున్నట్లు కమీషనర్ బి.శేషన్న శుక్రవారం తెలిపారు. ప్రధానంగా అయితానగర్ పరిధిలోని ఒకటి నుండి 20వార్డులు, 35నుండి 40వార్డులు మంచినీటి సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

# నేడు తెనాలికి విచ్చేయనున్న పెనుగొండ శ్రీవాసవీమాత పీఠాధిపతి

## -శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి

**తెనాలి, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త) :** ఆర్యవైశ్యుల ఇలవేలుపు పెనుగొండ క్షేత్రంలో వేంచేసియున్న అఖిలభారత శ్రీవాసవీమాత పీఠం, పీఠాధిపతులుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి



శనివారం తెనాలి విచ్చేయనున్నట్లు శ్రీసాలిగ్రామ మఠం ప్రధాన కార్యదర్శి రావూరి సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక గంగానమ్మపేటలోని సాలిగ్రామ మఠంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రావూరి సుబ్బారావు మాట్లాడుతూ శ్రీ విద్యాపీఠం శ్రీ సాలిగ్రామ మఠం వ్యవస్థాపకులైన శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి, అంతర్జాతీయ గుర్తింపు గల పెనుగొండ పీఠం పీఠాధిపతులుగా బాధ్యతలు చేపట్టిన తరువాత, తొలిసారిగా ఈనెల 15వ తేదిన తెనాలి పట్టణానికి విచ్చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి భక్తులు భారీగా స్థానిక విఎస్ఆర్ ఎన్‌విఆర్ కళాశాల సమీపానగల, భారీ వినాయక విగ్రహం సెంటర్‌కు చేరుకుని శ్రీ ప్రజ్ఞానంద సరస్వతీ స్వామికి భక్తీ పూర్వక స్వాగతం పలికి, శోభాయాత్రగా శ్రీ సాలిగ్రామ మఠమునకు తోడ్కొనిరావడం జరుగుతుందన్నారు. ఈ విశేషమైనటువంటి శోభాయాత్ర పట్టణంలోని వివిధ కూడళ్ళను కలుపుకుంటూ గంగానమ్మపేటకు చేరుకుంటుందని, యావన్మంది భక్తులు ఈ విశేష కార్యక్రమంలో పాల్గొన వలసిందిగా కోరారు. సంస్థ జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య మాట్లాడుతూ ఈనెల 15వ తేది సాయంత్రం నాలుగు గంటల నుండి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు. ఈ సమావేశంలో సాలిగ్రామ మఠం ఛైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, గోపు రామకృష్ణ, రాజేశ్వరరావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, కోన నాగేశ్వరరావు, లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే పీఆర్కే జన్మదిన వేడుకలు

**కారంపూడి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైకాపా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులిమెల మాణిక్యం, రాయపాటి మాణిక్యం, మాచర్ల కిరణ్, నాగెండ్ల మరియదాసు, యోహాను, బూదల మరియమ్మ, బొమ్మిన అల్లయ్య, జాన్‌పాల్‌నాయక్, శాంసన్, ప్రవీణ్, చల్లా కృష్ణ, కొమెర అంకారావు, గుండెబోయిన శివ, బొంకూరి నాగేశ్వరరావు, బొగ్గరపు నాగరాజు, దాసు, అమరయ్య తదితరులు పాల్గొన్నారు.

# వీరాంజనేయస్వామి దేవస్థాన వార్షికోత్సవ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ



**చిలకలూరిపేట, ఫిబ్రవరి14, ప్రభాతవార్త:** గణపవరం గ్రామంలో వేంచేసియున్న వీరాంజనేయ స్వామి దేవస్థాన తృతియ వార్షికోత్సవ క్యాలెండర్‌ను శుక్రవారం ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. వార్షికోత్సవానికి నిర్వాహకులు మర్రి రాజశేఖర్‌ను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాట్రు కృష్ణరావు, కాట్రు శ్రీనివాసరావు, నన్నపనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పుల్వామా దాడిలో అమరులైన వీరజవాన్లకు నివాళి

**చిలకలూరిపేట,ఫిబ్రవరి14,ప్రభాతవార్త:** భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం పుల్వామా దాడిలో అమరులైన వీరజవాన్లను స్మరించుకుంటూ పట్టణంలోని నేతాజీ సెంటర్‌లోని సుభాస్ చంద్రబోస్ విగ్రహం వద్ద నివాళులు అర్పించి విద్యార్థులతో పట్టణంలో ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరాంకుశం శ్రీనివాస్ మాట్లాడుతూ పుల్వామా దాడిలో




ప్రాణత్యాగం చేసిన వీరజవాన్ల కుటుంబాలకు ప్రధాని నరేంద్రమోడి సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం అండగా నిలబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ఇన్‌చార్జి జయరామిరెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు పోట్రు పూర్ణచంద్రరావు,పోలూరి శ్యాంమోహన్‌రావు, వెల్లంపల్లి శ్రీరాములు, మహేష్, వంశీ, నాగరాజు, ఆదిమూలం గురుస్వామి, ఉప్పాల భాస్కరరావు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి


## -తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగపూర్ణచంద్రరావు

**నాదెండ్ల,ఫిబ్రవరి14,ప్రభాతవార్త:** ఉమ్మడి గుంటూరు, కృష్ణ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్ధిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగపూర్ణచంద్రరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాలలో పార్టీ కార్యకర్తలతో కలసి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కోరుతూ, ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ప్రజలనుంచి మంచి స్పందన లభిస్తుందని పూర్ణచంద్రరావు తెలిపారు.

# విద్యుత్తు అధికారుల తనిఖీలు

## -81కేసులునమోదు -రూ.3.79లక్షల అపరాధ రుసుం వసూలు

**దుర్గి, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** దుర్గి మండలంలో శుక్రవారం విద్యుత్‌శాఖాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 81కేసులు నమోదు చేసి రూ.3.79లక్షల అపరాధ రుసుంను



రాబట్టారు. విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఆపరేషన్ విభాగాల పల్నాడు జిల్లా పర్యవేక్షక ఇంజనీరు డాక్టర్ పి.విజయకుమార్ ఆధ్వర్యంలో 53 మంది అధికారులు, 195 మంది సిబ్బందితో 53 బృందాలుగా 4224 విద్యుత్ సర్వీసులు తనిఖీలు చేశారు. మీటర్లు లేకుండా డైరెక్టుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 23 మందిపై కేసులు నమోదు చేసి రూ.24వేలు, మీటరు ఉండి అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 8 మందిపై రూ. 1.50లక్షలు, అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరీలు విద్యుత్ వాడుకుంటున్న ఇద్దరుకు కేసులు నమోదు చేసి రూ.12000లు, అనుమతించిన లోడుకంటే అదనంగా విద్యుత్ వాడుకుంటున్న 48 మందిపై కేసులు నమోదు చేసి రూ.1.93లక్షల రూపాయలను అపరాధ రుసుంను రాబట్టారు. ఈ సందర భంగా విద్యుత్ అధికారులు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేర మన్నారు. తప్పనిసరిగా విద్యుత్ మీటరును ఏర్పాటు చేసుకో వాలన్నారు. మీటరుకు సీలు లేకపోయినా కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడినవారు అపరాధ రుసుం చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ చట్టం ఉపయోగించి వారి ఆస్తులను జప్తు చేస్తామన్నారు. ఈ తనిఖీలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, యం.సింగయ్య, డిఈఈ కె.రవికుమార్, ఎ.రామయ్య, ఎఈలు కె.కోటేశ్వరరావు, చంద్రశేఖర్, ఎ.శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# బర్డ్ ఫ్లూ పట్ల అపోహలు వీడి అవగాహన పెంచుకోండి

## -పశువైద్యనిపుణులు డాక్టర్ నాగిరెడ్డి

**తెనాలి, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త) :** రాష్ట్రంలో హాట్ టాఫిక్‌గా మారిన బర్డ్‌ఫ్లూ వ్యాధి పట్ల కోళ్ళ పౌల్ట్రీలో పనిచేసే వారు తగు జాగ్రత్తలు తీసుకుంటే చాలని, కోడి మాంసం, గుడ్లు తినకూడదనేది అపోహ మాత్రమేనని పశు వైద్య నిపుణులు డాక్టర్ నాగిరెడ్డి పేర్కొన్నారు. బర్డ్ ఫ్లూ వ్యాధి పట్ల అవగాహన క్రమంలో శుక్రవారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని పశు వైద్యశాలలో డాక్టర్ నాగిరెడ్డి మీడియాతో మాట్లాడారు. బర్డ్ ఫ్లూ వ్యాధి లక్షణాలను కూలంకషంగా వివరించారు. ప్రస్తుతం పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలో కొన్ని చోట్ల వెలుగు చూసిందని, వ్యాధిని నియంత్రించే కార్యాచరణలో భాగంగా ఆ ప్రాంతాల్లో తీసుకునే చర్యలను వివరించారు. కోళ్ళ ద్వారా వ్యాపించే బర్డ్ ఫ్లూ వ్యాధి కోళ్ళ ఫారాలలో పనిచేసే వారికి, సోకే అవకాశం ఉంటుందని, పౌల్ట్రీలలో పని చేసే వారు తగు జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందన్నారు. మన ప్రాంతంలో అటువంటి వ్యాధి లక్షణాలు ఏమీ లేవన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నచోటు నుండి కోళ్ళు, కోడిగుడ్లు బయటకు వచ్చే పరిస్థితి ఉండదని కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజలు తమ ఆహారపు అలవాట్లలో కోడిగుడ్డు, చికెన్ తిన్నా కూడా వ్యాధి వస్తుందనే అపోహ అన్నారు. కోళ్ళ ద్వారా వచ్చే వైరస్ మనుషుల నుండి మనుషులకు రాదన్నారు. కుక్కలలో కూడా వైరస్ లక్షణాలు ఉన్నాయని, కుక్కలు పెంపకం దారులు విధిగా వ్యాక్సిన్ వేయించాలని, అదే విధంగా పిల్లలు పెంపకం దారులు కూడా వ్యాక్సిన్ వేయించాల్సిన అవసరం ఉందన్నారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి పట్ల అవగాహన ఉండాలి కానీ అపోహలు పెంచుకోవద్దన్నారు.

# నేడు ఎన్టీఆర్ ట్రస్టు యూఫోరియా మ్యూజికల్ కన్సర్ట్ కార్యక్రమం సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

## -హాజరుకానున్న సిఎం ఇతర మంత్రులు

**విజయవాడ క్రైం,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** నేటి సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ఎన్టీఆర్ ట్రస్ట్ యుఫోరియా మ్యూజికల్ కన్సర్ట్ కార్యక్రమం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగనున్న సందర్భంగాను,దానికి సిఎం నారా చంద్రబాబు నాయుడుతో పాటు ఇతర మంత్రులు,అతిథులు విచ్చేయనున్న సందర్భంగా శనివారం మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్‌ను వివిధ మార్గాల్లో ప్రజల సౌకర్యార్థం దారి మళ్లించనున్నట్లు సిపి రాజశేఖరబాబు తెలిపారు.మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు కంట్రోల్ రూం వైపు నుండి బెంజి సర్కిల్ వైపుకు వెళ్ళే అన్ని వాహనాలు ఆర్టీసి వై జంక్షన్ నుండి ఏలూరు రోడ్డు మీదుగా స్వర్ణ ప్యాలెస్,దీప్తి సెంటర్ చుట్టుగుంట, పడవలరేవు,రామవరప్పాడు రింగ్ మీదుగా బెంజి సర్కిల్ వైపుకు వెళ్ళాలని తెలిపారు.ఆర్టిసి వై జంక్షన్ నుండి బందరు లాకులు,రాఘవయ్య పార్క్,పాత ఫైర్ స్టేషన్ రోడ్,అమెరికన్ ఆస్పత్రి,మసీదు రోడ్,నేతాజీ బ్రిడ్జి,గీతానగర్,స్క్రూబ్రిడ్జి మీదుగా బెంజి సర్కిల్ వైపుకు మళ్ళించబడతాయని ఆయన స్పష్టం చేశారు..బెంజి సర్కిల్ వైపు నుండి బందర్ రోడ్ లోనికి వచ్చే వాహనాలు బెంజి సర్కిల్ నుండి ఫకీరు గూడెం,స్క్రూబ్రిడ్జి,నేతాజీ బ్రిడ్జి,బస్టాండు వైపుకు మళ్ళించనున్నామన్నారు.రెడ్ సర్కిల్ నుండి ఆర్టీఏ జంక్షన్,శిఖామణి సెంటర్ నుండి వెటర్నరీ జంక్షన్ వరకు ఏ విధమైన వాహనాలను అనుమతించమని ఆయన స్పష్టం చేశారు.బెంజి సర్కిల్ నుండి డిసిపి బంగ్లా కూడలి వరకు (యంజి రోడ్ నందు) మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు ఆహ్వానితులను మాత్రమే అనుమతి స్తామన్నారు.

**ఆర్టీసి సిటీ బస్సుల మళ్లింపులు:** మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు ఆర్టీసి వై జంక్షన్ నుండి బెంజి సర్కిల్ వైపుకు ఆర్టీసి బస్సులను అనుమతించమన్నారు.ఆర్టీసి వై జంక్షన్ నుండి బందరు రోడ్డు,రూట్ నెం.5లో వెళ్ళే ఆర్టీసి సిటీ బస్సులు ఏలూరు రోడ్డు మీదుగా రామవరప్పాడు రింగ్ వరకు వెళ్ళి అక్కడి నుండి బెంజి సర్కిల్ వైపుకు వెళ్ళాలని పేర్కొన్నారు.

**ప్రేక్షకుల సౌకర్యార్థం పార్కింగ్ వివరాలు:** టేబుల్ ప్లాటినం,గోల్డ్ పాస్ హోల్డర్లు తమ కార్లను ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం లోపల గేట్-2 పక్కన పార్కింగ్ చేసుకోవాలని, ఫాన్‌పిట్,గోల్డ్ పాస్ హోల్డర్లు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం గేట్-4 పక్కన పార్కింగ్ చేసుకోవాలన్నారు. ప్లాటినం పాస్ హోల్డర్లు తమ కార్లను సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లోను,ప్రభుత్వ అధికారుల కార్లు,బైకులు కమాండ్ కంట్రోల్ వద్ద,ఫాన్‌పిట్,గోల్డ్ పాస్ హోల్డర్లు తమ కార్లు,బస్సులను బిషప్ అజరయ్య స్కూలు మైదానం లోను,గోల్డ్,సిల్వర్ పాస్ హోల్డర్లు తమ కార్లను సియస్‌ఐ చర్చి గ్రౌండ్‌లోను,స్టేట్ గెస్ట్ హౌస్ ఆవరణలోను,స్మృతివనం వెనుక ఖాళీ ప్రదేశం లోను,యన్టీఆర్ కలెక్టర్ కార్యాలయంలోను,లెమన్ ట్రీ హోటల్ సెల్లార్ పార్కింగ్ లోను,బందరు రోడ్ లోని పంచాయితీ రాజ్ హెడ్ ఆఫీసు ఆవరణలోను పార్కింగ్ చేసుకోవాలని పేర్కొన్నారు. అన్ని రకాల పాస్ హోల్డర్‌లు తమ ద్విచక్ర వాహనాలను బందరు రోడ్డులోని స్వగృహ ఫుడ్స్ పక్కన ఉన్న కొలుసు పార్థసారధి గెస్ట్ హౌస్ ఆవరణ లోను గోల్డ్,సిల్వర్ పాస్ హోల్డర్లు తమ కార్లను సబ్ కలెక్టర్ కార్యాలయం లోను,రేడియో స్టేషన్ నుండి పోలీస్ కమీషనర్ కార్యాలయం వరకు రోడ్డుకు ఒక పక్కన,ఆర్ అండ్ బి హెడ్ ఆఫీస్ కార్యాలయం లోను(బందరు రోడ్డు),సిద్ధార్థ పబ్లిక్ స్కూలు గ్రౌండ్ (మొగల్రాజపురం),బస్సులను సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్(మొగల్రాజపురం),కార్లను సిద్ధార్థ ఆర్ట్ కళాశాల మైదానం (మొగల్రాజపురం),శాతవాహన కళాశాల ఆవరణ,విశాలాంధ్ర రోడ్ లోను పార్కింగ్ చేసుకోవాలన్నారు.బెంజి సర్కిల్ వైపు నుండి పోలీస్ కంట్రోల్ రూం వరకు స్టేడియం వద్ద ట్రాఫిక్ రద్దీని బట్టి ఇతర వాహనాలను బందరు రోడ్డు లోకి అనుమతి స్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసే ప్రేక్షకులు వారి వాహనాలను వారు పొందిన పాస్‌ల ఆధారంగా పైన తెలిపిన పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే పార్కింగ్ చేసుకోవాలని,ఎక్కడ పడితే అక్కడ స్టేడియం పరిసర ప్రాంతాల్లో చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

# జిల్లా పోలీసు కార్యాలయంలో మాజీ సిఎం సంజీవయ్యకు నివాళులర్పించిన పల్నాడు జిల్లా ఎస్పీ

**నరసరావుపేట క్రైం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఆయన జీవితం విద్యావంతునిగా ఎదిగారన్నారు. రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా పని చేయడం గొప్ప విషయమన్నారు. అఖిలభారత కాంగ్రెస్



దామోదరం సంజీవయ్యకు ఘనంగా నివాళులర్పించారు. సంజీవయ్య చిత్రపటానికి ఎస్పీ కె.శ్రీనివాసరావు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ సంజీవయ్య కర్నూలు జిల్లాలో సాధారణ కుటుంబంలో జన్మించారన్నారు. అనంతపురంలో విద్యాభ్యాసం చేశారన్నారు. చిన్న గుమస్తా ఉద్యోగం నుండి ప్రారంభమైన కమిటీ అధ్యక్షునిగా ఆయన పని చేశారన్నారు. 1976లో ఎన్నికల ప్రచార సమయంలో రోడ్డు ప్రమాదానికి గురై పూర్తిగా కోలుకోలేక మరణించడం జరిగిందన్నారు. ఎస్పీ కె.శ్రీనివాసరావుతో పాటు అదనపు ఎస్పీలు జె.వి.సంతోష్, వి.సత్తిబాబు, డిఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, సి.ఐ. కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

# దామోదర్ సంజీవయ్యకు నివాళులర్పించిన విద్యుత్తు శాఖ ఎస్ఈ

**నరసరావుపేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు ఆయన జయంతి సందర్భంగా శుక్రవారం విద్యుత్‌శాఖ అధికారులు ఘనంగా నివాళులర్పించారు. సూపరింటెండెంట్ ఇంజనీర్, డాక్టర్ పత్తిపాటి విజయ్‌కుమార్ దామోదరం



సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రథమ దళిత ముఖ్యమంత్రి సంజీవయ్య అని తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం సంతోషమన్నారు. దామోదరం సంజీవయ్య రాష్ట్రానికి చేసిన సేవలను గుర్తు చేశారు. నేటి యువతకు ఆయన ఆదర్శమని ఎస్ఈ డాక్టర్ పత్తిపాటి విజయ్‌కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు రాంబోట్లు, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలి : కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** ప్రతి రోజు ఆహారం తీసుకునేందుకు వచ్చే ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని, పారిశుధ్య నిర్వహణ ప్రతిరోజు సక్రమంగా జరుపుతూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. శుక్రవారం ఆయన ధర్నా చౌక్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ని పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లలో పారిశుధ్య నిర్వహణ ఖచ్చితంగా జరగాలన్నారు. మధ్యాహ్నం భోజనం కోసం విచ్చేసిన ప్రజలను ఆహార నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్ భవనం మొత్తం పర్యటించి వాడుక నీరు,త్రాగునీరు



సక్రమంగా వస్తుందా లేదా అని పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ,మరుగుదొడ్ల నిర్వహణ పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ ప్రతి రోజు సక్రమంగా జరుపుతూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

# జెఇఇ మెయిన్స్‌లో నూరుశాతం సాధించిన ఆకాష్ విద్యార్థులు

**విజయవాడ, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** జెఇఇ మెయిన్స్ 2025లో విజయవాడ ఆకాష్ ఇన్స్టిట్యూట్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరిలో నూరుశాతం పర్సంటేజ్ సాధించారని ఆకాష్ ఇన్స్టిట్యూట్ స్టేట్‌హెడ్ జెఆర్‌విఎస్ఎస్ మూర్తి తెలిపారు. బెంజ్‌సర్కిల్ వద్ద వున్న సంస్థ



ప్రాంగణంలో ఆయా విద్యార్థులను ఆయన అభినందించారు.

# గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సిఎం చంద్రబాబు సుముఖత

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల



సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సుముఖత వ్యక్తంచేశారని సంఘ రాష్ట్ర సమాఖ్య కమిటి అధ్యక్ష, కార్యదర్శులు గుడి నాగరాజు, సిహెచ్ అన్నపూర్ణాచారి తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల తరపున పలు సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సిఎంకు శుక్రవారం అందజేసినట్లు తెలిపారు. తమతో దాదాపు 15 నిముషాలపాటు చంద్రబాబు గడిపరని, తాము విన్నవించిన విషయాలను శ్రద్ధగా ఆలకించారని తెలిపారు.

# సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం

**విజయవాడ, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** సమాజాభివృద్ధికి జర్నలిస్టులే కీలకమని పిసిసి వైస్ ప్రెసిడెంట్ కొలనుకొండ శివాజీ అన్నారు.



శుక్రవారం ఏపియుడబ్ల్యుజె అర్బన్ డైరీ 2025ను విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ జర్నలిస్టుల సహకారంతోనే తానీస్థాయికి వచ్చానన్నారు. బుడమేరు వరదల సమయంలో జర్నలిస్టులు చేసిన కృషి అనన్యసామాన్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ రాజ్యసభ ఎంపి కెవిపి రామచంద్రరావు, యూనియన్ అర్బన్ అధ్యక్షుడు చావారవి, ఐజెయు కౌన్సెల్ మెంబర్ షేక్‌బాబు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్, యూనియన్ అర్బన్ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, రమణారెడ్డి, దానం నాగరాజు, విజయభాస్కర్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిథులు పాల్గొన్నారు.

# పోషకాహార లోపం బారిన పడకుండా చూచుకోవాలి

## -ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక

**కొల్లిపర,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** గర్భిణీలు, చిన్నారులు పోషకాహార లోపం బారిన పడకుండా చూచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు.శుక్రవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్‌భీ-పడాయి భీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్ అధికారులు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా



రాధిక మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య దశ నుండే విద్యాభివృద్ధి మెరుగుపడాలి

**బల్లికురవ, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బాల్యం నుండి వారిలో విద్యాభివృద్ధి మెరుగుపడే విధంగా కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సీడీపీఓ సుధా అన్నారు. పోషణ్ బి పడాయి బి కార్యక్రమం రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కొప్పెరపాడు ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్నఈ కార్యక్రమంలో ఆమె పలు సూచనలు చేశారు. పిల్లల సంరక్షణ, విద్యాబోధనలో అనుసరించాల్సిన తీసుకోవాల్సిన విధి విధానాలను వివరించారు. ప్రధానంగా పిల్లల్లో ఐదు రకాల అభిరుచులను మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన అంశాలను ప్రస్తావించారు. రెండోవ రోజు గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మమత, సంతమాగులూరు వైద్యాధికారి నిర్మల్ కుమారులు పాల్గొని పిల్లలలో సూక్ష్మ లోప నివారణలు, పౌష్టికాహారం పరిసరాల పరిశుభ్రత గర్భిణీ స్త్రీలు వెయ్యి రోజుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో బల్లికురవ, కొప్పెరపాడు సెక్టార్లలోని 40 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. సూపర్‌వైజర్లు సలోమి, విజయలక్ష్మీలు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

# భరోసా కేంద్రాల్లో ప్రతిరైతు వివరాలను నమోదు చేసుకోవాలి

**కారంపూడి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** మండలంలో పొలం ఉన్న ప్రతి రైతు కూడా గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో తమ పొలం వివరాలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి యలమందారెడ్డి అన్నారు. శుక్రవారం కారంపూడి పట్టణంలో మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు నమోదు చేసుకోవడానికి



ఆధార్ కార్డు జిరాక్స్, పొలం పాస్‌బుక్, 1బి, ఆధార్ కార్డుకు లింకయిన మొబైల్ నంబరును తీసుకుని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. రైతులు నమోదు చేసుకున్న వెంటనే ఐడీ నంబర్ వస్తుంది. ఆ నంబరుతో రైతుకు పథకాలు అందుతున్నాయా లేదా తెలుస్తాయన్నారు. రైతులు నమోదు చేసుకోవడం వల్ల గవర్నమెంటు ఇచ్చే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సున్న వడ్డీ పథకాలు, పంట రుణాలు ఇతర పథకాలకు ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.

# రక్షక్ అవార్డు అందుకున్న వైఆర్ఎస్ పాఠశాల పూర్వవిద్యార్థి

**రెంటచింతల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** ఏరోస్పేస్ అప్లికేషన్స్‌లో అధిక ఉష్ణోగ్రత మిశ్రమంలో ధాతువు కనుగొన్న క్రమంలో నాటి వైఎస్ఆర్ స్కూల్ పూర్వవిద్యార్థి రిథిరామ్ కర్ణాటకలోని బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నుంచి రక్షక్ అవార్డు అందుకున్నాడు. దామరచర్ల మండలం కల్లేపల్లి గ్రామానికి చెందిన రథిరామ్ ఇక్కడి



రక్షణ ఉత్పాదక రంగంలో డిప్యూటీ మేనేజరుగా వ్యవహరిస్తున్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన మేకిన్ ఇండియా పిలుపులో భాగంగా నలుగురు సభ్యుల బృందంలో ఒకడైన రిథిరామ్ భారతదేశ రక్షణ రంగంలో కీలక పాత్ర పోషించే ఏరో స్పేస్ విభాగంలో వినియోగించే



గిరిజన బాలుర సంక్షేమ హాస్టల్లో ఉండి 2009లో స్థానిక వైఆర్ఎస్ పాఠశాలలో పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేశాడు. నూజివీడులో ట్రిపుల్ ఐటీ అనంతరం ఖరగ్‌పూర్‌లో మెటలాజికల్‌లో ఎంటెక్ చదివారు. ప్రస్తుతం హైదరాబాదులోని మిథానిలో అధిక ఉష్ణోగ్రత మిశ్రమ ధాతువు కనుకొని రక్షక్ అవార్డుకు ఎంపికయ్యాడు. వృత్తిపట్ల అంకితభావం, నైపుణ్యం ప్రదర్శించి కేంద్ర రక్షక్ అవార్డు గ్రహీత పూర్వవిద్యార్థి రథిరామ్‌ను ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపక బృందం, సిబ్బంది అభినందించారు.

# భూ రీ సర్వేలో అవకతవకలు జరిగితే చర్యలు : సబ్‌కలెక్టరు సంజనా సింహ

**కొల్లిపర,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** భూ రీ సర్వేలో అవకతవకలు జరిగితే భాద్యులపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు సబ్‌కలెక్టర్ సంజనా సింహ హెచ్చరించారు.శుక్రవారం మండల పరిధిలోని కుంచవరంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వేను ఆమె తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి రైతులతో ముఖాముఖీ మాట్లాడారు. హద్దులు గుర్తించి రాళ్ళు వేయనున్నట్లు తెలియజేసారు.భూ రీ సర్వేకు రైతులు



కూడా సహకరించాలన్నారు.కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ ఉప్పాల రాజేష్,సర్వేయర్ శ్రీనివాసరావు,విఆర్‌ఓ భాషా తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య 105వ జయంతి

**అద్దంకి , ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** రోటరీ కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 105వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య రాష్ట్రానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన పేరు మీదే మన అద్దంకిలో సంజీవ నగర్ ఏర్పాటు చేశారని అధ్యక్షులు చప్పిడి వీరయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, , ఎజి షేక్ మహమ్మద్ రఫీ, చిన్ని మురళీ కృష్ణ, జాగర్లమూడి శివ కుమారి, నర్రా శ్రీలక్ష్మి, కాకర్ల వెంకటేశ్వర్లు, అళహరి హరి ప్రసాద్, గురుశేఖర్, పసుపులేటి ఆంజనేయులు, పుట్టంరాజు తులసిదాసు, సందిరెడ్డి శ్రీనివాసరావు, తమ్మన శ్రీనివాసరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మడియాలేశ్వర స్వామి పంచమ వార్షికోత్సవానికి అన్నాను ఆహ్వానించిన ఉత్సవ కమిటీ

**మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలోని గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అన్నా రాంబాబు స్వగృహం నందు శుక్రవారం శ్రీ మడియాలేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు గిద్దలూరు రజక అభివృద్ధి సంఘం కమిటీ సభ్యులు కలిశారు. ఫిబ్రవరి 23వ తేదీన గిద్దలూరు పట్టణం కొంగలవీడు మార్గానగల శ్రీ పరివార దేవత సమేత శ్రీ మడియాలేశ్వర స్వామి పంచమ వార్షికోత్సవ మహోత్సవం ఈనెల 23వ తేదీ జరుగనున్న నేపథ్యంలో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబును ఆలయ ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు కలిసి ఉత్సవంలో పాల్గొనాలని ఆహ్వానిస్తూ శ్రీశ్రీశ్రీ మడియాలేశ్వర స్వామి వారి మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు.

# రీ సర్వేను పరిశీలించిన ఆర్డిఓ

**కొరిశపాడు , ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** మండలంలోని దైవాలరావూరు గ్రామంలో గత కొన్ని రోజులుగా రెవిన్యూ అధికారులు రి సర్వే నిర్వహిస్తున్నారు. చీరాల ఆర్డిఓ తూమాటి చంద్రశేఖర్ నాయుడు శుక్రవారం సర్వే జరుగుతున్న భూములను కొరిశపాడు తహాశీల్దార్ జివి సుబ్బారెడ్డి కలిసి సర్వే జరుగుతున్న భూములను పరిశీలించి సర్వే అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. గతంలో వలె కాకుండా రైతుల సమక్షంలో వారి భూములకు ఖచ్చితమైన కొలతలు వేసి, వారికి తెలియజేసి ఎలాంటి పొరపాట్లు జరగకుండా భూమి విస్తీర్ణ నమోదు చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో వారి వెంట రీ సర్వే డిటి రవికాంత్, మండల సర్వేయర్ మహేష్ బాబు, విఆర్‌ఒలు లక్ష్మీనరసింహా, మారుతి, నారాయణ పాల్గొన్నారు.

# పిడుగురాళ్ళ మునిసిపల్ ఉప ఎన్నికల్లో పోలీసుల పై అసత్య ప్రచారాలు : సిఐ


**పిడుగురాళ్ళ, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక విషయం పై రాజకీయ నాయకులు పోలీస్‌లపై అసత్యప్రచారాలు మానుకోవాలని సిఐ వెంకట్రావ్ అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ వైస్ ఛైర్మన్ ఎన్నిక ఫిబ్రవరి 3న ఎన్నికల అధికారి సమక్షంలో జరగాల్సిన ఎన్నికల వాయిదా పడిందన్నారు. మరల 4వ తేదీన జరగాల్సిన ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి గురజాల ఆర్డీవో తెలిపారన్నారు. కొంతమంది పని గట్టుకుని వైకాపాకు చెందిన కౌన్సిలర్‌లను పోలీస్ వారు బెదిరిస్తున్నారని,



కిడ్నాప్ చేస్తున్నారని ప్రచారం చేయటం శోచనీయమన్నారు. తమకు ఎవరు కూడా బెదిరింపులు, కిడ్నాప్‌లపై ఫిర్యాదు ఇవ్వలేదన్నారు. రాజకీయాలను పోలీస్ వారికి ఆపాదించటం తగదన్నారు. ఇలాంటి ప్రచారాలు, పోస్టులు పెట్టే వారిపై అధికారులకు తెలిపి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సి.ఐ వెంకట్రావ్‌హెచ్చరించారు.

# వైభవంగా వేణుగోపాలస్వామి కళ్యాణం

రెంటచింతల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: రెంటచింతలలోని వేణుగోపాలస్వామి ఆలయం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం శుక్రవారం ఘనంగానిర్వహించారు. ఆలయంలో ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుక్మిణీ దేవి, సత్యభామలను పెళ్లికుమార్తెలుగా చేసి, పట్టు వస్త్ర విశేష అలంకరణతో ముస్తాబైనస్వామి వారికి కల్యాణం జరిపించారు. వేద మంత్రోచ్ఛారణలతో ప్రధాన యాజ్ఞికుడు కారంపూడి కృష్ణమాచార్యుల చేతుల మీదుగా మాంగల్య ధారణ చేయించారు. వెనిగండ్ల నరసింహారావు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం దేవేరులతో కలిసి



స్వామి వారిని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పల్లెర్ల సత్యవెంకట్రామిరెడ్డి పర్యవేక్షణలో ఆలయ పూజారి గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు, ఆలయ ధర్మకర్తలు కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.

# ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు ఎన్‌సిసి యూనిట్ మంజూరు

నరసరావుపేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : అంతర్జాతీయ ఢిల్లీ స్కూల్‌కు ఎన్‌సిసి సబ్




యూనిట్‌ను మంజూరు చేశారు. పాఠశాల ఛైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్ శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. 23వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ ఎం.ఎస్.పారామర్ సుబేదార్ ముఖేష్‌కుమార్‌లు పాఠశాలలో ఎన్‌సిసి జెండాను ఆవిష్కరించారు. ఎన్‌సిసి నినాదం తెలియజేశారు. విద్యార్థులలో ఐక్యత, క్రమశిక్షణ ఎన్‌సిసి ద్వారా చిన్ననాటి నుండే పెరుగుతుందన్నారు. కుల,మత, జాతి, ప్రాంతం లేకుండా అందరూ భరతమాత ముద్దుబిడ్డలుగా క్రమశిక్షణతో ఎదగాలన్నారు. పాఠశాలలో ఉన్న సౌకర్యాలు అంతర్జాతీయ స్థాయిలో ఉన్నాయని తెలిపారు. పల్నాడు జిల్లా ప్రజలకు, విద్యార్థులకు ఇటువంటి పాఠశాల అందుబాటులో ఉండటం అదృష్టమని కమాండింగ్ ఆఫీసర్ పారామర్ అన్నారు. అనంతరం పాఠశాల ఛైర్మన్ డాక్టర్ ప్రకాష్ కార్యక్రమంలో కమాండింగ్ ఆఫీసర్ పారామర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జి.ఎం.రామరాజు, ప్రిన్సిపాల్ ఆల్పనాఓనియల్, ఎన్‌సిసి కేర్ టేకర్ భూపతి, కెప్టెన్ బిఎస్ఆర్‌కె రాజు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కూచిపూడి గ్రామ పంచాయతీ నూరు శాతం ఇంటి పన్ను వసూలు

**అమృతలూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** కూచిపూడి గ్రామ పంచాయతీ జనవరి 7వ తేది నాటికే నూరు శాతం రూ.12,34,692లు ఇంటి పన్ను మొత్తం వసూలు చేసి మండలంలో ఇంటి పన్నులు వసూలులో మొదటి స్థానంలో ఉండడం అభినందనీయమని ఎంపిడిఓ బి.మారుతీ శేషమాంబ కొనియాడారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఓ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపిడిఓ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరం ఇంటిపన్ను వసూలులో కూచిపూడి గ్రామ పంచాయతీ ముందున్నదని తెలిపారు. 2014 నుండి నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేస్తుందని, ఇంటి పన్ను నూరు శాతం వసూలు చేసేందుకు కృషి చేసిన కార్యదర్శి తిరుమలరావును ఎంపిడిఓ అభినందించారు. మండల పరిధిలోని ఇతర గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలు ఈ నెల 28వ తేది లోపు నూరు శాతం పూర్తి చేసి మండలాన్ని జిల్లాలో ప్రథమ స్థానంలో ఉంచాలని ఎంపిడిఓ మారుతీ శేషమాంబ పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు.

# గిద్దలూరు కోర్టు పరిధిని కర్నూల్ హైకోర్టులో కలపాలని న్యాయవాదుల నిరసన

**గిద్దలూరు రూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** రాష్ట్ర విభజన తరువాత మొదట కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని అనుకున్న అప్పటి ప్రభుత్వం ఆ తరువాత అమరావతి హైకోర్టు ఏర్పాటు చేయడం జరిగిందని అయితే రాయల సీమ నుండి అమరావతిలోని హైకోర్టుకు కక్షిదారులు, న్యాయవాదులు చేరుకోవాలంటే అనేక అవస్థలు పడుతున్నారని గిద్దలూరు బార్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. రాష్ట్ర ప్రజలు, న్యాయవాదులు అనేక పోరాటాల ఫలితంగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం సహకరించిందని, అయితే ఈ మధ్య కాలంలో కొందరు ప్రకాశం జిల్లాను అమరావతి హైకోర్టులో ఉంచాలని కోరుతుండటంతో పలువురు ప్రజలు ఆందోళన చెందుతున్నారని, గతంలో కూడా గిద్దలూరు కర్నూలు జిల్లాలోని ప్రాంతమని కావున ప్రస్తుతం గిద్దలూరు నియోజకవర్గంను కర్నూలు బెంచ్‌లో కలపాలని గిద్దలూరు బార్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేస్తూ శుక్రవారం వారి విధులను బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పాలుగుళ్ళ శేషశయనారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఉస్మాన్ షరీఫ్, ట్రెజరర్ ముత్తుముల రంగారెడ్డి, సీనియర్ న్యాయవాదులు వల్లెల వెంకటరామిరెడ్డి, పిడతల రాజశేఖర్ రెడ్డి, తురగా అంజనీకుమార్, మొఘల్ హజేరాంబి, కె హిమశేఖర్ రెడ్డి, కె రవిప్రకాష్ బాబు, దాసరి సంగీతరావు, కటారు పోలిరెడ్డి, తిరుమల ప్రసాద్, గిరి, పోలయ్య, సిద్దయ్య, రైడర్ బాబు, అహల్య, ఫాజిల్, అదిల్, తదితరులు పాల్గొన్నారు.

15-02Pg5exHMNWJQEC.qxd:15-02Pg5exHMNWJQEC.qxd 01/01/01 9:09 AM Page 1



## దామోదరం సంజీవయ్య జీవిత ప్రస్థానం స్ఫూర్తిదాయకం సిఎం చంద్రబాబు



సంజీవయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి14,ప్రభాతవార్త ప్రతినిధి:** నిజాయితీకి, నిరాడంబరత్వానికి, విలువలకు మారుపేరైన దామోదరం సంజీవయ్య 104వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘనంగా నివాళులు అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి సీఎం చంద్రబాబు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసిన సంజీవయ్య జీవిత ప్రస్థానం ఆద్యంతం స్ఫూర్తిదాయకం, ఆదర్శనీయమని అన్నారు. ఆ మహానుభావుని జయంతి వేడుకలను అధికారికంగా జరుపుకోవడం తెలుగు జాతికి గర్వకారణమన్నారు. ఆయన దేశసేవను, దళిత జనోద్ధరణను స్మరించు కుందామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సంజీవయ్య పాలన విధానం స్ఫూర్తిదాయక మన్నారు. ఎన్డీఏ కూటమిలో దళితులకు పూర్తి స్థాయి న్యాయం అందించడం జరుగుతుంద న్నారు. వారికి,విద్యా, వైద్యం, ఉద్యోగం, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యతను ఇస్తా మన్నారు.ప్రతి అంశంలోను వారికి ప్రాధాన్యతను అందిస్తామన్నారు.

# ఆర్థిక వృద్ధికి హస్తకళారంగమే బలమైన ఆధారం

## కేంద్ర చేనేత జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్



కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్‌కు స్వాగతం తెలుపుతున్న రాష్ట్ర చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు

**విజయవాడ,ఫిబ్రవరి14,ప్రభాతవార్త ప్రతినిధి:** భారతదేశ ఆర్థిక వృద్ధిలో హస్తకళ రంగం కీలక భూమిక పోషిస్తోందని కేంద్ర చేనేత జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన భారత్ టెక్స్ 2025లో ఆంధ్రప్రదేశ్ పావిలియన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యుత్తమమైన హస్తకళ సంప్రదాయాలకు నిలయంగా ఉందన్నారు. ఈ కేంద్రం మన కళాకారుల నైపుణ్యానికి అద్దం పడుతుందన్నారు పరిశ్రమ పునరుద్ధరణ, మార్కెట్ విస్తరణ, స్థిరమైన అభివృద్ధికి అనుగుణంగా, శిల్పకారులను మద్దతు ఇవ్వడంపై . ప్రభుత్వ దృష్టి సారించిందన్నారు. రేఖా రాణి మాట్లాడుతూ భరత్ టెక్స్ వేదిక ద్వారా ఆంధ్రప్రదేశ్ కళాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశం పొందు తారన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌కి అను సంధానం కావడంతోపాటు, శిల్పకారుల స్థిరమైన అభివృద్ధికి ఈ ప్రదర్శన దోహదపడుతుందని వివరించారు.పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, హస్తకళలు కేవలం సంప్రదాయం మాత్రమే కాదని, వేలాది కుటుంబాలకు జీవనోపాధి మార్గమని పేర్కొన్నారు. ఈ ప్రదర్శన ద్వారా కళాకారుల మార్కెట్ విస్తరించి వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. భరత్ టెక్స్ 2025లో ఆంధ్రప్రదేశ్ పావిలియన్ సందర్శకులకు అందుబాటులో ఉంటూ, నైపుణ్య కలిగిన శిల్పకారుల ప్రత్యక్ష ప్రదర్శనలు, రాష్ట్ర సంప్రదాయ వస్త్ర సంపదను పరిశీలిలన, ప్రామాణిక హస్తకళ వస్త్రాలను కొనుగోలు చేసే వీలును కల్పించనుంది. రాష్ట్రంలోని వెంకటగిరి, మంగళగిరి, ధర్మవరం, ఉప్పాడ, కలంకారి వంటి ప్రసిద్ధ హస్తకళ వస్త్ర సంపదను ఇక్కడ ప్రదర్శిస్తుండగా, దేశీయ, అంతర్జాతీయ వేదికలపై ఆంధ్రప్రదేశ్ హస్తకళ కళాకారులకు గుర్తింపు కల్పించడం, మార్కెట్ అవకాశాలను పెంచడం ఈ ప్రదర్శన ముఖ్య లక్ష్యంగా ఉంది. కార్యక్రమంలో ఎంఎస్ ఎంఇ కార్పొరేషన్ సిఇఓ, లేపాక్షి ఎండి ఎం. విశ్వ, చేనేత జౌళి శాఖ అదనపు సంచాలకులు శ్రీకాంత్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## శ్రీవారిని దర్శించుకున్న కర్ణాటక జడ్జి జస్టిస్ వెంకటేశ్‌నాయక్

**తిరుమల,ఫిబ్రవరి 14ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్‌నాయక్ కుటుంబంతో కలసి దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయం వద్దకు విచ్చేసిన ఆయనకు టిటిడి అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## అమరావతి నిర్మాణంపై దుష్ప్రచారం తగదు

### - టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి

**శాంతిపురం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** ప్రజారాజధాని అమరావతి నగర నిర్మాణంపై వైకాపా దుష్ప్రచారం తగదని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాల కల్పతరువు అమరావతి నగరం అన్నారు. రాజధానిలో అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం వేగవంతం చేస్తోందన్నారు. రైతుల మిగులు భూముల ద్వారా ప్రభుత్వానికి రెండు లక్షల కోట్లు వస్తాయన్నారు. రాజధాని నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు అవసరం ఉండదన్నారు. రాజధాని పునర్నిర్మాణ పనులకు 48012కోట్లకు అనుమతులు మంజూరైనట్లు చెప్పారు. వైకాపా పాలనలో అమరావతి విధ్వం సానికి గురైందన్నారు.

ప్రభుత్వ భవనాలు, ప్రధాన రోడ్ల నిర్మాణాలు, మౌలిక వసతులకు టెండర్లు పిలుస్తు న్నారన్నారు. పదేళ్ల తర్వాత అమరావతిలో భూముల ధరలు సైతం ఎకరా 50కోట్లకు చేరుతుందన్నారు.

## మహా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్(అలహాబాద్)లో జరుగుతున్న మహా కుంభమేళాకు దక్షిణ మధ్య రైల్వే చర్లపల్లి-దానాపూర్-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. చర్లపల్లి నుంచి దానాపూర్ వెళ్లే నెంబర్ 07121ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3.10గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి దానాపూర్‌కు మంగళవారం రాత్రి 11.55గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో దానాపూర్ నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07122 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3.15గంటలకు దానాపూర్ నుంచి బయలుదేరి గురువారం రాత్రి 11.45గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమధ్యలో కాజీపేట,పెద్దపల్లి రామగుండం, మంచిర్యాల,బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్,బల్హార్షా,చంద్రాపూర్, సేవగ్రామ్,ఇటార్సీ, పిపారియా, జాబల్‌పూర్, కత్ని, సత్నా,మాణిక్ పూర్, ప్రయాగరాజ్(అలహాబాద్), మిర్జాపూర్, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ(మొగల్ సరాయ్),బక్సర్,అరా స్టేషన్లలో నిలుస్తాయి.



తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, చిరంజీవి, బాలకృష్ణలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

# తెలంగాణ సిఎంకు శ్రీకాళహస్తి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

### పలువురు సినీనటులను స్వాగతించిన ఎమ్మెల్యే

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అతిథుల స్వాగతాలను ఈ ఏడాది శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.వారం రోజులుగా ఆయన అతిథుల ఆహ్వానాల్లో తలమునకలై ఉన్నారు. రెండు రోజుల పాటు విజయవాడలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుతో పాటు పరిపాలనలోని మంత్రులను ఆహ్వానించిన ఆయన నాలుగురోజుల పాటు ఢిల్లిలో తిష్టవేసి కేంద్రమంత్రులు, ఎంపిలను ఆహ్వానించారు.శుక్రవారం ఆయన తెలంగాణా సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి కలంకారి కండువాతో సత్కరించి శివయ్య ఉత్సవాలకు సంబందించి ఆహ్వానపత్రికను అందించారు. అలాగే హైదరాబాదులోని సినీ నటులను ఆహ్వానించారు.ఈ నేపథ్యంలో జనంలో మంచి ఫాలోయింగ్ ఉన్న నందమూరి బాలకృష్ణ, చిరంజీవి, నితిన్‌లను ఆహ్వానించారు. బాలకృష్ణకు శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి అవగాహన ఉండటంతో చిరంజీవికి శ్రీకాళహస్తి దివ్యక్షేత్రం ప్రాశస్త్యం గురించి వివరించారు.ఆలయం ప్రాధాన్యత గురించి వివరించారు. అతిథిగా రావాలని ఆహ్వానించారు. సుధీర్‌రెడ్డి వెళ్ళిన చోట ఆయనకు మంచి ఆదరణ లభిస్తుంది. ఇంకా ప్రభాస్‌ను ఆహ్వానించనున్నారు.ఎలాగైనా ఈ శివరాత్రి బ్రహ్మోత్సవాలను నభూతో అన్నట్లు నిర్వహించుటకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి కంకణ బద్దులై పరుగులు తీస్తున్నారు.అంతేకాక ఆలయం అభివృద్దిలో మార్పు, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మార్పులకు శ్రీకారం చుట్టారు. లైటింగ్ పూల అలంకరణలో ప్రత్యేకతను చాటుకోవాలని పరుగులు తీస్తున్నారు.

## బెజవాడలో డిజిటల్ ఎవిడెన్స్‌పై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్

### - హాజరుకానున్న హోం మంత్రి వంగలపూడి అనిత

**విజయవాడ క్రైం,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త** నేటి ఉదయం 9.30 నుండి సాయంత్రం 6 గంటల వరకు లబ్బీపేట, వైవి రావు ఆస్పత్రి రోడ్ లోని ఎస్ఎస్ కన్వెన్షన్ పక్కన ఉన్న జిఆర్‌టి హోటల్స్ లో డిజిటల్ ఎవిడెన్స్ ప్రాముఖ్యత గురించి రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ నిర్వ హిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ వర్క్ షాపుకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిం చనున్నారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబు గౌరవ అతిథిగా హాజ రవుతారని, సాయంత్రం ఈగిల్ డైరెక్టర్, ఇనస్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆకే రవికృష్ణ కూడ ముగింపు వర్కు షాప్‌కి ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ వర్క్ షాపుకు రాష్ట్రం నలుమూలల నుండి 150 మంది ప్రాసిక్యూటర్స్ హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు.

# రంజాన్ మాసం వస్తోంది: ఉపవాసదీక్షలకు సిద్ధం కండి

### హాఫీజే ఖుర్ ఆన్ మౌలానా రేహాన్ సాహెబ్ పిలుపు



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** ముస్లింలు ప్రపంచ వ్యాప్తంగా పవిత్రంగాను,భక్తి భావానికి నిదర్శనంగా భావించే రంజాన్ మాసం వస్తుందని ఉపవాసదీక్షలకు సిద్ధం కావాలని హాఫీజే ఖుర్ ఆన్ మౌలానా రేహాన్ సాహెబ్ పిలుపు నిచ్చారు. షబ్బెబరాత్ సందర్భంగా గురువారం రాత్రి శ్రీకాళహస్తిలోని 14 మసీదుల్లో భక్తి శ్రద్దలతో నమాజులను ఆచరించారు. మసీదులు భక్తులతో కిట కిట లాడాయి. జామియామస్‌జిద్‌లో మౌలానా రేహాన్,నూర్ఏ మస్‌జిద్‌లో హాఫీజే ఖుర్ ఆన్ మౌలాన మహమ్మద్ ఆలి సాహెబ్‌లు షబ్బె బరాత్ సందర్భంగా ప్రార్థన్యతను వివరిస్తూ ఈ రాత్రి అల్లాహ్ ఆ ఏడాదిలో ప్రతి ఒక్కరికి ఏడాదిలో ఇచ్చే వరాలను నిర్ధారిస్తారన్నారు. వ్యాపారాల్లో లాభాలు,కుటుంబానికి సంబం ధించిన అంశాలు,ఆయుషుకు సంబంధించి అల్లాహ్ దైవ దూతలకు సూచిస్తారని వివ రించారు. అంతేకాక ఈ రాత్రి ఎంతో మహోన్నతమైనదన్నారు, భక్తి శ్రద్దలతో అల్లాహ్ వద్ద కన్నీరుమున్నిరుగా తాము తెలిసి తెలియక చేసిన తప్పులను మరో సారి చేయనంటూ వేడుకుంటే క్షమించే రాత్రిగా వివరించారు. అయి తే ఈ రాత్రి కూడా ఇద్దరి ప్రార్ధనలను అల్లాహ్ ఆమోదించరని వివరిస్తూ విగ్రహారాధన, ఇతరులకు సంబందించి చెడుగా ఆలోచించే వారి ప్రార్థనలను ఆమోదించరని వివరించారు. కాబట్టి నిత్యం దేవుడు ఒక్కడే అని ఆతనే సర్వం నడుపుతున్న శక్తి అని ఆతనితో సమానంగా మరొకరు లేదని ఆరాధనకు ఆతనొక్కడే అర్హుడని నమ్మాలన్నారు. అంతేకాక పరనిందతో దూరంగా ఉండాలన్నారు. ఈ రాత్రి వరాల జల్లు, పాపవిమోచనానికి సంబంధించి ప్రార్థించే సుదినంగా వివరించారు. శుక్రవారం మధ్యా హ్నం ప్రార్థనలకు మసీదులు కిట కిట లాడాయి. ఈ సందర్భంగా హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ జామియా మస్‌జిద్‌లో ప్రార్థిస్తూ మనిషి తన జీవిత రహస్యాన్ని తెలుసుకోలేక తల్లడిల్లుతున్నా దన్నారు. ఈ ప్రపంచం మనిషికి ' ఓ మజిలి' అని మరచిపోరాదన్నారు.మానవుని జీవితం, శరీరం ఆశాశ్వతమైనదనే వాస్తవాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలన్నారు. మనకు మరణం తథ్యమని మరణం తరువాతిదే శాశ్వత జీవితం అని ఆ జీవితం స్వర్గధామం కావాలని అల్లాహ్‌ను ప్రార్థించాలని సూచించారు.షాబాన్ తరువాత వచ్చే రంజాన్ మాసం క్రమశిక్షణకు నిదర్శనం అన్నారు. నమాజు,ఉపవాసదీక్షలు త్రికరణశుద్దిగా ఆచరించాలన్నారు.ఎవరైతే అల్లాహ్ గురించి భయపడతారో వారు మంచివైపే పయనిస్తారన్నారు. మంచిపనులే చేస్తారన్నారు. రోజంతా ఉపవాస దీక్షతో పాటు ఐదుపూటల నమాజును ఆచరిస్తారన్నారు. ఇలాంటి మాసం మరోకటి లేదన్నారు.

### రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాలకు

## రూ.2906 కోట్ల వ్యయంతో ఎడిసిఎల్ టెండర్లు

**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నా టెండర్ పిల్చేందుకు ఎన్నికల కమిషన్ అనుమతి ఇవ్వడంతో తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా శుక్రవారం 2906.06 కోట్లరూపాయల వ్యయంతో టెండర్లు పిలిచింది. ఈ మేరకు అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ టెండర్ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం 202526 ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో కూడా రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు కేటాయించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దూకుడు పెంచింది. రాజధాని నిర్మాణంలో భాగంగా మిగిలిన పనులకు టెండర్లు పిల్చే ప్రక్రియను తాజాగా మరల ప్రారంభించింది. ఇప్పటికే 38 వేల కోట్ల పైబడి నిధులతో టెండర్లు పిలిచారు. రాజధానిలో ఇప్పటికే పిలిచిన వివిధ పనులకు సంబంధించిన టెండర్ల గడువు కూడా దాదాపు పూర్తికా వచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనుల్లో భాగంగా మిగిలిన వాటికి కూడా టెండర్ల ప్రక్రియను చేపట్టింది. తాజాగా పిలిచిన పనుల్లో ఈ2 రోడ్డుకు 151.27 కోట్లు, ఈ4 రోడ్డుకు 496.18 కోట్లు, ఈ7 రోడ్డుకు 354.84 కోట్లు, ఈ 11 రోడ్డుకు 15.38 కోట్లు, ఈ 13 రోడ్డుకు 199.29 కోట్లు, ఈ 15 రోడ్డుకు 186.18 కోట్లు, ఎన్ 8 రోడ్డుకు 581.55 కోట్లు, ఎన్ 13 రోడ్డుకు 245.50 కోట్లు కేటాయించి టెండర్లు పిలిచారు. దాదాపు ఈ టెండర్ పనుల్లో ఉన్నవన్నీ రోడ్లు, డ్రైనేజీ, వాటర్ పైప్ లైన్ ,సైకిల్ ట్రాక్, అవెన్యూ ప్లాంటేషన్ తదితర మౌలిక సదుపాయాలు ఉన్నాయి. 2906 కోట్ల అంచనా వ్యయంతో పిలిచిన ఈ టెండర్ పనులు టెండర్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది.టెండర్ లో పాల్గొనేందుకు మార్చి 3 చివరి గడువు. ఇదే రోజున టెక్నికల్ బిడ్లు కూడా ఓపెన్ చేసి టెండర్లను ఖరారు చేస్తారు.

## ఇకపై పర్యాటక శాఖ ద్వారా తిరుమల శ్రీ వారి దర్శన భాగ్యం..

### టూరిజం ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ వినతికి స్పందించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి14,ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి దర్శన సౌకర్యాలను గతంలో మాదిరిగా పర్యాటక శాఖ పరిధిలో పునరుద్ధరించేందుకు ఆ శాఖ నిర్ణయించింది,ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో జరిగిన పర్యాటక శాఖ సమీక్షా సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారి దర్శన సౌకర్యాల విషయమై ముఖ్యమైన చర్చ జరిగింది గత కాలంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శన ప్యాకేజీలను అందించడం జరిగేది. అయితే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు మరియు అవకతవకల కారణంగా ఈ సదుపాయాన్ని రద్దు చేయవలసి వచ్చింది. దీని వలన పర్యాటక శాఖకు గణనీయమైన ఆదాయ నష్టం వాటిల్లింది. ఈ పరిస్థితిని సమీక్షించిన ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ , ఈ అంశాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యమంత్రి ఈ విషయంపై సానుకూలంగా స్పందించి, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)తో సమన్వయం చేసుకొని దర్శన ప్యాకేజీలను పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయంతో భక్తులకు మరింత సులభంగా శ్రీవారి దర్శనం లభించడమే కాకుండా, పర్యాటక శాఖకు కూడా అదనపు ఆదాయం లభించనుంది. దీనివల్ల రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి ఊతం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా: ప్రత్యేక దర్శన ప్యాకేజీల ప్రణాళిక రూపకల్పన భక్తుల సౌకర్యార్థం అదనపు సేవల కల్పన పారదర్శక నిర్వహణ విధానాల అమలు ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ ఏర్పాటు.

# విజయవాడలో నాబార్డ్ గ్రామీణ భారత మహోత్సవం ఆంధ్రప్రదేశ్ 2025 ఘనంగా ప్రారంభం



విజయవాడలో నాబార్డ్ గ్రామీణ భారత మహోత్సవం ప్రారంభిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధిం** నైపుణ్యం కలిగిన కళాకారులకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు జీవనోపాధి అవకాశాలను కల్పించడమే ఆశయంగా గ్రామీణ్ భారత్ మహోత్సవ్ - ఆంధ్రప్రదేశ్ 2025" ను ఏర్పాటు చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. విజయవాడ లోని మేరీస్ స్టెల్లా ఇండోర్ స్టేడియం లో ఏర్పాటు చేసిన "గ్రామీణ్ భారత్ మహోత్సవ్ - ఆంధ్రప్రదేశ్ 2025" ను జిల్లా కలెక్టర్ లక్ష్మీశ జ్యోతి ప్రజ్వలనతో శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాబార్డ్, ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం విజయవాడ వారు ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్లే ఈ ఏడాది కూడా గ్రామీణ్ భారత్ మహోత్సవ్ - ఆంధ్రప్రదేశ్ 2025" లో భాగంగా రాష్ట్ర స్థాయి చేనేత మరియు హస్త కళల ప్రదర్శనను ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందన్నారు. కళాకారుల జీవితాలను మెరుగుపరచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కృషి చేస్తున్నాయన్నారు. సాంప్రదాయ చేనేత, హస్తకళలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఆఫ్‌ఫార్మ్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ ఉత్పత్తులను ప్రోత్సహించడానికి, నాబార్డ్ మార్కెటింగ్ చేసేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటుందన్నారు. నాబార్డు గ్రామీణాభివృద్ధిలో పోషిస్తున్న కీలక పాత్రను ప్రశంసిస్తూ, రైతులు, స్వయం సహాయక బృందాలు, మరియు సూక్ష్మవ్యా పారులు తమ ఉత్పత్తులను విస్తృత మార్కెట్లకు తీసుకెళ్లేందుకు ఇలాంటి ప్రదర్శనలను వినియోగించుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 14 నుండి 23 వరకు జరగనున్న ఈ ప్రదర్శనలో, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన గ్రామీణ కళాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించే అరుదైన అవకాశం పొందు తారన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సాంప్రదాయ హస్తకళల్లో మంగళగిరి పట్టు, ఉప్పాడ, పొందూరు ఖద్దరు, తెలంగాణ ప్రత్యేకతలైన నారాయణపేట సిల్క్ కాటన్ చీరలు, అలాగే శ్రీకాకుళంలోని సిక్కోలు కాటన్ చీరలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. తిరుపతికి చెందిన బాలాజీ హస్త కళలు, ధర్మవరం పట్టు చీరలు, శ్రీ బాలాజీ కాటన్ సిల్క్, కొండపల్లి, ఏటికొప్పాక వంటి సంప్రదాయ కళాఖండాలతో పాటు, తమిళనాడు నుండి ప్రత్యేకంగా వచ్చిన నవసారిగై వీసీశివీ పట్టు చీరలు కూడా ఈ ప్రదర్శనలో ప్రాముఖ్యత సంతరించుకున్నాయన్నారు.నాబార్డు సీజీఎం ఎం. ఆర్. గోపాల్ (ఏపీ) మాట్లాడుతూ గ్రామీణ భారతదేశ అభివృద్ధి కోసం నాబార్డు చేస్తున్న సమగ్ర కృషిని వివరించారు. గ్రామీణ రైతులు, మత్స్యకారులు, చేనేత కళాకారులు, మరియు చిరు వ్యాపారస్తుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచేందుకు సహకారం అందిస్తూ, కొత్త ఆర్థిక నమూనాలను, సహకార సంస్థల బలోపేతాన్ని, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధిని నాబార్డు ముందుకు తీసుకెళ్తోందన్నారు.

నాబార్డు (ఏపీ) జనరల్ మేనేజర్, డా. కె.వి.ఎస్. ప్రసాద్ హాజరైన అతిథులకు మరియు కళాకారులకు స్వాగతం పలుకుతూ.. ఈ మహోత్సవం గ్రామీణ కళాకారులకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించే వేదికగా నిలుస్తుందన్నారు.

## బకాయిల విడుదలకు ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్: మంత్రి సవిత

**సచివాలయం,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** పెండింగ్ ట్యూటర్స్ హానరోరియంకు సంబంధించి 485హాస్టళ్ళలో 2024మార్చి వరకు గత ప్రభుత్వం పెట్టిన రూ.2.02కోట్ల బకాయిలు, విడుదల చేసినందుకు బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.ఈ ఏడాది ఫిబ్రవరి వరకు చెల్లించాల్సి ఉన్న రూ.2.33కోట్ల బకాయిలు మొత్తం కలిపి రూ.4.35కోట్లు చెల్లించాలి ్స ఉందని అధికారులుసీఎం దృష్టికి తీసుకురాగా,వెంటనే చెల్లించేందుకు అనుమతి ఇచ్చారు.డైట్ చార్జెస్‌కు సంబంధించి రూ.185.27కోటు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు వివరించగా ప్రస్తుతం రూ.110.52కోట్ల చెల్లింపుకు సీఎం అంగీకారం తెలిపారు.అదే విధంగా కాస్మోటిక్ బిల్లులు రూ.29కోట్లు చెల్లించాలని ఆదేశించారు.హాస్టళ్ళ విద్యుత్ సరఫరాకు సంబంధించిన పెండింగ్ బిల్లులు కూడా వెంటనే చెల్లించాలని సూచిం చారు. సత్యసాయి జిల్లాలోని నసనకోట, ఆత్మకూరు బిసి సంక్షేమ బాలికల పాఠశాలలను రెసిడెన్షియల్ బిసి గర్ల్ ్స కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు సీఎం సుముఖత వ్యక్తంచేశారు. కుప్పంలోనూ బిసి బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఈ విషయంపై రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం నాయకులు కేశాని శంకరరావు బిసి ఉద్యోగ సంఘం నాయకులు దాసరి దయానందరాజు బిసి సంక్షేమ శాఖమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డైనమిక్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్

**విజయవాడ, ఫిబ్రవరి14,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డైనమిక్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ప్రవేశపెడుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ కోసం ముందస్తుగా అప్పాయింట్‌మెంట్ తీసుకునేలా డైనమిక్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆన్‌లైన్ డేటా ఎంట్రీ సిస్టమ్ ద్వారా ప్రజలు వివరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. ఆన్ లైన్ డైనమిక్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా డిజిటల్‌గా రిజిస్ట్రేషన్ కోసం టోకెన్ తీసుకునే అవకాశం ఉంది. తద్వారా డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌లు, లేదా వివాహ రిజిస్ట్రేషన్ లాంటి వివిధ సేవలను ఎంపిక చేసుకునే వీలు ఉంటుంది. ఈ వ్యవస్థ ద్వారా టోకెన్ తీసుకోగానే సబ్ రిజిస్ట్రార్‌కు ప్రత్యేక క్యూ ఆర్ కోడ్ జనరేట్ అవుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. స్లాట్ బుకింగ్ సేవలను ఉచితంగానే అందించనున్నట్టు తెలిపింది. డైనమిక్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా నమోదు అయిన స్లాట్‌ను రద్దు చేసుకుంటే రూ.100, సమయం మార్పు చేస్తే రూ.200 చెల్లించాలని స్పష్టం చేసింది. ఈ వ్యవస్థ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకున్న ముందు రోజే ఆన్‌లైన్ ద్వారా డాక్యుమెంట్‌లను అప్లోడ్ చేయడంతో పాటు రిజిస్ట్రేషన్‌కు సంబధించిన ఫీజులు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాల్లో పేర్కొంది. ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ప్రాతిపదికన ఈ సిస్టమ్ ద్వారా అప్లోడ్ చేసిన డాక్యుమెంట్లను పరిశీలించి ఆమోదం తెలియజేయాలన్నారు.

## విజయవాడలో సర్క్యూట్ బెంచ్ ఏర్పాటు

**విజయవాడ,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో సర్క్యూట్ బెంచ్ ఏర్పాటు చేయాలని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (సీఏటీ) నిర్ణయించింది. ఈ మేరకు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ చైర్మన్ శుక్రవారం ప్రకటించారు. హైదరాబాద్ బెంచ్‌కు చెందిన సర్క్యూట్ బెంచ్‌ను విజయవాడలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఫిబ్రవరి 17వ తేదీ ఉదయం 11.00 గంటలకు వర్చువల్ విధానంలో ఈ సర్క్యూట్ బెంచ్‌ను ప్రారంభించాలని ముహూర్తం ఖరారు చేసినట్లు తెలిపారు. అయితే ఇప్పటి వరకు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ కోసం హైదరాబాద్ కేంద్రంగా అఖిల భారత సర్వీసు అధికారులు తరచు వెళ్లేవారు.

ఇక విజయవాడలో సర్క్యూట్ బెంచ్ ఏర్పాటు కావడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతోన్నాయి. అఖిల భారత స్థాయి అధికారులు..

ప్రభుత్వ బదిలీలు తదితర అంశాలపై సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తారు.

# స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై క్లారిటీ ఇచ్చిన కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ

**ఒంగోలు, ప్రభాతవార్త** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేసే ఆలోచన కేంద్రానికి లేదని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ స్పష్టం చేశారు. శుక్రవారం ప్రకాశం జిల్లాలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ కొన్ని కారణాల వల్ల నష్టాల్లో ఉందన్నారు. దేశంలో అత్యున్నతమైనది విశాఖ స్టీల్‌ప్లాంట్ అని ఆయన అభివర్ణించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని విశాఖ స్టీల్ ప్లాంట్‌కి రూ.11,400 కోట్లు ఆర్థిక ప్యాకేజీని కేంద్రం కేటాయించిందని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కృషితోనే విశాఖ స్టీల్ ప్లాంట్‌కి ప్రత్యేక ప్యాకేజీ వచ్చిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. స్టీల్ ప్లాంట్‌ని నష్టాల్లో నుంచి లాభాల్లోకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ వివరించారు. మరో వైపు కేంద్ర ఉక్కు శాఖమంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఇటీవల విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో పర్యటించారు. ఆ క్రమంలో సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సంస్థ ప్రైవేటీకరణ జరగదని ఆయన ఈ సందర్భంగా సిబ్బందికిభరోసా ఇచ్చారు. కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి విశాఖపట్నం పర్యటనలో ఆయన వెంట శ్రీనివాస వర్మ ఉన్నారు. అలాగే ఈ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం భారీగా నిధులు సైతం కేటాయిస్తుందన్న సంగతి తెలిసిందే. 2019లో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు అడుగులు పడ్డాయి. ఆ సమయంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం.. ఈ సంస్థ ప్రైవేటీకరణను అడ్డుకోలేకపోయింది. అంతే కాకుండా కేంద్రంతో ఈ అంశంపై వైసీపీ ఎంపీలు సైతం కనీసం ఎప్పుడు చర్చించలేదు. ఇటువంటి పరిస్థితుల్లో స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు ఆందోళనలకు దిగారు. వారికి అండగా నిలబడేందుకు నాటి అధికార ప్రజా ప్రతినిధులు సైతం చొరువ చూపలేదు. అయితే ఒకటి రెండు సార్లు మాత్రం విశాఖపట్నం వేదికగా.. నిరసనలు తెలిపేందుకు గత అధికార పార్టీల నేతలు దీక్షకు దిగి మమ అనిపించారు.

అయితే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఏపీ ఓటరు కూటమికి పట్టం కట్టాడు. దీంతో చంద్రబాబు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అదికాక కూటమిలో బీజేపీ సైతం భాగస్వామ్యం కావడంతో.. ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రం ప్రత్యేక దృటస్టి సారించింది.

అందులో భాగంగా రాజధాని అమరావతి నిర్మాణం, రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి భారీగా కేటాయింపులు జరుపుతోంది. ఆ క్రమంలో

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేసేందుకు కేంద్రం తనదైన శైలిలో ముందుకు వెళ్తోంది.

## అమరావతి బ్రాండ్ అంబాసిడర్ల నియామకానికి నిబంధనలు

**విజయవాడ,ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని విస్తృతంగా అభివృద్ధిచేయడానికి ,ప్రచారానికి అవసరమైన బ్రాండ్ అంబాసిడర్లను వివిధ దశల్లో నియమించాలని నిర్ణయించినట్లు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ఎస్.సురేష్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం అమరావతి రాజధానికి బ్రాండ్ అంబాసిడర్లను ఎంగేజ్ చేసుకొనేందుకు సంబంధించిన నియమ నిబంధనలను ఆయన అమరావతిలో విడుదల చేశారు. అందుకు సంబంధించిన జీవో 107ను జారీ చేశారు.అనంతరం ఏపి మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ మాట్లాడుతూ.. ఏపీ సీఆర్డీయే ఇచ్చిన ప్రపోజల్స్‌ను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. బ్రాండ్ అంబాసిడర్ల నియామకానికి ప్రపంచంలో అత్యధిక ఫోకస్ కలిగి ఉండడంతో పాటు అభివృద్ధి, కొత్తదనం తదితర అంశాలను ప్రాతిపదికగా తీసుకొని వెల్లడిస్తామన్నారు. బ్రాండ్ అంబాసిడర్లు.. గొప్ప కమిట్‌మెంట్‌తోపాటు రాజధాని ప్రాంతంలో స్థానికులతో కలిసి పని చేయాలని చెప్పారు. ఇక అమరావతి బ్రాండ్ అంబాసిడర్లుగా నామినేషన్లను సిఎం చంద్రబాబు నాయుడు, సిఎం కార్యాలయం ద్వారా ఎంపిక జరుగుతోందని వివరించారు. అయితే అమరావతికి అంబాసిడర్‌గా ఎంపికైన వారికి ఏడాది పాటు టర్మ్‌గా నిర్ణయించినట్లు వెల్లడించారు. అంతేకాకుండా.. ఏపీసీఆర్డీఏ, అమరావతిల ఇమేజ్‌ను పెంచేలా బ్రాండ్ అంబాసిడర్ల పాత్ర ఉండాలని అభిప్రాయపడ్డారు.

## కాలినడకమార్గంలో మళ్లీ చిరుత!

### - మొన్న ఘాట్ రోడ్లో ఏనుగులు - భయంతో వణుకుతున్న భక్తులు



**తిరుమల,ఫిబ్రవరి 14ప్రభాతవార్తప్రతినిధి:**శేషాచలం అటవీప్రాంతంలో చిరుతల సంచారం మళ్ళీ మొదలైంది. ఎప్పుడో వస్తాయి పోతాయి అనుకుంటే అంతా పొరబడినట్లే. గత దశాబ్ధకాలంగా తిరుమల కాలినడక మార్గాల్లో, ఘాట్‌రోడ్లలో తరచూ చిరుతలు సంచరిస్తూ భక్తులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గత మూడునెలల క్రిందట చిరుతల సంచారంతోఏకంగా రాత్రి 9గంటల తరువాత ఉదయం 6గంటల వరకు ఘాట్‌లో ద్విచక్రవాహనాల ప్రయాణాన్ని నిషేధించిన టిటిడి తాజాగా కాలినడకమార్గంలో గురువారం రాత్రి 7వమలుపు వద్ద చిరుతపులి సంచరించడంతో భక్తులు వణికిపోయారు. చిరుత ఆనవాళ్ళను గుర్తించే పనిలో అటవీశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. కాగా గతంలో కాలినడక మార్గంలో ఏకంగా ఓ చిన్నారిని రెండేళ్ళక్రిందట హతమార్చడం, మరో బాలుడు తీవ్రంగా గాయపడి మృత్యుంజయుడవడం తెలిసిందే. అటవీప్రాంతాన్ని ఆనుకునే ఉన్న చోట చిరుతపులి సంచారం ఉన్నట్లు తెలుస్తోంది. తిరుమల శేషాచలంఅటవీప్రాంతాన్ని ఆనుకునే అలిపిరి, శ్రీవారిమెట్టు నడకమార్గాలు ఉన్నాయి. ఒక మొదటి,రెండవ ఘాట్‌రోడ్లు చాలావరకు అటవీప్రాంతంలోనే ముడిపడిఉన్నాయి. ఈ నేపధ్యంలో తరచూ ఘాట్‌రోడ్లపై వెళ్ళే ద్విచక్రవాహనదారులను వెంబడించి దాడిచేసి గాయపరిచిన ఘటనలు ఉన్నాయి. నాలుగేళ్ళక్రిందట రెండోఘాట్‌లో చివరిమలుపు వద్ద తిరుమలకు చెందిన ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు ద్విచక్రవాహనంలో వెళుతుండగా వెంబడించి దాడిచేసిన ఘటన గుర్తుఉంది. అలాగే శ్రీవారిమెట్టుమార్గంలో ఏకంగా బాలుడిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. మొదటిఘాట్‌లో మోకాళ్ళపర్వతం సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సమీపంలో నడకదారిలో వస్తున్న భక్తులపై గత ఏడాది దాడికి ప్రయత్నించి వాహనాల రాకతో పరుగులుతీసింది. తిరుమలకు వచ్చే భక్తులకు చిరుతల భయం పట్టుకుంది. శేషాచలం అటవీప్రాంతంలో గత ఏడాది వరకు దాదాపు 300వరకు చిరుతపులులు ఉన్నట్లు వాటి పాదాల అడుగుల ద్వారా అటవీశాఖ గణనచేసింది. ఏడాదికేడాది చిరుతల సంఖ్య పెరుగుతోంది. ఆహారం కోసం అడవిలో దారితప్పి నడకమార్గాల్లో, ఘాట్‌రోడ్లపై వస్తుంటాయని, ఆ సమయంలో మనుషులు గుంపుగా ఉంటే ప్రమాదం లేదని, అక్కడక్కడా ఇద్దరు ముగ్గురు వస్తుంటే దాడిచేస్తున్నాయనేది టిటిడి అధికారుల, అటవీశాఖ వర్గాల వాదన. నడకమార్గాల్లో చిరుతపులులు, ఏనుగుల సంచారం తీవ్రంగా ఉంది. అటవీప్రాంతాన్ని ఆనుకుని వున్న నడకమార్గాల్లో రక్షణగోడలచుట్టూ ఇనుపకంచె ఏర్పాటుచేస్తే ఇలాంటి ప్రమాదం ఉండదు. అయితే టిటిడి అధికారులు ఆ దిశగా దృష్టిసారించలేదనేది అర్థమవుతుంది. ఇంకా మొదటిఘాట్‌లో అధికభాగం అటవీప్రాంతానికి, నడకమార్గానికి ఆనుకునే ఉన్నాయి.

## పోలవరం, అమరావతికి భారీగా నిధులు

### బడ్జెట్‌లో కేటాయింపు: ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

**విజయవాడ,ఫిబ్రవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని అన్ని ప్రాధాన్యతరంగాలకు, సంక్షేమాభివృద్ధికి,ఆర్థికార్జనకు ప్రాముఖ్యతను ఇస్తూ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని ఏపీ ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేసారు.కూటమి ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలిసారి ప్రవేశ పెట్టనున్న పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్ కసరత్తు తుదిదశకు చేరుకుంది. బడ్జెట్ కేటాయింపులపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాఖల వారీ సమీక్షలు నిర్వహించారు.శుక్రవారం పరిశ్రమలు, హోం, పౌరసరఫరాల శాఖల మంత్రులతో పయ్యావుల సమావేశం అయ్యారు.ఇప్పటికే సీఎం చంద్ర బాబుతో పయ్యావుల కేశవ్ సమావేశమయి,బడ్జెట్ రూపకల్పనపై కీలకంగా చర్చించారు.ఈ క్రమంలో తమ తమ శాఖల కేటాయింపులపై టీజీ భరత్, అనిత, నాదెండ్ల మనోహర్ లు ఆర్థిక మంత్రికి ప్రతిపాదనలు అందజేసారు.. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూనే మేనిఫెస్టోలో అమలు చేయాల్సిన అంశాలు, ఇతర ప్రభుత్వ ప్రాధాన్యతలతో బడ్జెట్ రూపకల్పన పూర్తికావొచ్చింది. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లుగా బడ్జెట్ రూపకల్పన సాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 28వ తేదీన ఉభయసభల్లో ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్‌కు సంబంధించి ఇప్పటి వరకూ 28 శాఖల సమీక్షలను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పూర్తి చేశారు. బడ్జెట్ రూపకల్పనపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ముమ్మర కసరత్తు కొనసాగిస్తున్నారు. వివిధ శాఖల మంత్రులు, కార్యదర్శులతో ప్రీబడ్జెటరీ సమావేశాలు నిర్విరామంగా చేపట్టారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వివిధ శాఖల మంత్రులు, కార్యదర్శులతో సాగిన వరుస భేటీల్లో తమతమ శాఖలకు కావాల్సిన బడ్జెట్ ప్రతిపాదనలను ఆయా శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు ఆర్థిక మంత్రికి సమర్పించారు. ఆయా శాఖలు ఇచ్చిన ముఖ్యమైన బడ్జెట్ ప్రతిపాదనలను పరిగణ నలోకి తీసుకోవాలని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు పయ్యావుల సూచించారు. విద్యా, వైద్యారోగ్య శాఖల్లో కేంద్రం నుంచి నిధుల లభ్యత ఎక్కువగా ఉండే అవకాశం ఉందనే అంశాన్ని ఆర్థిక శాఖ పరిశీలిస్తోంది. కేంద్ర పథకాలను సద్వినియోగం చేసు కునేలా బడ్జెట్ కసరత్తులు చేప˘డుతున్నారు. ఖర్చు పెట్టిన కేంద్ర నిధులకు యూసీల జారీ ప్రక్రియను త్వరితగతిన చేపట్టా లని మంత్రి పయ్యావుల అధికారులకు సూచిం చారు. కేంద్రం నుంచి నిధులను రాబట్టుకునేలా కేంద్ర బడ్జెట్‌ను అధ్యయనం చేయాలని నిర్ణయించారు. ఆర్థిక శాఖ ముందు మంత్రి నారాయణ ప్రతిపాదనలు: ఇప్పటికే దేవాదాయ, క్రీడలు, వ్యవసాయ, పంచాయతీ రాజ్, కాలుష్య నియంత్రణ, సెర్ప్, ఎంఎస్ఎమ్ఈ, మున్సిపల్, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, గృహ నిర్మాణం, ఐ అండ్ పీఆర్, ఇంధన శాఖలతో పయ్యావుల వరుస సమీక్షలు నిర్వహించారు. మున్సిపల్ శాఖలోని అన్ని విభాగాలకు సంబంధించి మంత్రి నారాయణ ఆర్థిక శాఖ ముందు ప్రతిపాదనలు ఉంచారు. అమరావతితో పాటు పట్టణాల అభివృద్ధికి సంబంధించిన కీలక శాఖ కావడంతో కేటాయింపుల విషయంలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అత్యంత కీలకమైన విద్యుత్ శాఖకు కేటాయింపుల పరంగా అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి గొట్టిపాటి రవి పయ్యావులను కోరారు. విద్యుత్ శాఖ అనుబంధ విభాగాలకు సంబంధించిన కేటాయింపుల ప్రతిపాదనలను ఈ సందర్భంగా ఆర్థిక శాఖ అధికారులకు అందజేశారు. మేనిఫెస్టో హామీలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాల ప్రకారం కేటాయింపులు జరగాలని మంత్రి గొట్టిపాటి కోరారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన రీసర్వే ఇతర ప్రాజెక్టుల కోసం కేటాయింపులు చేయాల్సిందిగా రెవెన్యూ శాఖ కోరింది. మంత్రుల ప్రతిపాదనలన్నింటిని పరిగణనలోకి తీసుకుంటామని ఆర్థిక మంత్రి పయ్యావుల స్పష్టం చేసారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణాలకు సంబంధించి బడ్జెట్‌లో నిధులు ఉంటాయని తెలిపారు.



బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయింపుపై అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

## తులసిబాబుకు హైకోర్టులో ఎదురుదెబ్బ - రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు!

**విజయవాడ.ఫిబ్రవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** నర్సాపురం మాజీ ఎంపిగా ఉన్న సమయంలో ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగం కేసులో కామేపల్లి తులసిబాబుకు ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తులిసిబాబు బెయిల్ పిటిషన్‌ను ధర్మాసనం డిస్మిస్ చేసింది. ఈ కేసులో కీలక నిందితులు అరెస్ట్ కావాల్సి ఉండటంతో బెయిల్ ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ఈ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ ఇరవై రోజుల క్రితం తులసిబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జిల్లా కోర్టులో కాకుండా హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు తులసిబాబు. ఈ పిటిషన్‌పై హైకోర్టులో విచారణకు రాగా.. ఈ కేసులో కీలక నిందితులను అరెస్ట్ చేయాల్సి ఉన్నందున బెయిల్ ఇవ్వలేమని హైకోర్టు అభిప్రాయపడింది. మరికొంతమంది కీలక నిందితులు కూడా అరెస్ట్ కావాల్సి ఉంది. ఇందులో అప్పటి ఇంటలిజెన్స్ బాస్ పీఎస్ఆర్ ఆంజనేయులుతో పాటు అప్పటి సీఐడీ డీజీ పీవీ సునీల్ కుమార్, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా నిందితులుగా ఉన్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయిన విజయ్ పాల్‌కు మాత్రం జిల్లా కోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. అంతకు ముందు విజయ్ పాల్‌కు కూడా జిల్లా కోర్టు, హైకోర్టు, సుప్రీం కోర్టు కూడా బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఆయన మరలా జిల్లా కోర్టులో బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసారు. దాదాపు రెండు నెలల తర్వాత విజయ్ పాల్‌కు బెయిల్ మంజూరు అయింది. ప్రస్తుతం కీలక నిందితుడిగా ఉన్న తులసిబాబును కూడా ఒంగోలు పోలీసులు అరెస్ట్ చేశారు. ఒంగోలు ఎస్పీ ఇప్పటికే రెండు సార్లు విచారణ జరిపారు. ఈ విచారణలో ఆయన ఎటువంటి సహకారం అందించలేదని, అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేదని పోలీసులు పిటిషన్ ఫైల్ చేశారు. నిన్న ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా తులసిబాబును ఒంగోలు ఎస్పీ విచారించారు.



## రాజకీయ నేతల ముసుగులో నేరస్తులు ప్రజాస్వామ్యానికే ముప్పు

### - ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

**విజయవాడ,ఫిబ్రవరి 14,ప్రభాతవాక్తప్రతినిధి:** రాజకీయ నేతల ముసుగులో నేరస్థులు ప్రజాస్వామ్యానికే పెనుముప్పుగా మారారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీలో గత ఐదేళ్లపాటు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన వ్యక్తులు ఇప్పుడు కొత్తదారులు వెతుక్కుంటున్నారని ఆయన మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో అందుబాటులో ఉన్న పార్టీ నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అయ్యారు. ఏపీలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలు, అలాగే టీడీపీ కార్యకర్తల సంక్షేమంపై పార్టీ నేతలతో ఆయన ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే అంశంపై త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసేందుకు సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఎంపీ భరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, ఏఎస్ రామకృష్ణలతో కమిటీ ఏర్పాటుకు ఆయన నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణగుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. కష్టపడి పని చేసి భారీ మెజారిటీతో కూటమి అభ్యర్థులు ఆలపాటి రాజా, పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే పార్టీ కార్యకర్తల సంక్షేమంపైనా నేతలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటివరకూ కార్యకర్తల సంక్షేమానికి ఎంత ఖర్చు పెట్టింది, చెల్లించాల్సినవి ఇంకెన్ని ఉన్నాయనే అంశాలను నేతలతో చంద్రబాబు చర్చించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. "నేరస్థులు రాజకీయం ముసుగులో ఉంటే ప్రజాస్వామ్యానికి ఎంతో ప్రమాదం. అలాంటి వారిని గుర్తించి ఏరివేయాల్సిన అవసరం ఉంది. గత ఐదేళ్లపాటు రాష్ట్రం రావణకాష్టంగా మారింది. తప్పులు మీద తప్పులు చేసి ప్రజలు, ప్రతిపక్షాలను హింసించారు. ఐదేళ్లపాటు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి.. అది చాలదన్నట్లు ఇప్పుడు కొత్తదారులు వెతుకుతున్నారు. ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పి నిజమని నమ్మించాలని తాపత్రయ పడుతున్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం ఎంతటివారినైనా ముంచేందుకు ఏమాత్రం వెనుకాడడం లేదు. నా దళితులు నా దళితులు అంటూనే వారిని నట్టేట ముంచే రకాలు కనిపిస్తున్నారు. ఆటవిక రాజ్యంలో దాడులు, ఊచకోతలు, విధ్వంసాలు, హత్యల జరిగాయన్నారు. నేరస్థులు రాజకీయం ముసుగులో ఉంటే ప్రజాస్వామ్యానికి ఎంతో ప్రమాదం. అలాంటి వారిని గుర్తించి ఏరివేయాల్సిన అవసరం ఉంది. గత ఐదేళ్లపాటు రాష్ట్రం రావణకాష్టంగా మారింది. తప్పులు మీద తప్పులు చేసి ప్రజలు, ప్రతిపక్షాలను హింసించారు. ఐదేళ్లపాటు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి.. అది చాలదన్నట్లు ఇప్పుడు కొత్తదారులు వెతుకుతున్నారు. ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పి నిజమని నమ్మించాలని తాపత్రయ పడుతున్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం ఎంతటివారినైనా ముంచేందుకు ఏమాత్రం వెనుకాడడం లేదు. నా దళితులు నా దళితులు అంటూనే వారిని నట్టేట ముంచే రకాలు కనిపిస్తున్నారు. ఆటవిక రాజ్యంలో దాడులు, ఊచకోతలు, విధ్వంసాలు, హత్యలు జరిగాయి.

## 2 కోట్ల 51లక్షల పైన ఖరీదు ఉన్న యాపిల్ ఐ ఫోన్‌లు యాక్ససరీస్ స్వాధీనం : సిపి రాజశేఖరబాబు

### - భారీ దోపిడీని పట్టుకున్న అధికారులకు ప్రశంసలు

**విజయవాడ క్రైం,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త** విజయవాడ నగరంలో జరిగిన ఒక భారీ దోపిడీని పోలీసులు ఎట్టకేలకు ఛేధించి యాపిల్ ఐ ఫోన్‌లను పట్టుకున్నారు. వాటి విలువ సుమారు 2 కోట్ల పైనే ఉంటుందని,దానికి సంబంధించిన వివరాలను శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో సిపి రాజశేఖరబాబు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 6న విజయవాడ,ఎనికేపాడు లోని గద్దె దుర్గా ప్రసాదరావుకు చెందిన గోడౌన్ లోని ఇంగ్రం మైక్రో ఇండియా ప్రైవేటు లిమిటెడ్ వేర్ హౌస్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి ఐరన్ రూఫింగ్ షీట్‌ను కట్టర్‌తో కట్ చేసి లోనికి చొరబడి సిసి కెమేరా వైర్లను తొలగించి, అట్ట పెట్టెలలో ఉన్న రూ.2కోట్ల51లక్షల23వేల072 పైన విలువల గల 271 యాపిల్ ఐ ఫోన్‌లను,వివిధ రకాల యాక్ససరీస్‌ను చోరీ చేసినట్లు వేర్ హౌస్ ఇంఛార్జి అయిన ఎండి ఫరూక్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పటమట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యిందని వెల్లడించారు. ఈ కేసును సెంట్రల్ క్రైం పోలీసులకు బదిలీ చేసామన్నారు. వారు సంఘటనా స్థలంలో ఆధారాలను సేకరించి దర్యాప్తు ప్రారంభించారని దానిలో భాగంగా సిసిఎస్ బృందాలు నేరస్థలానికి దగ్గరలోని కెమేరాలను పరిశీలించగా, ఒక తెల్ల మారుతీ ఎర్టిగా కారు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లుగా తెలుసుకున్నారన్నారు. కారు గురించి మాట్రిక్స్ సిసి కెమేరాల డేటాను కమాండ్ కంట్రోల్‌లో పరిశీలించగా అది ఉత్తరప్రదేశ్‌కు చెందిన కారు నెంబరు అని తెలిసిందన్నారు. దాంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సదరు కారు,అందులో ప్రయాణించేవారి కదలికలను పసిగట్టామని, అందుబాటులో ఉన్న సాసారం టోల్ ప్లాజా,బీహార్ స్టేట్ వద్ద శివసాగర్ పోలీస్‌స్టేషన్ అధికారి అయిన నితీష్‌కుమార్ సింగ్,డెహ్రి జిల్లా ఎస్‌పి అయిన రోషన్‌కుమార్ ,బీహార్ రాష్ట్ర పోలీసులకు సదరు నిందితుల పరారీ సమాచారాన్ని తెలియపర్చిమన్నారు. వారి సహకారం కోరగా,వారు వెంటనే స్పందించి శివసాగర్ పోలీస్ స్టేషన్ అధికారి అయిన నితీష్‌కుమార్ సింగ్,డెహ్రి జిల్లా ఎస్‌పి,బీహార్ రాష్ట్ర పోలీసులు తమ నుండి పొందిన సమాచారంతో వారిని అదుపులోకి తీసుకొని దోపిడీ చేసిన 271 ఐ ఫోన్‌లను నేరస్థుల నుండి వశపర్చుకొని, స్థానిక కోర్టులో హాజరుపెట్టి, కోర్టు ద్వారా నేరస్థులను దోపిడీ సొమ్మును విజయవాడ పోలీసులకు అప్పగించారన్నారు. సదరు నేరస్థులను, దోపిడీ సొమ్మును,విజయవాడ కోర్టులో హాజరుపెట్టామని తెలిపారు. నేరస్థులు దోపిడీ చేసిన 271 యాపిల్ ఐ ఫోన్‌లు, యాక్సెసరీస్‌లను నేపాల్ లోని ఖాట్మండ్ సిటీ నందు అమ్మకానికి తగిన ఏర్పాట్లు చేసుకున్నా రని, ఈ కేసులో పట్టుబడని నిందితుడైన రంజిత్ దీనికి ఏర్పాట్లు చేసుకున్నాడని వెల్లడించారు. దోపిడీ చేసిన సెల్ ఫోన్‌లను కంపెనీ ద్వారా ఐఎంఇఐలను బ్లాక్ చేస్తే అది ఇండియాకే పరిమితమవుతుందని, దాంతో నిందితులు దోపిడీ చేసిన 271 యాపిల్ ఐ ఫోన్‌లను నేపాల్ లోని ఖాట్మండ్ సిటీ నందు అమ్మకానికి ఏర్పాటు చేసుకున్నారని వెల్లడించారు. ఈ కేసులో మొదటి నిందితుడైన డీప్ చంద్ ప్రజాపతి ఇంటరు వరకు చదువుకొని స్వంతంగా కారు ట్రావెల్స్‌ను పెట్టుకున్నాడు. అతని స్నేహితులైన మాయ జయప్రకాష్,సునీల్‌కుమార్ సరోజ్, బ్రిజేష్‌కుమార్‌లతో కలిసి ఏదైన నేరం చేసి డబ్బు సంపా దించాలని అనుకున్నాడు. దాంతో జయప్రకాష్,సునీల్‌కుమార్ సరోజ్‌లు గత నెల 20 అతని షాపు వద్దకు వచ్చి విజయవాడకు చెందిన ఒక గోడౌన్ లొకేషన్‌ను రంజిత్‌నే స్నేహితుడు తమకు పంపాడని,అందరం వెళ్ళి యాపిల్ ఐ ఫోన్‌లు,ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, అక్కడి గోడౌన్‌లో చోరీ చేస్తే వాటిని రంజిత్ నేపాల్ లోని ఖాట్మండ్ సిటీలో విక్రయిస్తాడని, దాంతో తమకు బారీగా డబ్బు వస్తుందని ఆశ పెట్టారు. దాంతో ప్రజాపతి తన ఎర్టిగా కారును చోరీకి తీసుకువస్తానని ఒప్పుకున్నాడు. ఖర్చులకు కావల్సిన డబ్బును జయప్రకాష్,సరోజ్‌లు సమకూరుస్తామన్నారు. బ్రిజేష్‌కుమార్,మిథిలేష్ కుమార్,సురేంద్ర కుమార్ పటేల్‌లు కూడ ఖర్చులకు తాము కూడ సమకూరుస్తామని చెప్పారు. దాంతో వారందరూ ఉత్తరప్రదేశ్ నుండి బయలుదేరి విజయవాడకు వచ్చి నేరం చేసి తిరిగి వెళ్ళిపోతుండగా బెజవాడ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు బీహార్ పోలీసులు వారిని పట్టుకొని విజయవాడ పోలీసులకు అప్పగించారని తెలిపారు. కేసులో రెండవ నిందితుడైన జయప్రకాష్ గతంలో అనేక చిల్లర చోరీలు చేసాడు కాని ఇతనిపై ఎక్కడా కేసులు నమోదు కాలేదని వెల్లడించారు. మూడవ నిందితుడైన సరోజ్ ఆర్టీఓ ఆఫీసులో ఏజెంట్‌గా పనిచేస్తుండేవాడని, 4వ నిందితుడైన బ్రిజేష్ కుమార్ ఉగ్ర ఆర్టీఓ ఆఫీసులో ఎజెంటూ పనిచేస్తుండేవాడని రెండవ నిందితుడైన సరోజ్‌కు అత్యంత సన్నిహితుడని పేర్కొన్నారు.5వ నిందితుడైన మిథిలేష్‌కుమార్ కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడని,6వ నిందితుడైన సురేంద్ర కుమార్ పటేల్ కూడ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు.



స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు యాపిల్ ఐ ఫోన్‌లతో సిపి రాజశేఖరబాబు

## ఎర్రచందనం ముద్దాయికి ఐదేళ్ల జైలు

### - రూ. 6లక్షల జరిమానా

**తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో అరెస్టయిన ముద్దాయికి ఆర్‌ఎస్‌ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహ మూర్తి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చారు. టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ లో క్రైమ్ నెంబరు 25/2016 కేసులో ముంగిలిపట్టు బీటు పరిధిలో తమిళనాడు విల్లుపురం జిల్లాకు చెందిన జయపాల్‌ను టాస్క్ ఫోర్సు అధికారులు అరెస్టు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణతో, ఎస్పీ పీ.శ్రీనివాస్ పర్యవేక్షణలో ఈ కేసు విచారణ దశలో ఉండగా, ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ప్రాసిక్యూషన్ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి, శిక్ష పడేలా చేయడానికి దోహద పడ్డారు. దీంతో న్యాయమూర్తి ముద్దాయికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితుని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ముద్దాయిలకు శిక్ష పడే విధంగా కృషి చేసిన కోర్టు సిబ్బందిని టాస్క్ ఫోర్సు అధికారులు అభినందించారు. రిజర్వు అటవీ ప్రాంతంలోని విలువైన సహజ సంపదైన ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేసే నేరస్థులకు ఇది ఒక హెచ్చరికగా ఉంటుందని ఎస్పీ తెలిపారు.

## నాణ్యతా ప్రమాణాలపై విశాఖలో బిఐఎస్ శిక్షణా కార్యక్రమం

**విజయవాడ, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** విజయనగరం, శ్రీకాకుళం, మన్యం జిల్లాల్లోని పాఠశాలల్లో ప్రామాణిక క్లబ్‌లకు మార్గదర్శకత్వం వహిస్తున్న దాదాపు 40 మంది సైన్స్ ఉపాధ్యాయులకు విశాఖలో లెర్నింగ్ సైన్స్ వయా స్టాండర్డ్స్ అనే అంశంపై ఒక రోజు శిక్షణా కార్యరకమాన్ని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విజయవాడ శాఖ నిర్వహించింది. విశాఖపట్నం పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ బి విజయ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ వర్క్‌షాప్‌లో సాధారణంగా వుపయోగించే ఉత్పత్తుల ఉదాహరణలతో శాస్త్రీయ చట్టాలు మరియు సూత్రాల ఆచరణాత్మక అనువర్తనాలను వివరించారు. ప్రామాణిక క్లబ్ పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు మరియు మార్గదర్శకులు విద్యార్థులకు పాఠ్య ప్రణాళికలను అందించేలా బోధిస్తూ సమాజ అవగాహన కల్పించడానికి మరింత దోహదం చేస్తుందన్నారు. మరో ముఖ్య అతిథి శ్రీకాకుళం విద్యాశాఖాధికారి ఎస్ తిరుమల చైతన్య మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు నాణ్యత, ప్రమాణాల ప్రాముఖ్యతలను వాటి ఆవశ్యకతను తెలుసుకోవడం ద్వారా నిజజీవిత పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొడానికి వారికి పాఠ్యప్రణాళికలు ఒక సాధనంగా ఉపయోగపడతాయన్నారు. బిఐఎస్ విజయవాడ సైంటిస్ట్ సి/ డిప్యూటి డైరెక్టర్ డి వివేక్‌వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈ విధానం ద్వారా విద్యార్థులు సైన్స్ రంగంలో రాణించడానికి మరింత సమాజానికి అర్థవంగా దోహదపడుతుందన్నారు. ప్రామాణీకరణ, సర్టిఫికేషన్ పథకాలు, పరీక్ష, శిక్షణ మరియు ప్రమాణాల ప్రమోషన్ కార్యకలాపాలను బిఐఎస్ ఏవిధంగా నిర్వహిస్తుందో ఆహుతులకు వివరించారు. జివిపి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, స్టాండర్స్ క్లబ్, ప్రొఫెసర్, మెంటర్, డా మంచికంటి శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలల పిల్లల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచడానికి బిఐఎస్ అభివృద్ధి చేసిన వివిధ ఉత్పత్తుల పాఠ్యప్రణాళికలను వివరించారు. బిఐఎస్ స్టాండర్డ్స్ ప్రమోషన్ ఆఫీసర్ డి కృష్ణవీర్ వర్మ, బిఐఎస్ అధికారి జి అనిల్ కుమార్, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి బిఐఎస్ వెబ్‌సైట్, ఇ-బిఐఎస్, కేర్‌యాప్, సమాచారాన్ని యాకె స్ స్ చేయడానికి ఉపయోగించడానికి ఆన్‌లైన్ ఎక్స్ఛేంజ్ ఫోరం అయిన మనక్‌రథ్ వివరాలు తెలిపారు. నాణ్యత ప్రమాణాలు, శాస్త్రీయ చట్టాలు, సూత్రాలపై వివరణాత్మక ప్రదర్శనలు, ఉదాహరణలతో నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించారు.




శిక్షణా కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న బిఐఎస్ అధికారులు

15-2P□g7exHMNWJQE.qxd:15-2P□g7exHMNWJQE.qxd 01/01/01 9:25 AM Page 1



## హెచ్ఐవి ఎయిడ్స్ పై కళాజాత ప్రోగ్రామ్స్

**- రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.మంజుల**

**విజయవాడ,ఫిబ్రవరి14,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎయిడ్స్ పై కళాజాత కార్యక్రమాలు విస్తృతంంగా నిర్వహిస్తున్నట్లు జాయింట్ డైరెక్టర్, ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలిడాక్టర్ టి. మంజుల తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రజల్లో హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ టి. మంజుల వివరించారు.

ఈ సందర్భంగా శుక్రవారం చిగురు బాలల ఆశ్రమంలో ఆమె మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ పట్ల ప్రజల్లో విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా అవగాహన కల్పించడానికి తద్వారా హెచ్ఐవి నివారణా మార్గాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు.

అందులో భాగంగా గుంటూరు జిల్లా వెంకటపాలెంలో ఉన్న చిగురు బాలల ఆశ్రమంలో మూడు రోజుల పాటు కళాజాత ప్రోగ్రాం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ప్రతి జిల్లాలో నుండి రెండు బృందాలను ఏర్పాటు చేసి వారికి అవగాహన ఎలా

కల్పించాలి అనేదానిపై శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసామన్నారు.

## నెయ్యిసరఫరాకు టెండర్‌లో ఎలా పాల్గొన్నారు?



**- అర్హత లేకున్నా మీకు మద్దతుగా ఎవరు నిలిచారు**

**- కల్తీ ఎక్కడ, ఎలా చేశారు - తొలిరోజు ప్రశ్నలవర్షంతో సిబిఐ సిట్ ఆరా**

**తిరుమల,ఫిబ్రవరి 14ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసిద్ధ హిందూ ధార్మికసంస్థ తిరుమల దేవుని లడ్డూల తయారీలో వినియోగించే నెయ్యిసరఫరాకు టెండర్లలో ఎక్కడో ఉత్తరాఖండ్‌లో ఉన్న బోలేబాబాడైరీ తమిళనాడులోని ఏఆర్ డైరీలు ఎలా పాల్గొన్నారు?అసలు నెయ్యిసరఫరా చేయాలని మీకు సూచించిన పెద్దలు ఎవరు అనే కోణంలో సిబిఐ సిట్ అధికారులు తొలిరోజు కీలక నిందితులను విచారణ చేశారు. వారిని ఉదయం నుండి సాయంత్రం వరకు న్యాయవాదుల సమక్షంలో తిరుపతి అలిపిరిలోని భూదేవికాంప్లెక్స్ లో ఉన్న సిట్ కార్యాలయంలో అనేక ప్రశ్నలు సంధించి కల్తీ నెయ్యి సరఫరాపై వివరాలు రాబట్టారు. ఇప్పటికే కల్తీనెయ్యి కేసులో సిబిఐ సిట్ అధికారులు అరెస్టుచేసి, రిమాండ్‌లో ఉన్న నిందితులు ఏఆర్ డైరీ యాజమాన్యం ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, షోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక)సిఇఒఅపూర్వవినయ్‌కాంత్ చావ్డాలను న్యాయస్థానం ఐదురోజుల కస్టడీకి అను మతించడంతో శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకు పలు ప్రశ్నలు సిద్ధం చేసుకుని సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. ముందుగా నిందితులను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి వారి ఆరోగ్యపరిస్థితిని పరీక్షించారు.ఆ తరువాత సిట్ కార్యాలయానికి పోలీసు భద్రత నడుమ తరలించారు. ఉదయం 9గంటలనుండి సాయంత్రం 5గంటల వరకు న్యాయవాదుల సమక్షంలో సిబిఐ సిట్ అధికారులు ఎక్కడా ప్రలోభాలకు లొంగకుండా విచారణ చేసి పలు ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. దేవుని పవిత్రమైన లడ్డూల తయారీకి కల్తీనెయ్యి సరఫరా చేయాలని ఎవరు చెప్పారు?ఇందుకు ఎవరి ప్రమేయం ఉంది.అసలు ఎందుకు ఇలా కల్తీ నెయ్యిసరఫరా చేయాల్సి వచ్చిందని నలుగురు నిందితులను సిట్ అధికారులు ప్రశ్నించారు. ఏఆర్ డైరీ పేరుతో బోలేబాబాడైరీ నుండి నెయ్యిని సరషరా చేయాల్సి రావడం,దీనికి సహకరించిన రాజకీయనాయకులుగానీ, టిటిడి పాలకమండలిగానీ, అధికారులు గానీ ఎవరున్నారని ఆరా తీశారు. డైరీల నుండి నెయ్యిని నింపిన ట్యాంకర్లను సీల్ వేసిన తరువాత మార్గమధ్యలో ఏయే ప్రాంతాల్లో నెయ్యిని కల్తీ చేశారని కూడా ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టినట్లు తెలుస్తోంది. నెయ్యిట్యాంకర్లు ఎప్పుడు నుండి సరషరాచేశారు, అందులో కల్తీ ఎలా చేశారు. ఎంతకాలం కల్తీనెయ్యిని టిటిడికి పంపారని సిట్ అధికారులు ప్రశ్నలకు సమాధానం రాలేదని ,ఒకరిద్దరు అధికారుల పేర్లు వెల్లడించినట్లు విశ్వసనీయ వర్గాల కథనం. టిటిడికి అవసరమైన నెయ్యిసరషరా చేయడంలో సామర్థ్యం లేకపోయినా ఎందుకు టిటిడి ప్రతిపాదనలను అంగీకరించారని ప్రశ్నించారు. ఏఆర్ డైరీకి, బోలేబాబాడైరీకి మధ్య ఉన్న సంబంధం ఏమి అని ఆరా తీశారు. కల్తీనెయ్యి సరషరా చేసి ఎంత కమీషన్ పొందారు?దీనికి సహకరించిన అధికారులు ఎవరని కూడా సమాధానం రాబట్టినట్లు తెలుస్తోంది. 18వతేదీ వరకు ఆ నలుగురిని విచారణ చేసి ఆ తరువాత ఇందుకు కారకులైన వారికి నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది.

## బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా గౌతంకుమార్



**విజయవాడ ఫిబ్రవరి 14ప్రభాతవార్త ప్రతినిధి:** బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన బందెల గౌతంకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధినాయకత్వం గురువారం ఢిల్లీలో ఆయన ఎంపికను ఖరారు చేసింది.రాష్ట్ర బిఎస్పీ వర్గాలు విజయవాడలో బందెల గౌతంకుమార్ సమా చారాన్ని వెల్లడించింది. మదనపల్లె పట్టణానికిచెందిన గౌతంకుమార్ ఎంబీఏ చదివాక విద్యార్థి, ప్రజా సంఘాల నాయ కుడిగా పనిచేసి, 2017లో బీఎస్పీలో కార్యకర్తగా చేరారు. 2019లో రాష్ట్ర కోశాధికారిగా అదే ఏడాది రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకం అయ్యారు. తాజాగా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమి తులయ్యారు. ఆయన నియ మకాన్ని ఇక్కడి బీఎస్పీ కమిటీ ధృవీకరించింది. గౌతంకుమార్ బిఎస్పీ పక్షాన దళిత.బహుజన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారు.

## ఇపిటిఆర్ఐని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** గచ్చిబౌలిలోని రాష్ట్ర పర్యావరణ పరి రక్షణ, శిక్షణ సంస్థ (ఈపీటీఆర్ఐ)ని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రపంచంలో గుర్తింపు తెచ్చుకునే సంస్థ సమస్యల నిలయంగా మార దంపై సురేఖ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ సంస్థని గాడిలో పెట్టాలని... తగిన అవసరాలు ఏంటో సమగ్రంగా తమకు నివేదిక అందజేయాలని ఈపీటీఆర్ఐ సంస్థ డైరెక్టర్ జనరల్ అహమద్ నదీంకి ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగస్తుల సమస్యలను అడిగి తెలుసుకొని తక్షణ పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు. స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థకి గవర్నమెంట్ సంస్థల ద్వారా ప్రైవేట్‌కి ఇచ్చే పనులని ఈపీటీ ఆర్ఐకి నామినేషన్ పద్ధతిలో ఇచ్చేందుకుచర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ఇందిరమ్మ ఇళ్లకు నిధులు సిద్ధం

**పునాది పూర్తయితే రూ.1 లక్ష జమ చేస్తున్న ప్రభుత్వం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇంటి పథకం లబ్ధిదారులకు నిధులు అందిచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది, మొదటి దశలో లబ్ధిదా రులను గుర్తించి వారు పనులు మొదలుపెట్టి పునాది వరకు పూర్తిచేస్తే వారి ఖాతాలో రూ.1 లక్ష జమ చేస్తారు. ఇందు కోసం ప్రభుత్వం ముందస్తుగానే నిధులను సిద్ధం చేసింది. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. గత నెల 21న ఈ స్కీమ్‌ను లాంఛనంగా ప్రారంభించి ప్రతి మండలం పరిధిలోని ఓ గ్రామంలో లబ్ధిదారులను గుర్తించారు. మొత్తం 562 పంచాయతీల్లో 71,482 మంది లబ్ధిదారులు మొదటి విడుతలో ఎంపికయ్యారు. వీరందరికి ప్రొసీడింగ్స్ కాపీలు అందించినట్లు తెలిసింది. వీరు పనులు ప్రారంభించి పునాది వరకు పూర్తి చేస్తే తొలి విడత కింద ఖాతాలో రూ.1 లక్షల వరకు జమ అవుతాయి. మొత్తం నాలుగు విడతల్లో రూ. 5 లక్షలను లబ్ధిదారునికి అందిస్తారు. వాటిలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) వాటా కూడా ఉంటుంది.

అయితే మొదటి విడుత కింద ఇవ్వాలని నిర్ణయించిన లక్ష రూపాయాలను రాష్ట్రప్రభుత్వమే పూర్తిగా ఇవ్వనుంది. పునాది వరకు పూర్తి చేస్తే నిర్మాణ పనలనుకు సంబంధించి పను లను అధికారులు పరిశీలిస్తారు. ఫొటోలు దింపి అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాత లబ్ధిదారుడి ఖాతాలో డబ్బులను జమ చేస్తారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.1,000 కోట్లను నిధులను వీటి కోసం ప్రత్యేకంగా కేటాయించింది. ఇప్పటి వరకు పరిశీలించిన వాటిని మూడు కేటిగిరీలుగా విభజించి ఎల్ 1, 2, 3 విభాగాలుగా విభజించి ప్రాధాన్యత ప్రభాకరం లబ్ధిదారులను ఖారారు చేస్తున్నారు. ఎల్ 1 జాబితాలో ఉన్నవారికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ యేడాది రాష్ట్ర వ్యాపంగా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నారు.

**అందుబాటులోకి వచ్చిన ఇందిరమ్మ ఇల్లు మొబైల్ యాప్**

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ స్థితిని సులభంగా తెలుసు కునేందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను సిద్ధం చేసింది. ఈ మొబైల్‌తో ఇందిరమ్మ ఇళ్ల స్టేటస్ సులువుగా తెలుసుకోవచ్చు. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు తమ దరఖాస్తు ఏ స్టేజ్‌లో ఉంది? ఇంటి కోసం సర్వే నిర్వహిం చారా లేదా? ఇల్లు మంజూరైందా? లేదా? మం జూరైన ఇల్లు ఎల్1, ఎల్2, ఎల్3 జాబితాలో ఉందా? ఏ కారణం చేత ఇల్లు మంజూరు కాలేదు? వంటి వివరాలను తెలుసుకునేలా ఈ యాప్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ యాప్‌లో ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్, రేషన్ కార్డు నెంబరుతో అన్ని వివరాలు తెలుసుకోవచ్చు.

## మిర్చికి కనీస మద్దతు ధర రూ.25 వేలు అమలుచేయాలి

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ**

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మిర్చికి కనీస మద్ధతు ధర రూ. 25000 అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులు పండించిన మిర్చికి ధర దారుణంగా పడిపోతుందని.. క్వింటాల్‌కు రూ25,000 ఉండాల్సిన పరిస్థితి నుండి రూ.12,000లకు తగ్గించి వ్యాపారులు రైతులకు గిట్టుబాటు లేకుండా చేస్తున్నారని.. ఫలితంగా మిర్చి రైతుల ఆత్మహత్యలు ప్రారంభమయ్యాయని జాన్ వెస్లీ ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలో ఇద్దరు రైతులు ఆత్మహత్యలు చేసుకోగా.. ఒక రైతు గుండెపోటుతో మరణించారని తెలిపారు. మిర్చి బోర్డును ఏర్పాటు చేసి మద్దతు ధర నిర్ణయించేలా ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయాలని.. మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటకాలంలో వ్యాపా రులు మార్కెట్లల్లో ధరలు తగ్గించడం, రైతుల నుండి సరుకు వ్యాపారులకు చేరిన తర్వాత ధరలను రెట్టింపు చేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో మిరప పంట క్వింటాల్‌కు కనీస మద్ధతు ధర రూ.15,000లు ఇస్తామని ప్రకటించారు. మార్కెటింగ్ శాఖ జోక్యం చేసు కొని క్వింటాల్‌కు రూ.25,000లు ధర ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు

## మండల్ సిఫార్సు మేరకు ముస్లింలకు రిజర్వేషన్లు

**కార్పొరేటర్ స్థాయి దాటని కేంద్రమంత్రి బండి సంజయ్**

**మినరల్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవర్తి అనిల్‌కుమార్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** మండల్ సిఫార్సు మేరకు హిందు వులకు, ముస్లిం వెనకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఇస్తుంటే కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యతిరేకించడం తగదని మినరల్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవర్తి అనీల్‌కుమార్ అన్నారు. గాంధీభవన్ మినరల్స్ కార్పొ రేషన్ చైర్మన్ ఈరవర్తి అనిల్ మాట్లాడుతూ.. కేంద్రమంత్రి బండి సంజయ్ ఇప్పటికీ కార్పొరేటర్ అనుకొని బాధ్యతారాహిత్యంగా ద్వేషపూరిత వ్యాఖ్యలు చేసు న్నారని ఆవేదన చెందారు. జాగ్రత్తగా మాట్లాడాలని హితవు చెప్పారు. హైదరాబాద్ వరదల సమయంలో బండి పోతే బండి కారు పోతే కారు అంటూ అమలుకు సాధ్యంకానీ హామీలతో ప్రజలను సంజయ్ మభ్యపెట్టారని ఎద్దేవా చేశారు. ముస్లింలను బీసీలలో చేర్చితే చూస్తూ ఊరుకోం అని బండి సంజయ్ హెచ్చరికలు చేయడం లౌకిక విధానాలకు వ్యతిరేకమని అన్నారు. ముస్లిం, క్రిస్టియన్ లకు వ్యతిరేకంగా మాట్లాడే ముందు మేధావులతో చర్చించి మాట్లాడాలి కదా? అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ కులం ఎందుకు గుణం ముఖ్యమని కుల గణన వద్దు అంటున్నాడని ఆరోపించారు. గణన లేకుండా రిజర్వేషన్ పెంపు ఎలా సాధ్యం అని ప్రశ్నించారు. కుల గణన చేయాలా వద్దా అని బండి సంజయ్‌కి నా సవాల్ అనిల్ విసిరారు. బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిరా పోరాటం చేద్దాం అంటూ పిలుపు నిచ్చారు.



మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో దరఖాస్తులు అందజేస్తున్న దృశ్యం

## ప్రజావాణికి అందిన దరఖాస్తులు 1,233

**హైదరాబాద్ (బేగంపేట) ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 1,233దరఖాస్తులు అందాయి.పంచాయితీ రాజ్ మరియూ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 96 దరఖాస్తులు, విద్యుత్‌శాఖకు సంబంధించి 76 దరఖాస్తులు, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 36 దరఖా స్తులు, ప్రవాసీ ప్రజావాణీకి సంబంధించి 01దరఖాస్తులు ఇందిరమ్మ ఇండ్ల కోసం 974 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి 50దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.జి.చిన్నారెడ్డి పాల్గొని దరఖాస్తు దారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలను అధికారులతో మాట్లాడారు.

## పచ్చని భవిష్యత్తు వైపు భారత్

**అదే 'సక్షం' ప్రధాన లక్ష్యం : గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ**

**హైదరాబాద్ (నాంపల్లి), ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ పెట్రోలియం సహజ వాయుదు మంత్రిత్వశాఖ చమురు గ్యాస్ ప్రభుత్వ రంగ సంస్థలు సంయుక్తంగా స్థానిక అధికారులు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, కీలక వాటాదారుల సహకారంతో ప్రతీ యేటా నిర్వహిస్తున్న సక్షం (సంరక్షణ క్షమత మహోత్సవ పక్షోత్స వాలు భారతదేశాన్ని పచ్చని భవిష్యత్తువైపు నడిపించ డమే ప్రధాన లక్ష్యంగా రూపొందించడం అభినంద నీయమని గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. ఇది ఇంధన సంరక్షణను ప్రోత్సహించడం, ఇంధన వినియోగ పొదుపు పద్ధ తులపై అవగాహన పెంచ డానికి నిర్వహించడం ఉప యుక్తమన్నారు. నాం పల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో శుక్ర వారం నుండి 28వరకు సక్షం-2025 సంరక్షణ క్షమత మహోత్స వం-2025 పేర 15 రోజులపాటు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ముఖ్యఅతిథిగా వచ్చిన కేంద్ర చమురు సహజ వాయు సంస్థల రాష్ట్ర అధిపతులు అనిల్‌కుమార్, పియూష్ మిట్టల్, బెన్నీ థామస్, నితిన్ సేలుకర్, దేవకాంత్‌సిన్హా, యతేం ద్రపాల్ సింగ్, తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్య క్షుడు ఆచార్య వి.నిత్యానందరావు, దాన కిషోర్ తదితరులతో కలిసి జ్యోతి వెలిగించి మహోత్స వాలను లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. ఇంధన ప్రాముఖ్యత, పొదుపు, పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరమని, ఇవి భారతదేశ జిడిపిపై ఎంతో ప్రభావాన్ని చూపుతాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సక్షం 2025 లోగోను ఆవిష్కరించి బెలూన్లను లాంఛనంగా విడుదల చేశారు. ఈ సంవత్సరం థీమ్ : గ్రీన్, క్లీన్ ఎనర్జీ ద్వారా క్లీన్ ఎన్విరాన్ మెంట్ (హరిత్ ఉర్జాసే స్వచ్ఛ్ పర్యావరణ్) పునరా త్పాదక ఇంధన వనరులు, పర్యావరణ స్థిరత్వం, ఇంధన సమర్ధవంతమైన పరివర్తనను నొక్కివక్కాణిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల అధిపతులు మాట్లాడుతూ పెట్రోలియం పొదుపు, పరిరక్షణ అత్యవసర అవసరాన్ని విశదీకరించారు. ఇంధన వినియోగంలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా మూడవ అతిపెద్దది, అత్యధిక పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతులపై ఆధారపడి ఉండడంతో ఇంధన పొదుపు, పరిరక్షణ చర్యలు, పునరుత్పాక ఇంధన స్వీకరణ, స్వచ్ఛమైన ఇంధన ఆవశ్యకతను సవివరపరిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలను గవర్నరు తదితర అతిథుల చేతులమీదుగా అందించి అభినందించారు.




'సక్షం' 2025 లోగోను ఆవిష్కరిస్తున్న గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ, నిత్యానందరావు, దానకిషోర్, సంస్థల అధిపతులు

## న్యాయ ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు

**బిసి రిజర్వేషన్లపై బిసి కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** బీసీ కుల గణన అనంతరం బీసీ డెడికేషన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా 42 శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వం ముందు ఉన్న లక్ష్యమని బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. శుక్ర వారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భవిష్యత్తులో న్యా యపరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలతో సిఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయ త్నాలను స్వాగతి స్తున్నామ న్నారు. బీసీల కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ మహా యజ్ఞానికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. బీసీల కోసం అప్పుడు కాంగ్రెస్ పార్టీ చేసిన పోరాటాన్ని మాజీ సీఎం కేసీఆర్ పట్టించుకోలేదని, నేడు అదే పార్టీ ఎమ్మెల్సీ కవిత బీసీ రిజర్వేషన్ల కోసం రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించడం బీసీ సమాజం గమనిస్తున్నదన్నారు. అధికారంలో ఉన్న సమయంలో బీసీలకు అన్యాయం చేసిన పార్టీ నేడు బిసిల కోసం పోరాటం చేస్తాం అనడం అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సకల వసతులతో ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్మాణాలు చేపట్టిందని ఇవి దేశానికే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తాయని అన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న నూతి శ్రీకాంత్‌గౌడ్

## ఎసిబి వలలో గచ్చిబౌలి ఎడిఇ

**ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు కోసం రూ.50వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం**

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** విద్యుత్ శాఖలో మరో అవినీతి తిమింగలం ఎసిబి అధికారులకు చిక్కింది. నిర్మాణం పూర్తి చేసుకున్న ఓ అపార్టుమెంటుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసేందుకు రూ. 75వేల లంచం డిమాండ్ చేసి, అందులో రూ. 50వేలు తీసుకుంటుండగా గచ్చి బౌలి ఎడిఇ ఎసిబి అధికా రులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. శుక్రవారం ఎడిఒ కార్యాలయం మీద దాడులు చేసిన ఎసిబి అధికారులు లంచం తీసు కుంటుండగా సతీష్‌ను పట్టుకున్నారు. ఎసిబి అధికారుల కథనం ప్రకారం.. టిజి ట్రాన్స్‌కో సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలో కొట్టె సతీష్(43) గచ్చిబౌలి అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. కాగా డివిజన్‌లో ఓ కొత్త అపార్టుమెంటు కోసం ట్రాన్స్‌ఫార్మర్, సిటి మీటరర్ కోసం యజమాని దరఖాస్తు చేసుకున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేసేందుకు సతీష్ అపార్టుమమెంటు యజమాని వద్ద 75వేల రూపాయల లంచం డిమాండ్ చేశాడు. దీంతో భవన యజమాని మొదటి విడతలో 25వేల రూపాయలు సతీష్‌కు ఇచ్చాడు. మిగిలిన 50 వేల కోసం సతీష్ అపార్టు మెంటు యజమానిని ఒత్తిడి చేయడంతో ఏసిబి అధికారులను ఆ శ్రయిం చాడు. వారి సూచనతో శుక్రవారం మధ్యాహ్నం భవన యజమాని 50వేల రూపాయలను గచ్చిబౌలి ఏడిఈ కార్యాలయంలో ఏడిఈ సతీష్‌కు ఇచ్చాడు. అక్కడే ఉన్న ఏసిపి అధికారులు రెడ్‌హ్యాం డెడ్‌గా ఏడిఈ సతీష్‌ను పట్టుకునా న్నరు. అనం తరం నాంపల్లిలోని ఏసిబి కోర్టులో హాజరుపరిచారు.



లంచం డబ్బుతో ఎసిబి అధికారులకు చిక్కిన ఎడిఇ సతీష్

## ప్రజల రవాణా సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలి

**రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి**

**ఆర్‌టిఎ (నాన్ ఆఫీసియల్) సభ్యుల సమావేశంలో మంత్రి పొన్నం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజల రవాణా పరమైన సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని.. అలాగే రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని కొత్తగా నియమితులైన ఆర్‌టీఏ(నాన్ ఆఫీసియల్) సభ్యులకు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. కొత్తగా నియమి తులైన ఆర్‌టీఏ అధికారులకు మంత్రి అభినం దనలు తెలిపి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా నియమైకమైన వారితో సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, జెటిసిలు శివ లింగయ్య, చంద్రశేఖర్ గౌడ్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు 24 మందికి ఆర్‌టీఏ సభ్యులుగా అధికారిక నియామక పత్రాలు వచ్చాయని, మిగిలిన వారికి కూడా త్వరలోనే అధికారిక ఉత్తర్వులు వస్తాయని తెలిపారు. జిల్లాల్లో స్థానిక నాయకత్వం సలహా సూచనల మేరకు నేరుగా వారి వద్దకే నియామక పత్రాలు వచ్చాయని మంత్రి తెలిపారు. కొత్తగా నియామకైన వారు రవాణా శాఖ గౌరవాన్ని అభివృద్ధిని.. ప్రజల సౌకర్యార్థం రవాణా సేవల్లో వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం రవాణా శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలు ట్రాఫిక్ అవేర్‌నెస్ కార్యక్రమాలు తదితర అంశాలను రవాణా వాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ మంత్రికి వివరించారు. రాష్ట్రంలో మొదటిసారి యూనిసెఫ్ సహకారంతో నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో గవర్నర్ చేతుల మీదుగా చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ప్రారంభించామని మంత్రి తెలిపారు. రోడ్డు సేఫ్టీ మీద జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలు నివారించడానికి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

రాజకీయాల్లో ఏదైనా బాధ్యత వచ్చినప్పుడు ప్రజలు జ్ఞాపకం ఉంచుకునేలా పని చేయాలన్నారు. రవాణా శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చిల్డ్రన్ రోడ్ సేఫ్టీ అవేర్నెస్ పార్క్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. 63 రవాణా శాఖ కార్యా లయాల్లో 31 కార్యాలయాలకు భవనాలు కట్టాల్సి ఉందని.. 8 ప్రాంతాల్లో రవాణా శాఖ కార్యా లయాలకు స్థలాలు ఉన్నాయని .. ఇతర కార్యాలయాల్లో స్థలాల కోసం జిల్లా కలెక్టర్, స్థానిక శాసన సభ్యులతో సమన్వయం చేసు కుంటూ ల్యాండ్ కేటాయించేలా చొరవ తీసుకో వాలని సూచించారు. సభ్యులు రవాణా శాఖ గౌరవాన్ని పెంచేలా పని చేయాలన్నారు.

## పరీక్షల నిర్వహణలో సిసి కెమెరాల ఏర్పాటు

**సంస్కరణలకు కొత్త ప్రమాణం**

**ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల తీరును పర్యవేక్షించిన విద్యాకమిషన్**

**ఇంటర్ బోర్డు కార్యదర్శిని ప్రశంసించిన చైర్మన్ ఆకునూరి మురళీ**

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణలో సీసీ కెమెరాల ఏర్పాటు అనేది పరీక్షల సంస్కరణలకు కొత్త ప్రమాణంగా నిలుస్తుందని తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ ప్రశంసించారు. ఇంటర్‌బోర్డు ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ కోసం నాంపల్లిలోని బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్‌ను విద్యా కమిషన్ చైర్మన్, సభ్యులు శుక్రవారం పరిశీలించారు. అధునాతన సీసీటీవీ నిఘా వ్యవస్థతో పరీక్షలను పారదర్శకతతో నిర్వహించడంలో తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు కొత్త బెంచ్‌మార్క్‌ను నెలకొల్పిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో అత్యాధునిక సీసీటీవీ నిఘా వ్యవస్థను అమలు చేయడం ద్వారా పరీక్షా ప్రక్రియలో పారదర్శకత, సమగ్రతతోపాటు భద్రతను నిర్ధారించడానికి వీలవుతుందన్నారు. కమాండ్ కంట్రోల్ వ్యవస్థ పనితీరును తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్ రావు, జ్యోత్స్న రెడ్డిలు ఇంటర్ బోర్డు కార్యాలయంలో పరిశీలించారు.

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళాశాలల్లో ఏర్పాటు చేయబడిన 8,000 కంటే ఎక్కువ హైరిజల్యూషన్ కెమెరాలతో అనుసంధానించబడిన కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌ను బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య విద్యా కమిషన్ చైర్మన్‌కి వివరించారు. ఈ వ్యవస్థ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించడానికి, మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించడానికి అలాగే ఎటువంటి అక్రమాలు జరగకుండా నివారించడానికి వీలు కలుగుతుందన్నారు. పరీక్షల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇంటర్ బోర్డు అమలు చేయడాన్ని ఆకునూరి మురళీ ప్రశంసించారు. ఇది విద్యా రంగంలో ఒక మైలురాయిగా, పరీక్ష సంస్కరణలకు కొత్త ప్రమాణంగా నిలుస్తుందన్నారు.

ములుగు జిల్లాలోని ఒక ప్రభుత్వ కళాశాల ప్రత్యక్ష నిఘా ఫుటేజ్‌ను సమీక్షిస్తూ, పరీక్షా ప్రక్రియను సజావుగా అమలు చేయడం, పర్యవేక్షణ బృందం యొక్క సామర్థ్యాన్ని ఆయన ప్రశంసించారు.

15-2pg10.qxd:15-2pg10.qxd 01/01/01 7:31 AM Page 1



# ఛాంపియన్‌షిప్ కోసం.. టీమిండియాలో హై రిస్క్ స్పిన్నర్లు




## డేంజరస్ ఫాస్ట్ బౌలర్ బుమ్రా దూరం

## సెలెక్టర్ల వివాదాస్పద నిర్ణయాలు

**న్యూఢిల్లీ:** త్వరలో ప్రారంభమయ్యే ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత క్రికెట్ జట్టు కూర్పులో వివాదాస్పద నిర్ణయాలు చోటు చేసుకున్నాయి. ప్రకటించిన జట్టులో ఐదుగురు స్పిన్నర్లు ఉండటం, జస్ప్రీత్ బుమ్రా లేకపోవడం చర్చనీయాంశమైంది. దుబాయ్ పిచ్‌లకు అనుగుణంగా ఫాస్ట్ బౌలర్లను ఎంచుకోవడం సాధారణం అయినప్పటికీ, ఈ నిర్ణయం భారత జట్టుకు ఉపయోగపడుతుందా అనేది ప్రశ్నార్థకం. హర్షిత్ రాణా, యశస్వి జైస్వాల్ వంటి ఆటగాళ్ల ఎంపిక కూడా విమర్శలకు దారితీసింది. రిస్క్ ఎంత ఎక్కువగా ఉంటే ఫలితం అంత బాగుంటుందనేది కోచ్ గౌతమ్ గంభీర్ తత్వం. కానీ, డేంజరస్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా గాయం కారణంగా ఛాంపియన్స్ ట్రోఫీకిదూరమైన తర్వాత ఈ వ్యూహం భారత్‌కు ఏమేరకు ఉపయోగపడుతుందనేది సందేహమే. ఎందుకంటే భారత స్క్వాడ్‌లో 15 మందిని ఎంపిక చేసేట ప్పుడు చాలా రిస్క్ తీసుకున్నారు. దుబాయ్ వెళ్లే జట్టులో ఐదుగురు స్పిన్నర్లు రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిఉన్నారు. జస్ప్రీత్ బుమ్రా స్థానంలో హర్షిత్ రాణా జట్టులోకి రాగా, అనుభవ జ్ఞుడైన మహ్మద్ సిరాజ్‌తో పాటు, యువ బ్యాట్స్ మన్ యశస్వి జైస్వాల్, ఆల్ రౌండర్ శివందుబేకు జట్టులో చోటుదక్కింది. భారత మ్యాచ్‌లు దుబాయ్‌లో జరగనున్నాయి. ఇక్కడ ఫాస్ట్ బౌలర్లు సాధారణంగా వన్డే క్రికెట్‌లో ఎక్కువ విజయాలు సాధించారు. 2009 నుంచి దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో 58 వన్డేలు జరిగాయి. వీటిలో ఫాస్ట్ బౌలర్లు ఐదు కంటే తక్కువ ఎకానమీ రేటుతో 466 వికెట్లు పడగొట్టారు. స్పిన్నర్లు 334 వికెట్లు పడగొట్టారు. వీరి ఎకానమీ రేటు 4.2గా నిలిచింది. దుబాయ్‌లోని పిచ్ షార్జా కంటే బౌలర్లకు ఎక్కువగా సహాయపడుతుంది. ఇక్కడ ఫాస్ట్ బౌలర్లు విజయం సాధిస్తున్నారు. అందుకే పాకిస్తాన్ జట్టులో ఎక్కువ మంది ఫాస్ట్ బౌలర్లను ఎంపిక చేసుకుంది. అయినప్పటికీ ఇక్కడ ఎక్కువ మ్యాచ్‌లు ఆడాల్సిన అవసరం లేదు.

ఐదుగురు స్పిన్నర్లను తీసుకునే వ్యూహం కూడా అర్థం చేసుకోలేనిదిగా ఉందని అంటున్నారు. అయితే, చక్రవర్తి అద్భుతమైన ఫామ్ కారణంగా ఎంపికయ్యాడు. అతను 2021 టీ20 ప్రపంచ కప్‌లో ఇదే మైదానంలో విఫలమైన సంగతి గమనంలో ఉంచుకోకపోవడం విశేషం. ఛాంపియన్స్ ట్రోఫీ లీగ్ దశలో భారత్ బంగ్లాదేశ్, పాకిస్తాన్, న్యూజిలాండ్ జట్లతో ఆడనుంది. చక్రవర్తి ఇంతకు ముందు ఈ జట్లతో ఆడలేదు. జడేజా, అక్షర్ ఆడటం దాదాపు ఖాయం. చక్రవర్తి ఆడితే కుల్దీప్ జట్టుకు దూరంగా ఉండాల్సి రావొచ్చు.

జస్ప్రీత్ బుమ్రా ఔట్ అయినప్పుడు మహ్మద్ సిరాజ్ స్థానంలో హర్షిత్ రాణాను ఎంచుకోవడానికి గల కారణం కూడా అర్థం చేసుకోలేనిది. సిరాజ్ పాత బంతితో అంత ప్రభావవంతంగా ఆడకపో వడంతో అతడిని పక్కన పెట్టామని కెప్టెన్ రోహిత్ శర్మ చెబుతున్నాడు. యశస్వి జైస్వాల్‌ను ఎందుకు దూరంగా ఉంచారో కూడా స్పష్టంగా లేదు. విరాట్ కోహ్లి తిరిగి వచ్చిన తర్వాత, యశస్వి జైస్వాల్ రెండవ మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు.



## జాతీయ క్రీడల్లో.. తెలంగాణకు 2 కాంస్య పతకాలు

### రాష్ట్ర ఖాతాలో 18 పతకాలు

**న్యూఢిల్లీ:** జాతీయ క్రీడల్లో గురువారం తెలంగాణ రాష్ట్రానికి రెండు పతకాలు లభించాయి. నెట్బాల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో తెలంగాణ జట్టుకు కాంస్య పతకం దక్కగా, షూటింగ్ మిక్స్డ్ స్కీట్ టీమ్ ఈవెంట్లో బత్తుల మునేక్-రష్మీ రాథోడ్ జోడీకాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. డెహ్రాడూన్‌లో జరుగుతున్న జాతీయ క్రీడల్లో భాగంగా నెట్‌బాల్‌లో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ జట్ల మధ్య జరిగిన కాంస్య పతకం మ్యాచ్ 31-31 పాయింట్లతో డ్రాగా ముగిసింది. దాంతో రెండు జట్లకు కాంస్య పతకాలు ఖరారయ్యాయి. తెలంగాణ నెట్‌బాల్ జట్టు తరఫున బోడ విక్రమ్ రెడ్డి, అబ్దుల్ ఖాన్, అబ్దుల్ షరీఫ్, మొహమ్మద్ ఖాజాయుద్దీన్, శ్రవణ్ కుమార్, రఘునందన్, పులి రితికరెడ్డి, గేయశ్రీ, శ్రుతి, గోపీ చంద్రిక, ముద్దం కీర్తన, సంహిత ప్రాతినిధ్యం వహించారు. అలాగే షూటింగ్ మిక్స్డ్ స్కీట్ ఫైనల్లో ఆరు జోడీలు పోటీపడ్డాయి. 138 పాయింట్లతో ఇషాన్ సింగ్-రైజా ధిల్లాన్ (హరియాణా) జంట స్వర్ణం దక్కించుకోగా, భవతేజ్ సింగ్-గనీమత్ సెఖో న్ (పంజాబ్) ద్వయం రజతం సంపాదించింది. 133 పాయింట్లతో మునేక్-రష్మీ జంటకు కాంస్యం లభించింది. కాగా ఇప్పటి వరకూ తెలంగాణ 18 పతకాలతో (3 స్వర్ణాలు, 3 రజతాలు, 12 కాంస్యాలు) 26వ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ 14 పతకాలతో (7 స్వర్ణాలు, 1 రజతం, 6 కాంస్యాలు) 18వ స్థానంలో కొనసాగుతోంది.

## ఓపెన్ టెన్నిస్ టోర్నీలో .. క్వార్టర్ ఫైనల్లోకి రిత్విక్ జోడీ



**న్యూఢిల్లీ:** డెల్‌రే బీచ్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్ పురుషుల డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశిం చాడు. అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన ఈ టోర్నీ తొలి రౌండ్లో రిత్విక్ చౌదరీ (భారత్)-నికోలస్ బారింటోస్ (కొలంబియా) ద్వయం 7-6 (7/4),7-6 (7/5)తో రొంబోలి-జొర్మాన్ (బ్రెజిల్) జంటపై గెలిచింది.

1 గంట 40 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-బారింటోస్ జోడీ మూడు ఏస్లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. రెండు సెట్లలో ట్రైబ్రేక్‌లో రిత్విక్- బారింటోస్ ద్వయం పైచేయి సాధించింది. ఇదే టోర్నీలో ఆడు తున్న శ్రీరామ్ బాలాజీ (భారత్)- మిగెల్ రేయస్ వరేలా (మెక్సికో) జంట కూడా క్వార్టర్ ఫైనల్లోకి ప్రశించింది.

## వన్డే సిరీస్‌లో... ఆస్ట్రేలియాకు ఘోర అవమానం

### శ్రీలంక చేతిలో 2-0తో చిత్తు




**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు వరల్డ్ ఛాంపియన్స్ ఆస్ట్రేలియాకు ఘోర అవమానం జరిగింది. శ్రీలంకతో జరిగిన రెండు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో ఆసీస్ 0-2 తేడాతో చిత్తుగా ఓడింది. శుక్రవారం జరిగిన రెండో వన్డేలో ఆసీస్ 174 పరుగుల భారీ తేడాతో పరాజయంపాలైంది. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు గాయాలతో సతమతమవుతున్న ఆసీస్‌ను ఈ పరాజయం మరింత కృంగదీసింది. కొలంబోవేదికగా జరిగిన రెండో వన్డేలో శ్రీలంక టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఇన్నింగ్స్ ప్రారంభంలోనే శ్రీలంక ఓపెనర్ పథుమ్ నిస్సంక (6) వికెట్ కోల్పోయింది. అయితేనిషాన్ మధుష్క (51), కుసాల్ మెండిస్ (101) రెండో వికెట్‌కు 98 పరుగులు జోడించి లంక ఇన్నింగ్స్‌కు జీవం పోశారు. మధుష్క ఔటైన అనంతరం కుసాల్ మెండిస్, కెప్టెన్ అసలంక (78 నాటౌట్) సహకారంతో ఇన్నింగ్‌ను నిర్మించాడు. మెండిస్, అసలంక నాలుగో వికెట్‌కు 94 పరుగులు జోడించి తమ జట్టును భారీస్కోర్ దిశగా తీసుకెళ్లారు. ఇన్నింగ్స్ చివర్లో అసలంకతో కలిసి జనిత్ లియనాగే (32 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. ఫలితంగా శ్రీలంక నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 281 పరుగులు చేసింది. ఆసీస్ బౌలర్లలో డ్వార్షుయిష్, ఆరోన్ హార్డీ, సీన్ అబాట్, ఆడమ్ జంపా తలో వికెట్ పడగొట్టారు. అనంతరం 282 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఆస్ట్రేలియా వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి ఆదిలోనే ఓటమిని ఖరారు చేసుకుంది. తొలుత ఆసీస్‌ను అశిత ఫెర్నాండో (4-0-23-3) ఇబ్బందిపెట్టాడు. ఆతర్వాత దునిత్ వెల్లలగే (7.2-0-35-4), వనిందు హసరంగ (7-2-23-3) ఆసీస్ భరతం పట్టారు. లంక బౌలర్ల ధాటికి ఆసీస్ 100 పరుగులు చేయడం కూడా అసాధ్యమనిపించింది. మొత్తానికి ఆసీస్ 24.2 ఓవర్లలో 107 పరుగులు చేసి ఆలౌటైంది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో స్టీవ్ స్మిత్ (29) టాప్ స్కోరర్ కాగా, జోస్ ఇంగ్లిస్ (22), ట్రవిట్రస్ హెడ్ (18) మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగలిగారు.

## ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో.. సెమీఫైనల్ బెర్త్ కోసం పోరు




**న్యూఢిల్లీ:** ఆసియా మిక్స్‌డ్‌టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు కాంస్య పతకాన్ని నిలబెట్టు కునేందుకు విజయం దూరంలో నిలిచింది. క్వార్టర్ ఫైనల్లో జపాన్ జట్టుతో భారత్ తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే సెమీ ఫైనల్లోకి ప్రవేశించి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంటుంది. కింగ్డావో (చైనా)లో జరిగిన గ్రూప్ డి చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 2-3తో దక్షిణ కొరియా జట్టు చేతిలో పోరాడి ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టోద్వయం 21-11, 12-21, 15-21తో కిడాంగ్ జు-జియోంగ్ నా యున్ (కొరియా) జంట చేతిలో పరాజయం పాలయింది. రెండో మ్యాచ్‌లో మాళవిక బన్సోద్ 9-21, 10-21తో సిమ్ యు జిన్ చేతిలో పరాజయం పాలైంది. దాంతో భారత్ 0-2తో వెనుకబడింది. మూడో మ్యాచ్‌ల సతీశ్ కుమార్ కరుణాకరన్ 17-21, 21-18, 21-19తో చో జియోన్‌యోప్‌పై గెలుపొందాడు. ఇక నాలుగో మ్యాచ్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ ద్వయం 19-21, 21-16, 21-11తో కిమ్ ఇన్ జి-కిమ్ యు జుంగ్ జంటను ఓడించడంతో స్కోరు 2-2తో సమమైంది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో సాతిక్వ సాయిరాజ్-అర్జున్ జంట 14-21, 21-23తో జిన్ యోంగ్-నా సుంగ్ సెయోంగ్ జోడీ చేతిలో ఓడిపోవడంతో భారత ఓటమి ఖరారైంది.


# క్వాలిటీ పవర్ ఐపిఒ షురూ

**ముంబై, ఫిబ్రవరి 14:** హై వోల్టేజ్ ఎలక్ట్రిక్ డివైజెస్ అండ్ పవర్ సొల్యూషన్స్ సంబంధిత ఉత్పత్తులను తయారు చేసే క్వాలిటీ పవర్ ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్స్ ఐపిఒ శుక్రవారం సబ్‌స్క్రిప్షన్ కోసం ప్రారంభమైంది. వచ్చే వారు ఫిబ్రవరి 18న మూసివేయబడుతుంది. రూ.858.70 కోట్ల ఐపిఒలో రూ.225 కోట్ల విలువైన కొత్త షేర్లు జారీ చేస్తుంది. అదనంగా ఇప్పటికే ఉన్న 1.49 కోట్ల షేర్లు కూడా అమ్మకానికి అందుబాటులో ఉంటాయి. ఐపిఒ ద్వారా సేకరించిన డబ్బును వివిధ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తామని క్వాలిటీ పవర్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ భరణీధరన్ పాండియన్ తెలిపారు. కొంత డబ్బు మెహ్రూ ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్ ఇంజినీర్స్ కంపెనీని కొనుగోలు చేయడానికి ఉపయోగించనుంది. కొంత మొత్తాన్ని కొత్త ప్లాంట్ అలాగే మెషినరీ కొనుగోలు చేయడానికి ఉపయోగిస్తారు. ఆ కంపెనీ మరికొన్ని కంపెనీలను కొనుగోలు చేసి కొత్త వర్క్ ప్రారంభించాలని కూడా యోచిస్తోందని, అయితే ఈ డబ్బును అందులో కూడా పెట్టుబడి పెట్టడం విశేషం. కంపెనీ షేరు ధరను రూ.401 నుంచి రూ.425 వరకు నిర్ణయించింది. పెట్టుబడిదారులు కనీసం 26 షేర్లకు బిడ్ చేయవచ్చు. శుక్రవారం ఐపిఒ ప్రారంభానికి ముందు క్వాలిటీ పవర్ ఐపిఒ గ్రే మార్కెట్ ప్రీమియం దాదాపు రూ.14 కోట్ చేసింది. ఇది ఐపిఒ ధర కంటే 3.29శాతం ఎక్కువ. ఈ ఐపిఒలో పెట్టుబడి పెట్టడం దీర్ఘకాలికంగా ప్రయోజనకరంగా ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు. క్వాలిటీ పవర్ ఎలక్ట్రికల్ ఎక్విప్ మెంట్స్ 2001లో స్థాపించబడింది. ఈకంపెనీ అధిక-వోల్టేజ్ విద్యుత్ ఉత్పత్తులు, విద్యుత్ నాణ్యత వ్యవస్థలను తయారు చేస్తుంది. దీనికి ప్రపంచవ్యాప్తంగా కస్టమర్లు ఉన్నారు. ప్రస్తుతం కంపెనీ ప్రపంచంలోని 100కిపైగా దేశాలకు ఎగుమతి చేస్తుందని పాండియన్ చెప్పారు. వీటిలో అమెరికా, చైనా వంటి దేశాలు కూడా ఉన్నాయి. నిజానికి ఈ కంపెనీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న కస్టమర్లకు ఇంధన రంగంలో కీలకమైన పరికరాలు, సాంకేతికతను అందించే భారతీయ కంపెనీ. ఈ కంపెనీ విద్యుత్ గ్రిడ్ కనెక్టివిటీ అండ్ ఎనర్జీ ట్రాన్స్ఫర్మేష కోసం అధిక వోల్టేజ్ విద్యుత్ పరికరాలు ఇంకా పరిష్కారాలను అందిస్తుంది.




## జియోలో డిస్నీ హాట్‌స్టార్ విలీనం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** రిలయన్స్‌కు చెందిన వయాకామ్ 18, స్టార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ విలీన ప్రక్రియ పూర్తయిన విషయం విదితమే. 'జియో స్టార్' పేరిట ఈ జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయగా, ఇప్పుడు వీటి ఒటిటి అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. 3 లక్షల గంటల ఎంటర్‌టైన్‌మెంట్, లైవ్ స్పోర్ట్స్ కవరేజీ, 50 కోట్ల మందికిపైగా యూజర్లతో ఇక నుంచి జియోహాట్‌స్టార్ మరింత కొత్తగా ప్రేక్షకుల ను అలరించనుంది. ప్రస్తుతం ఉన్న జియో సినిమా, డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ సబ్‌స్క్రైబర్లు సజావుగా కొత్త సేవలను కొనసాగించుకోవచ్చు. జియోహాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌ను ఎంచుకోవచ్చు అని ప్లాట్‌ఫామ్‌లైన జియో సినిమా, డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌ను కూడా ఒకే వేదిక పైకి తీసుకొచ్చారు. జియో హాట్‌స్టార్ పేరుతో కంపెనీ తమ ప్రకటనలో రాసుకొచ్చింది. జియో సినిమా, డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ విలీనం అవుతాయన్న వార్తలు బయటకు వచ్చినప్పటి నుంచి అనేక నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. జియో హాట్‌స్టార్ పేరుతో కొత్త ఒటిటి ప్లాట్‌ఫామ్ అవతరించబోతోందని వార్తలు రావడం, ఆ డొమైన్ తనదేనంటూ ఓ యాప్ డెవలపర్ ముందుకు రావడం, తన చదువుకయ్యే ఖర్చు రిలయన్సే భరించాలంటూ పేర్కొనడం అందరికీ తెలిసిందే. ఓ దశలో తక్కువ మొత్తానికే రిలయన్స్‌కు ఇస్తానని పేర్కొని ఒక్కసారిగా ఆ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఆపై యుఎఇకి చెందిన ఇద్దరు చిన్నారులు తెరపైకి రావడం, ఈ డొమైన్‌ను ఉచితంగా ఇస్తామని ప్రకటించడం చర్చనీయాంశమయ్యాయి. శుక్రవారం ఈ సంయుక్త సేవలను ప్రారంభించారు. ఈ విషయాన్ని కంపెనీ ఓ ప్రకటనలో వెల్లడించింది. రూ.149 నుంచే సబ్‌స్క్రిప్షన్ ప్లాన్స్




## వచ్చే వారమే ఐఫోన్ ఎస్ఇ 4..


**వాషింగ్టన్, ఫిబ్రవరి 14:** ఐఫోన్‌ఎస్ఇ సిరీస్‌లో నాలుగోతరం మొబైల్ కోసం టెక్ ప్రియులు చాలాకాలంగా ఎదురు చూస్తున్నారు. రెగ్యులర్ మోడళ్ల కంటే అందుబాటులో ధర ఉండడమే దీనికి కారణం. అయితే త్వరలోనే ఆపిల్ నుంచి కొత్త ప్రొడక్ట్ మార్కెట్లోకి లాంచ్ అవ్వడానికి సిద్ధమవుతోంది. ఈ విషయాన్ని ఆపిల్ సిఇఒ టిమ్ కుక్ 'ఎక్స్' వేదికగా స్వయంగా వెల్లడించారు. ఫిబ్రవరి 19న ఆపిల్ నుంచి ఎస్4 మార్కెట్లోకి ఎంట్రీ ఇవ్వనున్నట్లు టిమ్‌కుక్ తెలిపారు. వెండి వర్ణంలో మెరిసిపోతున్న ఆపిల్ లోగోను షేర్ చేశారు. ఏ ప్రొడక్ట్‌ను తీసుకురానున్నారనే విషయాన్ని మాత్రం వెల్లడించనప్పటికీ, ఆపిల్ తన నాలుగోతరం ఎస్ఇ మోడల్‌ను తీసుకురానున్నట్లు మార్కెట్లో చాలాకాలంగా రూమర్స్ ఉన్నాయి. 'మా ఫ్యామిలీలోకి మరో కొత్త మెంబర్ రాబోతున్నారు' అని ఆయన పేర్కొనడం బట్టి ఎస్4అయి ఉంటుందని టెక్ వర్గాలు చెబుతున్నాయి. ఆపిల్ ఐఫోన్లలో ఎస్ఇ సిరీస్‌లకు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. 2022లో చివరగా ఆపిల్ తన ఎస్ఇ మొబైల్‌ను తీసుకొచ్చింది. దాదాపు మూడేళ్ల తర్వాత ఎస్ఇ సిరీస్‌లో కొత్త ఫోన్ వస్తుండడం విశేషం. ఐఫోన్ 14 తరహాలోనే హోమ్ బటన్, టచ్‌ఐడీలేకుండా, ఫేస్ ఐడీ ఫీచర్‌తో ఈ ఫోన్‌ను తీసుకొచ్చే అవకాశంఉందని టెక్ నిపుణులు అంచనా. ఆపిల్ ఇంటెలిజెన్స్, యుఎస్‌బి టైప్-సి పోర్ట్, చిప్‌సెట్‌తోవచ్చే అవకాశముంది. బేస్‌వేరియంట్ ధర రూ.43,900గా ఉండేఅవకాశముంది.



# వాణిజ్యం

## టారిఫ్ భయాలతో సెన్సెక్స్, నిఫ్టీ డౌన్

**ముంబై, ఫిబ్రవరి 14:** దేశీయ స్టాక్ మార్కెట్లు మరోసారి నష్టాల్లో ముగిసాయి. భారత్ సహా ఇతర దేశాలపై రెసిప్రోకల్ టారిఫ్‌లను విధిస్తారనే నిర్ణయాన్ని ట్రంప్ సమర్థించుకోవడం మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. దీంతో వాణిజ్య యుద్ధ భయాల నేపథ్యంలో సూచీలు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఓ దశలో దాదాపు 700 పాయింట్ల మేర నష్టపోగా, నిఫ్టీ కూడా 22,774.85 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరింది. చివరికి సెన్సెక్స్ 199 పాయింట్లు నష్టపోయి 75,939.21 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 102.15 పాయింట్ల నష్టంతో 22,929.25 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.84 వద్ద నిలిచింది. అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, సన్‌ఫార్మా, ఇండస్ ఇండ్ బ్యాంకు, ఎన్‌టిపిసి వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. నెస్లే ఇండియా, ఐసిఐసిఐ బ్యాంకు, ఇన్ఫోసిస్, టిసిఎస్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ 75.44 డాలర్ల వద్ద కొనసాగింది. భారత్ మిత్ర దేశమైనా పరస్పర పన్నుల విషయంలో వెనక్కి తగ్గబోనని ట్రంప్ సున్నితంగా తేల్చి చెప్పారు. భారత్ సహా ఇతర దేశాలపై పరస్పర పన్నులు తప్పవని ఆయన చేసిన వ్యాఖ్యలు మార్కెట్లపై గట్టి ప్రభావమే చూపాయి. అటు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు విక్రయాలు కొనసాగుతుండడం మార్కెట్ల పతనానికి కారణమవుతున్నాయి. డాలర్ విలువ, అమెరికా బాండ్ రాబడులు తగ్గితేనే ఈ విక్రయాలు తగ్గే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.



## మార్కెట్లో టాప్ 10 కార్లు ఇవే..

**ముంబై, ఫిబ్రవరి 14:** దేశంలో ఎస్‌యూవీలను కొనుగోలు చేసే వారి సంఖ్య నిరంతరం పెరుగుతోంది. వినియోగదారులు హ్యాచ్‌బ్యాక్ కార్ల ధరకే మెరుగైన ఎస్‌యూవీలు అందుబాటులో ఉంటున్నాయి. ముఖ్యంగా ఎస్‌యూవీలు ఇచ్చే మైలేజ్ కారణంగా వాటి కొనుగోలుకు కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా టాటా మోటార్స్, హ్యుందాయ్, మారుతి సుజుకి, మహీంద్రా అండ్ మహీంద్రా, కియా, టయోటా వంటి అనేక కంపెనీలు నాలుగు మీటర్ల కంటే చిన్న కాంపాక్ట్ ఎస్‌యూవీలను లాంచ్ చేస్తున్నారు. మీరు కొత్త ఎస్‌యూవీ కొనుగోలుకు రూ.8 లక్షల బడ్జెట్ సెట్ చేసుకుంటే మార్కెట్‌లో అందుబాటులో ఉన్న మంచి కార్లపై ఓ లుక్కేద్దాం. టాటా మోటార్స్ మినీ ఎస్‌యూవీ పంచ్ గత సంవత్సరం బెస్ట్ సెల్లింగ్ కారుగా నిలిచింది. టాటా పంచ్ కేవలం రూ.6 లక్షలు (ఎక్స్ షోరూమ్). ఈ కారు మైలేజ్ కూడా లీటర్‌కు దాదాపు 20.09 కి.మీ.గా ఉంటుంది. హ్యుందాయ్ మోటార్ ఇండియాకు సంబంధించిన చౌకైన ఎస్‌యూవీ ఎక్స్ టర్ ప్రస్తుతం రూ.6.20 లక్షల (ఎక్స్ షోరూమ్)కే కొనుగోలుకు అందుబాటులో ఉంది. ఈ కారు లీటరుకు 19.4 కిలోమీటర్ల మైలేజీని అందిస్తుంది. కియా ఇండియా ఎస్‌యూవీ విభాగంలో అత్యంత ప్రజాదరణ పొందింది. కియా రిలీజ్ చేసిన సోనెట్ ప్రస్తుతం రూ.8 లక్షలు (ఎక్స్ షోరూమ్) నుంచి అందుబాటులో ఉంటుంది. ఈ కారు లీటరుకు 18.4 కిలోమీటర్ల మైలేజీని ఇస్తుంది. దేశంలోని ఎస్‌యూవీల ప్రియుల ఫస్ట్ ఆప్షన్ టాటా నెక్సాన్. ఈ కారు ప్రారంభ ధర కేవలం రూ.8 లక్షలుగా ఉంది. అలాగే ఈ కారు లీటరుకు 17.44 కిలోమీటర్ల మైలేజీని అందిస్తుంది. స్కోడా ఆటో ఇండియా ఇటీవలే సబ్ ఫోర్ మీటర్ కాంపాక్ట్ ఎస్‌యూవీ కైలోక్‌ను లాంచ్ చేసింది. ఈ కారు దర రూ.7.89 లక్షలు (ఎక్స్ షోరూమ్), అలాగే మైలేజ్ లీటర్‌కు 19.68 కి.మీ ఇస్తుంది. మహీంద్రా అండ్ మహీంద్రాకు సంబంధించిన చౌకైన ఎస్‌యూవీ 3 ఎక్స్ఓ ధర రూ.7.99 లక్షలుగా ఉంటుంది. ఈ కారు లీటరుకు 18.89 కి.మీ. మైలేజీని అందిస్తుంది. మారుతి సుజుకి ఫ్రాంక్స్ ఇటీవలి నెలల్లో బాగా అమ్ముడవుతున్న కార్లల్లో ఒకటిగా ఉంటుంది. ఈ కారు అద్భుతమైన లుక్స్, అద్భుతమైన ఫీచర్లు. ఫ్రాంక్స్ ఎక్స్ షోరూమ్ ధర రూ.7.52 లక్షల నుంచి అందుబాటులో ఉంది. ఈ కారు లీటరుకు 21.79 కిలోమీటర్ల మైలేజీని ఇస్తుంది. భారత దేశంలో విక్రయిస్తున్న నిస్సాన్ ఎస్‌యూవీ మాగ్నైట్ తక్కువ ధరకు మంచి మైలేజీతో వస్తుంది. నిస్సాన్ మాగ్నైట్ ఎక్స్ షోరూమ్ ధర రూ. రూ. 6.12 లక్షల నుండి ప్రారంభం అవతుంది. ఈ కారు లీటరుకు 19.4 కిలోమీటర్ల మైలేజీని ఇస్తుంది. టయోటా కిర్లోస్కర్ మోటార్ ఇండియాకు సంబంధించిన చౌకైన ఎస్‌యూవీ అర్బన్ క్రూయిజర్ టైగర్ ప్రస్తుతం భారతదేశంలో రూ. 7.74 లక్షలకు అందుబాటులో ఉంటుంది. ఈ కారు లీటర్‌కు 21.7 కి.మీ. మైలేజీని అందిస్తుంది. రెనాల్ట్ ఇండియాకు సంబంధించిన ప్రసిద్ధ కాంపాక్ట్ ఎస్‌యూవీ కిగర్ ప్రస్తుతం రూ.6 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది. ఈ కారు లీటరుకు 19.17 కి.మీ మైలేజ్ అందిస్తుంది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14